ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 2 సంచిక - 12 సెప్టెంబరు - 2021 కృష్టి పేజీలు 68 వెల రూ. 20



arrivals & departures

# విమానాశ్రయం

లోహ విహంగపు రెక్కలపై
మనుషుల చీమదండులు వేలాడుతున్నారు

మానవాకార సందేహాలు
భయం కాళ్ళతో పొంచుకుంటున్నప్పుడు
ప్రపంచమంతటికీ పంచిన శాంతి సందేశాలు
చావు ముఖంలో వణుకులు పెడుతున్నప్పుడు

చీమల పుట్టలా పగిలి
చెదిరి గువ్వలా తెగి
ఆకలాయి పేనిన తాడు తెగి
గాయపడ్డ వేసవిపిట్టలా
రన్ వే వీధులు రొద పెడుతున్నప్పుడు

తలలు వాల్చేసిన రాకాసి గద్దల
అయస్కాంత వక్షస్థలమీదుగుల మనిష్ట ఒత్తిగిలి
రక్తసిక్త ముఖం పొందరాల్ని, పసిపాపల్ని కావల
మొగ్గ తొడగాలనుకుంటున్నారు

ఏనాటి మబ్బుల బురఖా చెరలోంచి
వెలుతురు పువ్వులు కలవరపడుతున్నాయి
నక్షత్రాల కన్నీరంతా ఎదురు మాపుల
వెండి కలను రాలుతూనే ఉంది
అమ్మ ఒగ్గిప్పెట్లోంచి పండమాను
ముక్కు పంచెల పై ఎగిరెగిరి పడుతున్నారు

గోడలు కూలిపోయి, తీగలు మూగబోయి
రాజా పాలిపోయిన కోట సొరంగం బయట
పడిన నేల మీద; గగనతలం రెక్కలు విరిగి పడి ఉంది

ఈ విమానాలన్నీ
ఖాళీ అయిన ధాన్యాగారం లోంచి
ఎగిరిపోవాలనుకుంటున్న పక్షి పిల్లల్లా ఉన్నాయి
ఈ విమానాశ్రయం, ఎడతెగని సుడిగాలిలాగో
వేలు పెట్టి గుండెలంగా మెలి తిప్పుతున్నది




దేశ్య విడిచిన బందీలవలో
ఏకాకి పక్షుల హాసలో
అమెరికా దర్బారుకు ఒడ్డున, భారత దేశం
తుపాకుల గాజులతో పోతుంది
వదిలేసిన కన్నీటి సంచుల తేలిక
అమెరికా వాలా పాము కుబుసం విడుస్తోంది
దోపిడీ దొంగల కోసం
జన హైనా చీకటిలో పక్షిలా కాలిపోతోంది

ఏ తుపాకులవెన్నంటి ధాటిలకు గురి పెట్టారో
ఏ మరఫిరంగులెంత మెత్తటి మానవ
చరిత్రను బద్దలు కొట్టెనో
నేలకొరిగిన ఎందరి విప్లవకారుల రక్తధారలు
పారిన నదుల్నుదిన్నెప్పు ఆవిరైపోయాయో
ఏ తల్లి గర్భాన్నికి శిశువు కాంతిరేఖనో



ఈ సెప్టెంబరు నెల, కూలిపోయిన ట్విన్ టవర్ల ముందు
షరియత్ స్వప్నం, త్రావాలుల ఘంటిస్తూ ఉరికిస్తున్నది
జనరల్ సి. ఒసామా బిన్ లాడెన్
త్రిగోణత్రితో కరచాలనం చేస్తున్నాడు
సద్దాం హుస్సేన్ చెట్టు చివరి కొమ్మలో
గద్దాంకిన పెద్ద పులి. వైట్ హౌస్ మెట్ల మీద
దర్జాగా సంచరిస్తోంది



మంచుపూల నాలో తుపాకుల్లోంచి
పేలిన తూటాలన్నీ, హెరాత్ లో పొడుచుకొచ్చిన
స్వేచ్ఛగా బావుటాల్లాయింది కవిత్వం చదువుకుంటున్నారు
కొత్త ప్రభుత్వం ఉదయాదాశ్రితాలు
బమియాన్లో ముక్కలవుతున్న బుద్ధుడి పెదవి తల
అడవి లోయల గాయమైన పసిమి మంచు కొస్తున్నది


ఈ జయాపజయాల తంపప్పు కోతలో
దిగంతాలకు చేసిన మృత్యుధూమంలో
అల్లాహో అక్బర్ అజా నాదంలో
తలోంచిన మహాపాపాలాల్లా
ప్రార్థన చెప్పే మహారాజశ్రీ యుద్ధ దేవుడు
పుష్పక విమానాన్నెక్కి, మరలం పిడిపోతున్నాడు

మాటలోపించిన గుర్రపు పేడల
దొడు తీసిన పంజాబీ కొండల పైంచి
తొట్టతున్న ఇనుప తీగ
ప్రాణాలు చేత పట్టుకుని గాల్లోకి తేస్తున్నది

ఇది మహాభినిష్క్రమణం. ఇది పునరాగమనం
ఇదొక పంచభూతాల మానవ సంక్షోభం

శ్రీరామ్
99634 82597



# సాహిత్య ప్రస్థానం


## తెలుగు కీర్తనలు సార్థకమేనా?

గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాలు, ప్రసంగాలు, సత్కారాలు సంతోషకరంగానే సాగాయి. అయితే ఇంగ్లీషు మీడియం దాడి నుంచి బోధనా భాషగా తెలుగును కనీసంగానైనా నిలబెట్టుకోవడానికి పెద్ద పోరాటం నడుస్తున్న పరిస్థితి. ఒక రాష్ట్రంలో సంస్కృతం రెండవ భాషగా వచ్చేస్తే... మరో రాష్ట్రంలో తెలుగు అకాడమీనే తెలుగు సంస్కృత అకాడమీగా మారిపోయింది. కేంద్రం నూతన విద్యా విధానం అమలులో భాగంగా వస్తున్న అనేక అదృశ్య మార్పులు అమ్మభాష అస్తిత్వాన్నే సవాలు చేస్తున్నాయి. సాంకేతిక కోర్సులు తెలుగులో చదువుకోవడానికి కేంద్రం పుస్తకాలు రూపొందించినట్టు చెబుతున్నా వాటికి ఆదరణ ఉండటం లేదు. ఇంగ్లీషులో చదివితేనే భవిష్యత్తు అని అధినేతలు అహోరాత్రులు ప్రవచిస్తుంటే, ఆవిధంగానే ప్రవర్తిస్తుంటే అంతకన్నా భిన్నమైన ఫలితాలు ఊహించడం ఎలా సాధ్యం?

హైదరాబాదులో తెలుగు విశ్వవిద్యాలయంలోనే తెలుగు శాఖలో ఆచార్యులు లేరన్న వార్త పరిస్థితికి అద్దం పడుతుంది. ఇక రాజమండ్రిలోనైతే పూర్తిస్థాయిలో తెలుగు విశ్వవిద్యాలయం రానేలేదు. పదిహేనేళ్ల కిందట అందరం పోట్లాడి సాధించుకున్న ప్రామాణిక ప్రాచీన భాష హోదా కూడా ఈ హడావుడిలో అక్కరకు రాని చుట్టమైంది. తెలుగు భాష ఔన్నత్యం గురించి చెప్పిన ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారి సొంత జిల్లాలో వారి కుటుంబానికి సంబంధించిన ట్రస్టు ఆధ్వర్యంలోని స్థలంలో కొలువుతీరిన ప్రాచీన భాషాధ్యయన కేంద్రం ప్రగతికి నోచుకోవడం లేదు. మండలానికి ఒక పాఠశాలలోనే తెలుగు మీడియం మిగిల్చిన ఎపి ప్రభుత్వ దూకుడుకూ పగ్గాలు లేవు. ప్రాచ్య కళాశాలలు కాలగర్భంలో కలిసిపోగా ఒక సబ్జెక్టుగానైనా తెలుగును కొనసాగించుకోవడం గగనమవుతున్నది. దేశంలో కోట్లమంది నిరుద్యోగులు సంచరిస్తున్నా ఇంగ్లీషులో చదువుకుంటే అవకాశాలు తన్నుకుంటూ వస్తాయనే భ్రమలు విస్తరిస్తున్నాయి. ఉపాధికీ, ఉన్నతికి హామీ ఇవ్వకుండా ఊరికే తెలుగు భాష భజన చేసినా, తమ తెలుగు ప్రేమను చాటుకున్నా ప్రయోజనం శూన్యం. పాలన, న్యాయ, అధికార, బోధనా భాషగా తెలుగును బహుముఖంగా ఆధునీకరించుకోవలసిందే. కంప్యూటర్ యుగంలో సాంకేతికంగానూ పెంపొందించుకోవలసిందే. ప్రపంచీకరణలో స్థానిక భాషలు దేశీయ భాషలు వేగంగా కొడిగట్టిపోతున్న నేపథ్యంలో.. ఈ పనులు చేయాలన్న సంకల్పం గాని, సన్నాహం గాని పాలకులకు లేదు. అది లేకపోయిన తర్వాత తెలుగుకు ఎన్ని కీర్తనలు పాడినా వ్యర్థమే! ■


| ప్రధాన సంపాదకుడు | సంపాదకవర్గం | బొమ్మలు |
| --- | --- | --- |
| తెలకపల్లి రవి | కె.సత్యరంజన్ | తుంబలి శివాజి |
| వర్కింగ్ ఎడిటర్ | కెంగార మోహన్ ◆ వొరప్రసాద్ | చిదంబరం |
| సత్యాజీ | మేనేజర్ : కె.లక్ష్మయ్య | |

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం సెప్టెంబరు 2021

### కథలు


పాత బాకీలు – జి.వెంకటకృష్ణ ............ 5
బతుకు చెట్టు – పివిబి శ్రీరామమూర్తి ..... 19
నలుపు తెలుపులు – పద్మావతి రాంభక్త ....... 47


### కవితలు


దారిపక్క పొలాలు – ఎమ్వీ రామిరెడ్డి .......... 10
నాగలి వెంట నడిచే కవి – కంచరాన భుజంగరావు .. 13
కుంచెవొాకటి – మెట్టా నాగేశ్వరరావు ...... 14
గన్ – సితార్ – వెంకటేశ్ పువ్వాడ ......... 18
గంట – పాయల మురళీకృష్ణ...... 22
ఆవిరైన స్వప్నాలోచనలు – గోపగాని రవీందర్ ...... 25
మగన్యాయం – మందరపు హైమవతి ..... 33
ఆత్మస్తుతి – ఒక శోధన – నిఖిలేశ్వర్ ................ 33
కొక్కెం తిరగబడింది – డాక్టర్ పళని ........ 37
ఊపిరి చెట్టు – కొలిపాక శ్రీనివాస్ .... 37
చెట్టు – వి.రాజగోపాల్ .......... 41
నిర్భయ దిశ కోసం – మల్లేశ్వరరావు ఆకుల .... 42
బింబ ప్రతిబింబాలు – కడెం లక్ష్మీ ప్రశాంతి .... 50
కంటిచూపు – చిన్ని నారాయణ రావు... 54
మాట ముల్లు – రజిత కొండసాని ........ 55
మట్టి చేతులు – మూని వెంకటా చలపతి 55
పురా జ్ఞాపకం – పద్మావతి ................ 56
ఆమెలో నేను – కుంచె శ్రీ ............... 59
రైతు నానీలు – పుట్టి గిరిధర్ ............ 60
ఎన్ని దు:ఖాలు ముసురుతున్నా– గవిడి శ్రీనివాస్ .... 60
వెల్‌డన్ మై సన్ ... – వేణు మరీదు ........... 61
సాహిత్య ప్రస్థానం ఆగస్టు 2021 పురస్కారాలు ......... 24


### వ్యాసాలు


గిరీశం పాత్రతో వక్రబుద్ధులను ఎండగట్టిన గురజాడ ...
– భమిడిపాటి గౌరీ శంకర్ ...................... 11
రాయలసీమ కథాయానంలో మరో మైలురాయి
– పాలగిరి విశ్వ ప్రసాద్ ......................... 15
గిరిజన వెతలు వినిపించే నగారా ధ్వనులు
– డాక్టర్ జి.శైలమ్మ ................................26
సమకాలీన సమాజ దర్పణం దార్ల శతకం
– డాక్టర్ జడా సుబ్బారావు ........................ 29
ఉత్తరాంధ్ర బడుగు జీవుల బతుకు కథ
– పిల్లా తిరుపతిరావు ............................. 34
మానవత్వం పరిమళించే మౌని కథలు
– డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు .........................38
తెలుగు కథ : వృత్తిదారులపై ప్రపంచీకరణ ప్రభావం
– డాక్టర్ కడియాల వెంకట రమణ .............. 43
బహుముఖ ప్రజ్ఞాశాలి మల్లాది
– చెరుకూరి సృజన .............................. 51
వర్తమానం : ఐక్య పోరాటానికి ప్రతిపక్షాల యత్నాలు
– తెలకపల్లి రవి .................................... 52
హైకూల సమ్మోహనం 'పూలరేకులు'
– చిత్తలూరి సత్యనారాయణ ...................... 57
మురికి మనుషుల మూల వేదన 'అశుద్ధ భారత్'
– బడుగు భాస్కర జోగేష్............................ 62
డైరీ .........................................................65



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::
సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# పాత బాకీలు

- జి.వెంకటకృష్ణ

**మె**యిన్ రోడ్డు మీదనే వూరు. రోడ్డు నుంచి వూర్లోకి కారు తిరుగుతూనే ఎదురుగా రాళ్లూ, మొద్దులూ అడ్డం పెట్టున్నారు. పచ్చని కానుగ చెట్ల కిందికి కారును ఆపేసి, ఎలా అన్నట్టు చూసాడు డ్రైవర్. ఎదురుగా వూర్లోకి వెళ్లే రోడ్డు కన్పించినంత దూరమూ సందడిగా వుంది. కళకళలాడుతూ వుంది.

కారు వెనుక సీట్లో మేనేజరూ, సూపర్ వైజరూ వున్నారు. ఇద్దరూ నోటికున్న మాస్క్ తీసి, కార్ విండో గ్లాస్ దించీ, తలలు బైటికి పెట్టారు.

'ఊర్లోకి ఎట్లా పోవల్లా?..' అనడిగారు.

'ఎక్కడికి పోవల్ల సారూ? ఎవురింటికీ?' అక్కడున్న వాళ్లు అడిగారు.

'వీరభద్రారెడ్డి యింటికి' అనంటూనే, 'వెనక్కి తిరిగి, ఆ మోరీ వుందే, ఆ సందులోనుంచీ పోవచ్చును, పోండి.' అని దారి చూపించారు.

'ఊరు సందడిగుందే, యేమన్నా జాతరనా' సూపర్ వైజర్ శ్రీనివాస్ అడిగాడు.

'ఉర్సు, అల్లసామి ఉర్సు' అని జవాబచ్చింది.

'కర్నూలు నుంచి ఆదోని వరకూ యిప్పుడు యా వూర్లో చూసినా జాతర్లూ ఉర్సులూ జరుగుతుంటాయి సార్. పంటలు చేతికి వస్తుంటాయి గదా. ప్రతి వూర్లోనూ పంటలు పండినా ఎండినా జాతర్లు మాత్రం చెయ్యకుండా వుండలేరు.' మేనేజర్ నాతో అంటున్నాడు. అవునన్నట్లు తలూపుతున్నాను.

'పంటలు బాగా పండినోడు బంధువుల్ని పిలుచుకొని యాటలు గోసి డాందూంగా చేస్తాడు. పంటలు పండనోడు సప్పిడి జేయకుండా పడుకుంటాడు. కోపరేటివ్ సంఘాల అప్పులు మాత్రం యెవురూ కట్టాలనుకోరు. బ్యాంకు నాయాళ్లు వాళ్లే వస్తార్లే.. వచ్చినప్పుడు, ఆయింత సేపూ యేందో టంగుటస్కూ చెప్పుకోని గడిపేస్తే, మళ్లా సంవత్సరానికి ఎట్లనో చూసుకోవచ్చు అనుకుంటారు' సూపర్ వైజర్ శ్రీనివాస్ అంటున్నాడు.

'మీకూ పొలం వుంది గదా.. మీ నాయనైనా అంతేనా. ఏం పంట వచ్చింది మీకు' అడిగా.

'మా నాయనైనా అంతే సార్. పంటలకు మంచి రేట్లు వచ్చినప్పుడు యీ సారి దేవర జేద్దాంరా అని, అందర్నీ పిలిచి మూడు నాలుగు యాటలు తెంపుతాడు. ఈసారి మేం ఉల్లిగడ్డ వేసుంటిమి. అంత రేటేమీ రాలేదు. పోయినసారి క్వింటం మూడున్నర వేలు అమ్మినాం. యాసారి పదహైదు నూర్ల కాడినే వుంది. ఇప్పుడు మనం పోతాండే వీరభద్రారెడ్డి నిన్ననే వట్టిమిర్చీ మంచి రేటుకు అమ్మినాడ్సార్, చేతిలో లెక్క వుంది. అందుకే మిమ్మల్ని రమ్మనింది. మేము అడిగీ అడిగీ సాలైపోయింది. మమ్మల్ని చూసీ చూసీ ఆయనకీ అలవాటైపోయింది. మిమ్మల్ని చూసైనా కడతాడని...' శ్రీనివాస్ చెప్పుకుపోతున్నాడు.

కారు తిప్పుకొని వూర్లోకొచ్చాం. అడుగడుగునా జనాలు. ఆడవాళ్లు కొత్త చీరల్లో, ఇండ్ల ముందు అరుగుల మీద కూచొనీ, మగవాళ్లూ కొత్త బట్టలూ భుజాల మీద జారిపోతున్న టర్కీ టవాళ్లతో, హడావుడిగా తిరుగుతూ, సందుమూలల్లో నిల్చొని మాట్లాడుతూ.. మెయిన్ బజార్ పొడువునా రకరకాల అంగళ్లు. రోడ్డు వార వెంబడి తాత్కాలికంగా వేసిన టార్పాలిన్ గుడారాలలో తినుబండారాలు, వంటింటి పాత్ర సామానులు, రైతుల పనిముట్లూ, వూరికి కావాల్సినవన్నీ పెట్టున్నారు. రోడ్డు మీద

రద్దీతో మెల్లగా కదులుతున్న కారులోని మేనేజర్‌నూ, సూపర్ వైజర్‌నూ కొందరు గుర్తుపట్టి పలకరిస్తున్నారు. కారు రెండు సందులు తిరిగి, ఒక పెద్ద మేడ ముందు ఆగింది. ముందు సూపర్‌వైజర్ దిగి, యింటి ముందున్న మనుషుల్ని విచారించి వచ్చి, 'రెడ్డి వున్నాడంట.. పోదాం రాండి సార్' అని... 'కట్టనే కట్టాల ల్యాకుంటే, వేళం వేయాల్సి వస్తుంది. వూర్లో దండోరా కొట్టిస్తాం' అని గట్టిగా చెప్పండ్సార్. దండోరా అంటే కొంచెం కదులుతాడు' కొనసాగించాడు. సరే అన్నట్టు తలూపాను.

ఇల్లు చాలా పెద్దగుంది. కొత్తగా కట్టినట్టుంది. కింద విశాల మైన హాలు, ఖాళీగానే వదిలేశారు. హాలు ఒక మూలనుంచీ మెట్లు పైకి తీసుకుపోయాయి. పైన సౌకర్యవంతంగా వుంది. సంపద ప్రదర్శనకూ కొదవలేదు. సెంట్రల్ ఏసీ. ఇంత స్థితి మంతులై వుండీ అప్పుకట్టని మొండితనాన్ని ఆ గోడలకు ముదురు రంగులుగా కలిపారే అన్పించింది. మమ్మల్ని గురించి సందేశం లోపలికి వెళ్లింది. ఖద్దరు బట్టల్లో పెద్దమనిషి నడిచొస్తుంటే, వెంట వున్న అంతెత్తున్న గోధుమరంగు సీమ కుక్క, మామీదకు దుంకబోయింది.

'ఏరా రంగా.. చరణ్ గాడ్ని కట్టేయరా...' అంటుండగానే పనిమనిషి దాన్ని లాక్కబోయాడు. మా మేనేజర్ గాలి పీల్చు కున్నాడు. రెడ్డిగారు సోఫాలో కూర్చుంటూ మా సూపర్‌వైజర్‌ను ఎగాదిగా చూసాడు.

శ్రీనివాస్ గుటకలు మింగుతూ, 'అన్నా.. మా పెద్ద సారు.. మిమ్మల్ని చూస్తానంటే తీసుకొచ్చినా..' తనదేమీ తప్పు లేదన్నట్టు, సంజాయిషీ గొంతుకతో అన్నాడు. మాస్క్ తీస్తున్న నన్ను అప్పుడు చూసాడు. ఒక్కసారిగా కళ్లలో మెరుపు.

'అర్రే.. మీరా..' అన్నాడు.

'నమస్తే, బాగున్నారా' అన్నాను.

షేక్ హాండ్ యివ్వబోయా, రెండు చేతులు జోడించాడు.

ఇక వచ్చిన విషయం పక్కకు పోయి, పాత మిత్రుల గురించి కాసేపు తవ్వుకున్నాం. మేనేజరూ, సూపర్‌వైజరూ దిక్కులు చూస్తు న్నారు. మంచి కాఫీ తెప్పించాడు. టీపాయ్ మీదున్న, సహజ యోగాకు సంబంధించిన పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని తిప్పుతూ, 'వ్యాపారం యేమీ కలిసిరాలేదు. అందుకే అప్పుబకాయీలు మిగిలిపోయాయి.' అన్నాడు.

'అయితే యీ లోన్ యిచ్చింది వ్యాపారానికి కాదు గదా, వ్యవసాయానికి కదా.. మార్చి నెలాఖరొస్తే బ్యాంకులకు టార్గెట్లు ఫిక్స్ అయి వుంటాయి. ఏం చేయాల' అన్నాను.

'తప్పదా' అన్నాడు. తప్పదన్నాను.

లోనికి పోయి, ఎయిర్ బ్యాగ్ ఒకటి తెచ్చి సూపర్‌వైజర్ ముందు పెట్టి, 'రసీదు బుక్కు తెచ్చుకున్నారా' అన్నాడు.

సూపర్‌వైజర్ తన బ్యాగ్ తెరిచి, రసీదు బుక్ తీసాడు.

'మీవాళ్లు యిలాంటి సరంజామాతో రెడీగుంటారు కదా. మీ సూపర్‌వైజర్ వున్నాడే చానా తెలివైనవాడు. లెక్క ఎక్కువున్నా వాసన పసిగడతాడు.' అని ఎయిర్ బ్యాగ్ జిప్ తెరచీ, నోట్లకట్టలు టీపాయ్ మీద పరిచాడు.

'ఎంతుందన్నా..' మేనేజర్ అడిగితే ..

'ఎంచండీ..'అన్నాడు.

'వ్యాపారమేమీ కలిసిరాలేదు సారూ.. వుద్యోగస్థులు మీకేమి.. మా పరిస్థితులు అర్థం కావు. వ్యవసాయమంటావా, దాని గురించి చెప్పేదానికే లేదు. పెట్టుబడులు ఎక్కిపాయ.. ఎంత పెద్ద రైతుకైనా అప్పులు తప్పవు. వానలు రావు, వచ్చినా దాండ్లనే నమ్ముకొని పెద్ద రైతులు వుండలేరు. నీళ్లుగూడా కొనుక్కోవాల్సిందే.. తాగే నీళ్ళు అనుకునేవు సారూ, పంటనీరు... పంటనీటికే బోర్లకూ పైపులైన్లకూ మేం పెట్టే డబ్బులు మీరు వూహించలేరు. ఇంక విత్తనాలూ, ఎరువులూ, పురుగుమందులూ, సంగతి చెప్పనవస రమే లేదు. దాండ్లగ్గూడా అప్పుకే అడుగుతారు. పంట పండాక యిస్తామంటారు. నేనూ రైతునే.. నా వ్యాపారమంతా అప్పుకే నడిచింది. ఏ పంట ఎప్పుడు ఏ రేటుంటుందో చెప్పేవాడెవుడు? మా రైతులుండారు చూడు.. ఒక్కనికి వుల్లిగడ్డలో రేటు కలిసొచ్చి వాని పంట పండిందనుకోండి.. మళ్లా యేడు అందురూ వుల్లిగడ్డే నాటుతారు. ఆసారి రేటుండదదు. పంట పీకిన ఖర్చులు గూడా రావు. మళ్లాసారి యింకొగడు మిర్చీ వేసుకోని గద్దనబడింటాడు.. వాడ్ని చూసి, యీసారి అందరూ మిర్చీ వేస్తారు. ఇట్ల తిరుగుతానే వుంటుంది. మా లాంటి వ్యాపారస్తులు బాగుపడినట్లే వుంటుంది.. బొక్కబోర్లా పడినట్లూ వుంటుంది. ఊర్లలో వుండే రాజకీయాలకు, వీళ్లను వదిలేకీ వుండదు.'

'మళ్లా.. మీ కంపెనీ మీద సింగపూరూ, థాయిల్యాండూ ట్రిప్పులు కొట్టినట్లుంటివే'.

'వాయబ్బా.. అదంతా ఎనిమిదేండ్ల కిందటి మాట. మొదట్లో బాగానే జరుగుతాండే.. అబద్ధమేమిటికి చెప్పల్లా.. రైతుల్తో అవసరమున్నా లాకున్నా బాగానే కొనిపిస్తుంటుమి. టర్నోవర్ పెంచుతుంటిమి. మళ్లా యిప్పుడు జీరో లెవెల్‌కు వచ్చిండాము.' మాట్లాడుతూనే డబ్బులు లెక్కబెట్టడం చూస్తూనూ వున్నాడు.

'ఎంతుంది' అంటే, 'పన్నెండున్నర లక్షలు వుంది సార్' అన్నాడు మేనేజర్.

'కరెక్టే, లెండి. రిసిప్టు యివ్వండి. మిగతాది వచ్చేవారం కడతా. సార్ను యేసుకోని వచ్చేరా నా యింటికి, ఖాళీ జేయగూడదని యిచ్చినా....' కఠినంగానే వుంది గొంతు.

అప్పుడు చెప్పా, బ్యాంకు పరిస్థితి ఏమీ బాగా లేదు. వీళ్లకు జీతాలు కూడా రికవరీ టార్గెట్ చేరుకుంటేనే వేస్తారు. లేకుంటే లేదు. ఆర్బీయై బ్యాంకు లైసెన్స్ రద్దు చేస్తుందేమోనన్నంత పరిస్థితి వచ్చింద'ని.

'కో ఆపరేటివ్ బ్యాంకులన్నీ నాశనమైపోతున్నాయి' అన్నాడు.

'దానికి మీలాంటి వాళ్లే కారణం..' నవ్వుతూ అన్నాను.

ఆ మాటకు, కో ఆపరేటివ్ లోన్లూ, అందులోని రాజకీయాలూ, బినామీ పేర్లతో లోన్లూ, కమీషన్లూ గురించి అర్థగంట మాట్లాడాడు. చివరకు అన్నాడు.. : 'జనాలకేమన్నా ఫ్రీగా యిస్తాండారా. భూమి తాకట్టు పెట్టుకునే కదా పదీ పదైదు లక్షల రోజుకు యాభై లక్షల విలువ జేసే భూమి పత్రాలు పెట్టుకుంటారు గదా.. ఏం నష్టమూ...' అన్నాడు.

'నిజమే.. భూమి తాకట్టు వుంటుంది. అప్పుకట్టకపోతే, భూమి పత్రాల ఆధారంగా లీగల్ యాక్షన్ తీసుకోవచ్చు. మీరు తీసుకో నిస్తారా. లీగల్ నోటీసు యిచ్చి జప్తు కార్యక్రమం ముందుకు పోనివ్వరు గదా. పెద్ద పెద్ద నాయకులతో ఫోన్లు చేయిస్తుంటారు. దండోరా గూడా వేయనీయరు. ఇంతకు ముందైతే చాలా మొరటుగా వసూలు చేసుకొనేవాళ్లమే. ఇంటిమీద బడి సామాన్లూ, ధాన్యం కూడా జప్తు చేసేదుండేది. రైతు ఆత్మహత్యలు మెండైన తర్వాత, ఆ పద్ధతులన్నీ మార్చేసారు. ఇప్పుడు ఇండ్ల ముందర బ్యాంకు సిబ్బందితో ధర్నాలు వేయిస్తున్నాం. అయినా అప్పు తీసుకున్నప్పుడు ఉండే సంబరం కట్టాలంటే వుండదు. నువ్వనే కాదు, మానవ స్వభావమే అది.'

'నిజమే.. ఏం జేయల్లమల్లా రైతులకు ఆదాయం యాడ్నుంచీ వస్తుందీ. అప్పులు జేయకా తప్పదు. అగసాట్లు పడకా తప్పదు...'

'వ్యవసాయం ఒక పేద్ద విషవలయంలో చిక్కుకోంది. మీరే గాదు, మీమీద ఆధారపడ్డ మేమూ అగసాట్లు పడక తప్పడం లేదు. సరే బయలుదేరుతాం ..'

'భోంచేసిపోండి.. ఉర్సు నాపొద్దు వచ్చి తినకుండా పోతే యెట్లా' అన్నాడు.

'లేదు. తిరిగేది యింకా చాలా వుంది.' అని, కారెక్కాం. కిందకు వచ్చి, 'లద్దగిరిలో ఫలానా రెడ్డి కట్టాడా' అని సూపర్ వైజర్‌ని అడుగుతున్నాడు.

'నాతో కట్టించుకోవడం కాదు. వాళ్లతోని వసూలు జేయండి తెలుస్తుంది' అంటున్నాడు.

'ఏం శీనూ.. మా వూరి బొజ్జన్నతో బంధుత్వముందంటనే.. సంబంధం ఖాయమైనట్లేనా..' అని వినిపించింది.

'అవు, రెడ్డీ.. వుంది. మా నాయనకు మేనమామ కొడుకే. మా నాయనకూ, బొజ్జన్న మామకూ మధ్యా యేందో పాత బాకీ వుందంటా.. ఆ పాత బాకీకి నన్ను చెల్లేయమంటున్నారు' సూపర్ వైజర్ శ్రీనివాస్ చాలా చిత్రంగా మాట్లాడతాడు.

ఊర్లో నుంచి వస్తుంటే దర్గాకాడ దిగాల్సొచ్చింది. అంత రద్దీ వుంది. ఎట్లా దిగాం అనుకొని, దర్గాలోకి పోయాం.

'రాండిసార్.. ఎంతో మహిమ గల స్వామి సార్.' అని లోపలికి తీసుకుపోయారు, మేనేజర్‌కు తెలిసిన వాళ్లు.

ఒకప్పుడు యిదంతా అడవిగా వున్నప్పుడు.. పశులూ గొర్రెలు కాసుకునే వాళ్లకి, యీ ఫకీర్ పెద్ద చింతచెట్టు కింద ధ్యానం చేసుకుంటూ కన్పించేవాడంట. కాళ్లిరిగిన పశువులకు కట్లు కట్టేవాడంట. పసుర్లు తాపేవాడంట. మనుషులకి ఆరోగ్యాలు బాగలేకుంటే వైద్యం చేసేవాడంట. తాయెత్తులు కట్టేవాడంట. ఇక్కడే యీ చెట్టు కిందనే సమాధి అయ్యాడు. అడవి వూరుగా మారింది. అల్లాస్వామికి దర్గా వెలసింది. చుట్టుపక్కల పల్లెలకి ఏటేటా జరుపుకునే ఉర్సు అయ్యింది.

సూపర్‌వైజర్ శ్రీనివాస్ దర్గాకు సదివింపులు చదివించాడు. నెమలికట్టతో మా అందరి నెత్తిపై కొట్టించాడు. బూందీ బత్తాసులు తినిపించాడు. ఆకుపచ్చని వస్త్రం కింది నిద్రిస్తున్న యీ సూఫీ సన్యాసి చుట్టూ ప్రశాంతతను వెదజల్లుతున్నాడు. ఈ ఫకీర్ నెనర్లు యింతమంది కింది కులాల పేదలను ఒక్కటి చేస్తున్నదంటే అది గొప్ప విషయమే కదా అనిపించింది.

దర్గా నుంచి బయటకు వస్తుంటే, సూపర్ వైజర్ శ్రీనివాస్‌ను పట్టుకున్నారు.. : 'యారా శీనూ.. మీ మామోళ్లింటికి రానంట రావోయ్..'

'పెద్దసార్తో వచ్చినా.. యిప్పుడు కాదులే. గమ్మునుండు' మెల్లగా చెబుతున్నాడు.

ఈలోపు శ్రీనివాస్, దర్గాకు వచ్చిన వాళ్లలో ఒక అప్పుదారున్ని పట్టుకున్నాడు.

'జక్రయ్యా.. నీ పొలం పోతుంది చూడీ. నువ్వు పట్టించు కోకుండా తప్పించుకొని తిరుగుతుండావ్. తీసుకున్నా పొద్దునుంచీ ఒక్క పైసా గూడా కట్టకుండావు. ఇది పద్ధతి కాద్నాడీ.' అని గట్టిగా అరుస్తున్నాడు.

వీరభద్రారెడ్డి ముందు గొణిగినవాడు జక్రయ్యను మాత్రం గొంతు పట్టుకుంటున్నాడు. ఎంత తేడా అనిపించింది!

జక్రయ్య తలదించుకొని, 'లోన్ మొత్తం నేనెక్కడ తీసుకుంటి సా.. మీ బ్యాంకులోనే పనిచేస్తాన్నాడే మాయన్న కొడుకూ తీసుకునా, కావాలంటే సెక్రెటరీ మద్దిలేటి రెడ్డిని అడగండి.'

'సూడబ్బా.. డబ్బులు యెవురు తీసుకుండారో నాకు తెలీదు. అబ్బుడు నేను లేను. లోనుకు తాకట్టు పెట్టింది నీ పొలమూ, లోను అప్లికేషన్లో సంతకాలు పెట్టింది నువ్వు. తెలిసి పెట్నావో, తెలీకుండా పెట్నావో.. రెండున్నర లక్షలు మూడింతలైంది, ఒక్క పైసాగూడా కట్టలేదు. ఇప్పుడు జప్తు కొచ్చింది. నీ అన్న కొడుకుతో మాట్లాడుకొని సర్దుబాటు చేసుకుంటే మంచిది. లేదంటే దండోరా కొట్టించి వేళమేస్తాం.. బ్యాంకుకు యెబ్బుడొస్తావో చెప్పు...' గద్దిచ్చినట్లే చెప్పాడు. జక్రయ్య నేల చూపులు చూస్తున్నాడు. అతడి వెనకనే భార్యా పిల్లలు వున్నారు. అబ్బాయి డిగ్రీ అయిపోయుం డొచ్చు. అమ్మాయి డిగ్రీ చదువుతూ వుండొచ్చు. దర్గాకు మొక్కుబడి కోసం వచ్చినట్టున్నారు.

'లేదు సా.. మాయన్న కొడుకు పట్టించుకోకుండా వున్నాడు. నాకా శాతగావట్లేదు. ఇబ్బుడ్నేను వూర్లో లేను సా.. కర్నూల్లో ఆటో యేసుకుంటుండా...'

'నీ యిష్టమబ్బా.. బంగారమట్లా పొలం పోగొట్టుకోవద్దని చెప్తాండా...' అని కారెక్కాడు.

సూపర్ వైజర్ శ్రీనివాస్ కొత్తగా వుద్యోగం చేరినవాడు. ముప్పైయేండ్ల లోపువాడు. మంచి యేదన్నా కొంతైనా చేద్దామనే తపన వున్నవాడు. ప్రలోభమనే క్రిమి యింకా తలకెక్కనివాడు.

'ఏంజేయాల సార్.. ఈ ఉద్యోగంలో భయపెట్టేవాళ్ల దగ్గర భయపడాల, భయపడేవాళ్లనే భయపెట్టాల. టెన్షన్ వుద్యోగం అయిపోయింది సార్.' నేనేమీ అడక్కుండానే చెప్పాడు.

'పెళ్లెప్పుడు శ్రీనివాస్' అనడిగా.

'ఏం పెళ్లి చేసుకుంటా సార్. రోజూ రాజకీయ నాయకులనీ, వాళ్ల అనుచరులనీ అప్పులు కట్టమని అడుగుతున్నందుకు పెండ్లి అయితానే వుంది. పెండ్లంటే పెద్ద శిక్ష అని ఎక్కడో కవితలో చదివినట్లు గుర్తు సార్. అప్పులు వసూలు చేయడం కూడా పెద్ద శిక్షనే సార్.' ఆ మాటకు మేనేజరూ, డ్రైవరూ గట్టిగా నవ్వారు.

'ఈ దర్గాలో కోరుకున్న మొక్కులు నెరవేరుతాయంట గదా శీనూ.. బ్యాంకు అప్పులన్నీ తీరివాలనీ, తీరిపోయి పెండ్లి అవ్వాలని మొక్కుకోగూడదా.' మేనేజర్ చమత్కరించాడు.

'నేనొక్కన్ని మొక్కుకుంటే బ్యాంకప్పులన్నీ వసూలు కావు సార్. మీరూ నాకు తోడు మొక్కు మొక్కాల.' శ్రీనివాస్, తానూ చమత్కరించాడు.

'అవును సార్.. మీకు వీరభద్రారెడ్డి ఎట్లా తెలుసు?' అడిగాడు మేనేజర్.

'డిగ్రీలో క్లాస్ మేటండీ' చెప్పా.

'అవునా సార్..' అని యిద్దరూ ఆశ్చర్యపోయారు.

'నాలుగైదేండ్ల కిందట అనుకోకుండా ఎవర్నో బస్సెక్కించ డానికని వెళ్తే కన్పించాడు. తనే పలకరించాడు. నువ్వు ఫలానా కాలేజీలో ఫలానా సంవత్సరాల్లో చదివావు కదా అంటే, అవునన్నా. నేను కూడా తన్ని గుర్తుపట్టాను. ఏం చేస్తున్నావంటే, బ్యాంకుద్యోగ మన్నా. ఎప్పుడన్నా ఫ్లైటెక్కావా అన్నాడు. లేదన్నా. సొంతిల్లుందా అన్నాడు. లేదన్నా. పిల్లల్ని యాడ సదివిస్తున్నావన్నాడు. కర్నూలు మాంటిస్సోరీ స్కూలన్నా. కాదులే నువ్వు క్లాసులో ఫస్టు వస్తుంటివి గదా.. యేముద్యోగమబ్బా నీది, సొంతిల్లు లేదు.. పిల్లోళ్లేమో మామూలు స్కూలు, యింతవరికీ ఫ్లైటెక్కిందిల్యా. వీడు యాటికో పోతాడనుకోంటి.. నువ్వు జూస్తే యాడనే వుండేవా. నేను నిన్ననే థాయ్‌ల్యాండ్ ఫ్లైట్ దిగినా. పోయిన్నెల సింగపూర్ పోయొచ్చినా. మొన్ననే స్కంధా వాళ్ల కొత్త వెంచర్లో కోటి పెట్టి విల్లా కొన్నా. బెంగళూరు ఇంటర్నేషనల్ టెక్నో స్కూల్ తెలుసు గదా.. చాలా ఫేమస్. నా కొడుకును ఆడజేర్చినా' అన్నాడు. నాకు దిమ్మ దిరిగిపోయి, ఇంతకీ ఏం జేస్తున్నావని అడిగా. ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ బిజినెస్ అన్నాడు. 'రైతులకు అవసరమున్నా లేకున్నా విత్తనాలూ ఎరువులూ మందులూ అంటగట్టి కమీషన్లు కొడతా, కంపెనీ పంపే ఫ్లైట్ ట్రిప్పులు తిరుగుతా గొప్పలు చెప్పుకోవద్దు బే.. మీ నాయనా రైతే..' అని భారీ డైలాగ్ కొట్టాలనుకొని, వాడూ వాడి కారూ, దర్పమూ చూసీ, ఒక జీవం లేని నవ్వు నవ్వి, కారెక్కమంటే పక్కనే పనుందని ఆ రోజు తప్పించుకున్నా. అయితే తల మీద సరైన బదులు చెప్పలేకపోతినే అనే పెద్ద బరువు మోసుకొని తిరుగుతున్నా. ఈరోజు అనుకోకుండా ఆ పాత బరువును దించుకున్నానబ్బా...' చెప్పగానే గట్టిగా నవ్వారిద్దరూ.

'సో, మీ పాతబాకీ తీరిపోయింది సార్' అన్నాడు మేనేజర్.

'అవునండీ.. మీరిద్దరూ యీ రికవరీకి నన్ను రమ్మనడం ద్వారా తీరిపోయింది. అవును యిందాకా, శ్రీనివాస్ యేదో వాళ్ల నాయన పాత బాకీ గురించి వీరభద్రారెడ్డితో అంటుండెనే' అని గుర్తు చేసుకున్నా.

'అదిగూడా వింటిరా సార్. ఏమీలా సార్.. ఈ వూర్లో వుండే మా బొజ్జన్న మామ, మీ యింట్లో పెండ్లి చేసుకుంటా మీ చెల్లెల్ని నాకీరా అని మా నాయన్ను అడిగున్నెంట. అప్పట్లో మా వాళ్ళు యేమనుకున్నారో యేమో మా నాయన చెల్లెల్ని యీయనకీలేదంట. దాంతో అప్పుడ్నుంచీ అలిగి మా నాయనతో మాట్లాడేవాడు కాదంట. ముప్పైయేండ్లు అయిపాయ.. యాడన్నా పెండ్లిడ్లకూ దేవర్లకూ ఎదురైనబ్బుడు, పలకరించేది లేదు. బంధువులతో వాడు మాకు మేనత్త కొడుకయ్యీ మమ్మల్ని దూరం పెట్టాడని అంగలార్చేది. మొన్న అనుకోకుండా ఎదురైనబ్బుడు, ఇంగిబ్బుడన్నా నీ కొడుక్కన్నా నా బిడ్డను చేసుకోండిరా' అని అడిగినాడంట. అబ్బుడు నీ చెల్లెల్నిమ్మని అడిగినా యీకపోతిరి. ఇబ్బుడు టీచర్ ట్రైనింగ్ చేసిండే నా బిడ్డను చేసుకోమనీ అడుగుతుండా, మన రెండు కుటుంబాలు కలుసుకుందాం బావా, అనేలకి మా నాయన కరిగిపోయినాడు. మనం చేసుకోవల్లరా ఆ పాపను, టీచర్ ట్రైనింగ్ చేసిందంట, ఇద్దరూ వుద్యోగాలు చేసుకుంటా బతుక్కుంటారు. వానికి ఒకే కూతురు, నీకు మర్యాదలకి తక్కువ జేయదు. అట్లన్నా మా పాత బాకీ తీరిపోయ్యేను' అంటున్నాడు సార్.. మా నాయన. ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సింది నేనే' అన్నాడు.

'సో.. నీది కుటుంబ సంబంధాల పాత బాకీ. నీ నిర్ణయం ఆ బాకీని తీర్చుతుందో, యింకా పెంచుతుందో చూడాలి. మరి, ఆ జక్రయ్య బాకీ. సంగతేంది..' అడిగా.

'సార్ ఆ కేసులో జక్రయ్యను మోసం చేసినారు సార్. మన బ్యాంకులోనే జక్రయ్య పెద్దన్న కొడుకు జోసెఫ్ అని వున్నాడు.

ఈ బ్రాంచిలో పనిచేస్తున్నప్పుడు తన పర్సనల్ లోన్ తీర్చడానికి, జక్రయ్యతో పొలం పెట్టిచ్చి లోన్ సాంక్షన్ చేయించాడు. యాభైవేలు చేతిలో పెట్టి మిగతాదంతా వాడుకున్నాడు. ఎప్పుడో ఒగప్పుడు లోన్లు మాఫీ వచ్చేవస్తుంది.. అప్పు ఎగిరిపోతుందిపో అని చెప్పి నట్టున్నారు. ఈ మాయకంతా మన సొసైటీ సెక్రెటరీ మద్దిలేటి రెడ్డి కారణం. ఒక్క కంతు కూడా కట్టలే. ఆరేండ్లైపోయింది. మనం లీగల్ యాక్షన్ తీసుకుంటున్నాం. ఊర్లో దండోరా కూడా కొట్టించినాం. భూమి వేళానికొస్తున్నా.. యీ జక్రయ్య పట్టించు కోవడం లేదు. అసలు వూర్లో కాపురమే లేడ్సార్. కర్నూల్లో ఆటో నడుపుకుంటు బతుకుతున్నాడు. మాయమాటలు నమ్మి వున్న ఆధారం భూమిని పోగొట్టుకుంటాడనిపిస్తుంది.'

'మనం యేంజేయొచ్చు యీ కేసులో...'

'మీరేమన్నా జోసెఫ్‌తో మాట్లాడి, ఆయన తీసుకున్న డబ్బుల వరకన్నా కట్టిస్తే జక్రయ్య బరువు తగ్గుతుంది సార్'.

'జోసెఫ్ యిప్పుడు ఎక్కడ పనిచేస్తున్నాడు..'

'పత్తికొండ బ్రాంచిలో సార్.. మేం చెప్పినామని తెలిస్తే, మామీదికొస్తాడ్సార్..'

'ఊహూ.. అట్లనా. చేసిన అన్యాయాన్ని గుర్తు చేస్తే మీదికొస్తాడా. పేదరైతునైతే గల్లా పట్టుకుంటాం.. బలిసినోణ్ణైతే, కాళ్లుపట్టుకొని అడుక్కుంటాం.. మనోడైతే చూసీచూడనట్లు వదిలేస్తామా? భలే వుందబ్బా మన పద్ధతి..'

'మొన్న మా బ్రాంచి రివ్యూ జరిగినప్పుడు, యీ విషయం చర్చకు వచ్చింది. సెక్రెటరీతోనూ, జోసెఫ్‌తోనూ శ్రీనివాస్ మాట్లా డాడు. దానికి జోసెఫ్ చాలా కోపగించుకున్నాడు. 'కొత్తగా వచ్చారు, కొంచెం జోరు తగ్గించుకోండి. అంత కరెక్ట్‌గా వుద్యోగం చేసేవాళ్లైతే రికార్డు ప్రకారం ఎవరి మీద లోనుంటే వాళ్లనే అడగండి దాని ప్రకారమే లీగల్ యాక్షన్ తీసుకోండి.. అంతేగానీ వాడు చెప్పినాడు. వీడు చెప్పినాడని నన్ను యిబ్బంది పెడితే మర్యాదుండ దన్నాడు సార్'.

'అవునా.. ఇంతకీ ఎందుకు పేర్లు వేరేగా వున్నాయి. ఈయన జక్రయ్యా, ఆయనేమో జోసెఫ్. జోసెఫ్ దర్గాలకి రాడా..'

'రాడు సార్. చర్చికి పోతాడు.'

'చర్చిలో పాంప్లెట్లు పంచితే యెట్లా వుంటుంది? అంతకన్నా ముందు ఇంటి ముందు ప్లకార్డులు పట్టుకొని మౌన ప్రదర్శన చేస్తే యెట్లా వుంటుంది. నేను హెడాఫీసులో మాట్లాడతా. స్వంత ఆర్గనైజేషన్‌కూ, స్వంత అన్నదమ్ములకూ అన్యాయం చేసేవాడ్ని యెందుకు వూరికే వదలాల..'

'పాంప్లెట్లో యేం రాస్తాం సార్. అది ఎవరు రాయాల సార్'

'కథ రాస్తాం. జరిగిన కథే రాస్తాం.. నేనే రాస్తా. పంచుతారా'

'స్సార్..'

'మీమీదకు రాదు. నామీదనే చెప్పండి. మన వుద్యోగైనవాడ్నే మనం వంచకపోతే.. యింకెందుకీ వుద్యోగం. మనమేమన్నా అన్యాయం చేస్తున్నామా.. మొదట న్యాయం చేయమని అడిగి, ఆయన స్పందన బట్టి, ముందుకుపోదాం.'

'సార్ నిన్ననే జక్రయ్య లోను గురించి మాట్లాడుకున్నాం. ఈ లోన్ రికవరీ అయితే నా పెండ్లి అయినట్లే సార్ అన్నాడ్సార్ శ్రీనివాస్. ఈ రోజు ఆ లోన్ రికవరీ పరిష్కారం మీరు చేస్తు న్నారు.. చూస్తుంటే శ్రీనూ పెళ్లి అయ్యేట్లే వుంది సార్.' మేనేజర్ హుషారుగా అంటున్నాడు.

'మరి పత్తికొండ యెప్పుడు వెళ్దాం సార్.'

'ఎప్పుడో ఎందుకు? ఇప్పుడే. జోసెఫ్‌తో యిప్పుడే పోయి మాట్లాడుదాం. మద్దిలేటి రెడ్డిని కూడా రమ్మనండి...'

'డ్రైవర్.. చలో పత్తికొండ..' సంబరంగా శ్రీనివాస్.

◆◆◆

వారం రోజుల తర్వాత...

సోమవారం నాపొద్దు.. లంచ్ టైంలో, మేనేజర్ ఫోన్ చేసాడు.

వీరభద్రారెడ్డి, మిగిలిన బకాయీ కట్టిపోయాడనీ, జక్రయ్య లోన్లో జోసెఫ్ మూడు లక్షలు కట్టి రశీదు తీసుకొనిపోయాడనీ, శ్రీనివాస్‌కు నిన్న ఆదివారం వాళ్ల బజ్జన్న మామ కూతురుతో ఎంగేజ్మెంట్ అయ్యిందనీ, ఎంగేజ్మెంట్‌కు వీరభద్రారెడ్డి కూడా వచ్చి, కరోనా మూడో వేవ్ వచ్చేలోపలే పెళ్లి అయిపోగొట్టమని చెప్పాడనీ, 'ఇదంతా అల్లస్వామి దర్గాకు పోయొచ్చినందుకే అయ్యింది చూడ్సార్' అని ముక్తాయించాడు.

శుభం అనుకున్నా. ■

## అసలుకే మోసం

**అ**న్నం పెట్టే రైతన్నేమో
పస్తులుండలేక నిత్యం
కన్నీళ్లు పెడుతున్నాడు!
తిన్నదరగని మనిషేమో
ఉండబట్టలేక
అతను పెట్టిన అన్నానికే
ఎసరు పెడుతూ
అసలుకే మోసం తెస్తున్నాడు!

**- జవేరియా**

**98499 31255**

# దారిపక్క పొలాలు

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870



**దు**మ్ము రాలుతోంది
మొక్కలమీదా
వాటి పూలమీదా కాయల మీదా
వాహన భూతాలు
రోడ్డుతో సంగమించినంత పొడుగూతా
దుమ్ముదయ్యాలు పైకిలేచి
జాలరి వలల్లా పొలాల మీద వాలుతున్నాయి
రాక్షస రబ్బరు పాదాల కింద నలిగిన మట్టి
ధూళిమేఘాలై గట్లు మాయం చేస్తోంది

దుమ్ము రాలుతోంది
పచ్చటి శరీరాలపై ఇసుక తుపానులా
విచ్చుకుంటున్న పూలపై ఇనుప రజనులా
పక్వానికొచ్చిన పచ్చికాయల లేతముఖాలపై
ఆమ్లవర్షంలా

దుమ్ము రాలుతోంది
కుంటమీదా కుదుళ్లమీదా మొదుళ్లమీదా
ఆఖరికి
కూలీల కళ్లమీదా
వాళ్లు తీసి మోపులు గడుతున్న పత్తిగోతాలమీదా
బాంబులు బద్దలై భళ్లున చిందిన గాజుపెంకుల్లా
దుమ్ము రాలుతోంది!

భరోసా లేకున్నా
పురుగును చంపే మందులుంటాయని నమ్మకం
వానలు లేకున్నా
చెరువుకుంటలు ఆరుతడిగా ఆదుకుంటాయని ఆశ
అదుపు కాకున్నా
కలుపుమొక్కల్ని కట్టడి చెయ్యటమెట్లాగో తెలుసు–
'దుమ్ము'లగొండిని హతమార్చే ఆయుధమేదీ
దుమారాల్ని మాయం చేసే మందుగుళికలేవీ
లోహపురొదను అడ్డుకునే నాగలి గీతలేవీ?

నేలను దుమ్ము చెయ్యొచ్చు
దుమ్మును వమ్ము చెయ్యటమెట్లా?
పరిమళం కోల్పోయిన పంటను కొనేదెవరు?
అనివార్యపు అప్పులమంటను ఆర్పేదెవరు
పంటభూముల మొహాన మన్నుగొడితేనే
ప్రపంచస్థాయి నగరాలు మొలుస్తాయా?

అసలింతకీ
దారిపక్క పొలాల కళ్లల్లో
దుమ్ము కొడుతున్న నేరగాళ్లెవరు?

■



# గిరీశం పాత్రతో వక్రబుద్ధులను ఎండగట్టిన గురజాడ

- భమిడిపాటి గౌరీశంకర్

'**చి**న్నతనంలో బొమ్మలాట నేర్చి ఉండటం చేత లోకమనే రంగంలో చిత్ర కోటి రీతులను ఆటాడే మనుష్యులనే పాత్రల సొగసును కనిపెట్టడము నాకు అలవాటైంది. సొగసులేని మనిషే లేడు. స్నేహము, ప్రేమ అనేవి అనాది అయిన్నీ, ఎప్పటికీ కొత్తగా ఉండే రెండు వెలుగులను నరుని మీద తిప్పికాంచితే వింత, వింత సొగసులు బయలుదేరతవి. అసూయ అనే అంధకారంలో అంతే ఏక నలుడే' – ఇది తన పాత్ర చిత్రణ గురించి 'గురజాడ' వ్యాఖ్యానం.

గురజాడ మహాకవి – తన రచనల ద్వారా సమాజంలో స్త్రీ సమస్యలను తన రచనల ద్వారా బహిర్గతం చేసి, వారిని ప్రశ్నించమని, 'ధ్వని'ంచమని చెప్పిన రచయిత, కవి, నాటక కారుడు. 'కన్యాశుల్కం' నాటక రచన గురజాడకు శాశాత్వమైన కీర్తిని తెచ్చిందనడం అతిశయోక్తి కాదు. ఆయన రచనా చమత్కృతి, పాత్రల చిత్రణ, భాషాపటిమ ఆనాటి సాంఘిక సమాజ చిత్రణలో 'నగ్నత్వం' వంటివి ఆయన రచనలో ప్రయోగాత్మకంగా, జనరంజకంగా చెప్పినా అవి ఈ నాటికి సమాజలో 'రూపం మార్చుకొని' తిష్ట వేసుకొనే ఉన్నాయి.

'కన్యాశుల్కం' తొలి ప్రతి 1897లో వచ్చింది. రెండో కూర్పు 1909లో వచ్చింది. ఇందులో మొత్తం 14 పాత్రలు ఉన్నాయి. 'కన్యాశుల్కం' వచ్చి ఒక శతాబ్దానికి పైగానే జరిగింది. కాని ఇందులోని పాత్రలు తెల్లవారితే నేటికి మనకు కళ్ళముందునే కనిపిస్తాయి. దోచుకోబడుతున్నవాళ్ళు, దోచే వారు, వ్యసనపరులు, మోసగాళ్ళు, లుబ్ధులూ, ప్రేమంటే పెద్దగా 'ప్రేమ' లేని గిరీశాలు, మధురవాణి వంటి వారు నిత్యం పరిచయమవుతుంటారు. నిత్య జీవితంలో పలకరిస్తుంటారు. ముఖ్యంగా గురజాడ పాత్రలన్నీ 'వాడుక భాష'లో ఎటువంటి ముసుగులు లేకుండా మాట్లాడతాయి. వాడుక భాషను ప్రతిభావంతంగా తన 'కన్యాశుల్కం'లో ఉపయోగించుకొని గురజాడ స్రష్టగా నిలిచారు. ఏ పాత్రను తీసుకొని చూసినా ఆ భాషా చాతుర్యం కనిపిస్తుంది.

పాత్రల సృష్టిలో రచయిత 'తను చూసిన' వ్యక్తులను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఉంటారు. గురజాడ వారు 'కన్యాశుల్కం'లో కూడా తన భావనలకు, ఊహలకు రచనా రూపం కల్పించి తదనుగుణమైన పాత్రలను, వాటి పరిచయ రంగాలను ప్రేక్షకులకు పరిచయం చేస్తారు. షేక్స్పియర్ నాటకాల్లో కథాంశాన్ని కథ ప్రారంభంలోనే 'ధ్వని' మాత్రంగా చెప్పటం జరుగుతుంది. గురజాడ వారు సృష్టించిన 'గిరీశం' కూడా అదే చేస్తాడు. నాటకం అతనితోనే ప్రారంభమవుతుంది. అతనితోనే ముగుస్తుంది. అతను పరిచయం 'బొంకులుదిబ్బ' ప్రాంతం. 'బొంకులు' అనగా అబద్ధాలు. గిరీశం చెప్పేవన్నీ అవే కదా. ఒక ప్రాంతాన్ని పరిచయం చేస్తూ తద్వారా 'పాత్ర' వ్యక్తిత్వాన్ని కూడా పరోక్షంగా విప్పి చెప్పడం ఓ గొప్ప సృజన. అతను 'నాయకుడు' కాదు. నాడు, నేడు, రేపు కూడా ఎంతో మంది గిరీశాలు మనకు తారసపడుతుంటారు. ప్రజలను 'వెంకటేశాల'ను చేసి దోచుకుంటారు. 'వెంకటేశం'కు గురువుగా గిరీశం చుట్టలు కాల్చటం తప్ప మరేమీ నేర్పలేదు. వర్తమానంలో 'గిరీశం' వంటి గురువులు ఎందరో! 'సోషల్‌రిఫార్మ్' పేరుతో 'సమాజాన్ని' 'సంస్కరణల'ను తనకనుగుణంగా మార్చుకొని 'గొప్పవారుగా' ఎదుగుతారు.

అమాయకులను తొక్కుకుంటూపోతారు. 'తొక్కేసి' వెళ్ళిపోతారు. 'డామిట్.. కథ అడ్డం తిరిగింది', 'కుప్పసామయ్యరు మేడ్ డిఫికల్ట్', 'మనవాళ్ళు వట్టి వెధవాలయ్' 'అన్నీ వేదాల్లో

వున్నాయిష', 'నాతో మాట్లాడటమే ఓ ఎడ్యుకేషన్', 'అట్నుంచి నరుక్కురమ్మన్నారు', 'పొగతాగనివాడు దున్నపోతైపుట్టున్' వంటి అవకాశవాద వ్యాఖ్యానాలతో అవాస్తవాలను, అసహజాలను సహితం 'సహజవాదాలు'గా చిత్రించి, నమ్మించే గొప్ప వాక్చాతుర్యం కలిగిన 'గిరీశాలు' వర్తమానంలో కోకొల్లలు. గొప్ప స్కీమ్‌లతో, మానిఫెస్టోలతో ప్రజలను బురిడీ కొట్టించి మాటలకోటలు కట్టి 'నోట్లో'నే బూరెలు ఊరించి, 'చిటికెనవేలు' మీద స్వర్గాలు నిర్మించే నాయకులు, వ్యక్తులు మనల్ని నిత్యం పలకరిస్తారు. మోసం చేస్తుంటారు. 'ఏడు అంకాల' కన్యాశుల్కం నాటకంలో ఆరు అంకాల్లో గిరీశం కనిపిస్తాడు. కాని అతను కథానాయకుడు కాదు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి గారు 'గిరీశం పైకి చూడటానికి వెకిలి పాత్రగా, ఔచిత్యం పాటించని వాడుగా, విలువలు లేని వ్యక్తిగా, జీవితంలో గాంభీర్యాన్ని నవ్వులపాలు చేసేవాడుగా కనిపిస్తాడు. 'కన్యాశుల్కం' నాటి సామాజిక వాస్తవాలను గురజాడ అర్థం చేసుకొన్న తీరును వాటి మీద ఆయన అభిప్రాయాలను ప్రతిఫలిస్తాడు. కనుక గిరీశం పాత్ర సంకీర్ణ పాత్ర' అంటారు. 'వర్తమాన గిరీశాలు' నేటి సామాజిక వ్యవస్థకు ప్రతిబింబాలు. సమాజంలో పరిస్థితులకనుగుణంగా కొందరు మారిపోతారు. కాని ఆ పరిస్థితులను తమకను గుణంగా కొందరు. 'అతి తెలివి మేధావులు' మార్చుకుంటారు. వారంతా గిరీశాలే! 'ఒపీనియన్సు అప్పుడప్పుడూ ఛేంజ్ చేస్తూంటూనే కాని పొలిటీషియన్ కానేరడు. నాకు తోచిన కొత్త ఆర్గ్యుమెంట్ విన్నావా? అంటూ 'తనదైన శైలిలో 'ఊసరవెల్లి' రాజకీయ నాయకుల్లో గిరీశం 'అంశ' కనిపించక పోతే అది 'ఓటరు' తప్పుకాదు. వారి తెలివితేటలు. తనకు ప్రయోజనం కలిగితే 'వర్తమానాన్ని' పొగడటం, అది లేకపోతే తెగడటం 'గిరీశం' నైజం. 'విధవలైన స్త్రీలను' అవమానించిన గిరీశం 'బుచ్చెమ్మ'పై ప్రేమ (?) కలిగిన తరువాత 'వారిపైన' అపారమైన ప్రేమాభిమానాలు కనిపిస్తాడు. 'విధవా వివాహమే నాగరికత'కు నిగ్గు అయినప్పుడు బాల్యవివాహాలు లేకపోతే నాగరికత ఆగిపోతుందని చెబుతాడు. ఓ అస్పష్టతాపూరిత 'స్పష్ట'త తనకు 'ఉపయోగపడుతుందని' అతని అభిప్రాయం. నిన్నటి వరకు ప్రతిపక్షంలో ఉండి నేడు అధికారపక్షంలో ఉన్నవారు 'ప్రతిపక్షం ప్రగతిని' 'అడ్డుకుంటున్నదని' అంటారు. 'ఆనాడు ప్రతిపక్షం ప్రగతికి మార్గం' అన్నవారు ఇటువంటివారే ప్రేమంటే ఓ సరదాగా భావించే వర్తమాన యువ 'గిరీశం' అంశలైన వారు 'లేవదీసుకొనిపోతే సుఖము, కీర్తి' కూడా లభిస్తాయనుకుంటాడు.

మధురవాణి, సౌజన్యరావు పంతులు మాత్రమే 'గిరీశం' పాత్రలోని 'అసలుతత్వం' గ్రహించి దూరంగా ఉంచగలిగారు. ప్రయోజనం తనదైతే తాను మారిపోయానని' చెప్పడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. సౌజన్యరావు పంతులు దగ్గర అతను చెప్పిన మాటలు ఇందుకు ఉదాహరణ. బుచ్చెమ్మతో పెళ్ళి చేయమని అడుగుతాడు. కాని సౌజన్యరావు పంతులు 'గెటౌట్' అన్నప్పుడు 'డామిట్ కథ అడ్డం తిరిగిందనుకుంటాడు. ప్రతి ఒక్క పాత్రను అతను ఉపయోగించుకోగలిగాడు కాని ఏ పాత్రకు అతడు ఉపయోగపడలేదు. 'ఏ ఎండకా గొడుగు', 'ఏ అవసరానికి ఆ ఉపాయం' అతని నైజం. రాజకీయ నాయకులంత సులభంగా తన 'ఒపీనియన్స్'ను మార్చు కోగలడు. ప్రస్తుత రాజకీయాల్లో గిరీశం వారసులే ఎక్కువ. గిరీశం వంటి గురువులు చెప్పే చదువులకు వెంకటేశం వంటి ఆంగ్లమాధ్యమ విద్యార్థులు 'క్రియేషన్' అంటే ఆవులు, గేదెలు దగ్గరనే ఆగిపోవడం అందరికీ తెలిసిందే. బుచ్చెమ్మ కోసం 'గిరీశం' చెప్పిన ప్రేమకబుర్లు కూడా నేడు నిత్య నూతనం. 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' రైమ్‌ను విని మురిసిపోయే వెంకమ్మలు కూడా నేడు బహు మిక్కుటమే!

'కన్యాశుల్కం' రచన ప్రారంభంలో గురజాడ వారు 'గిరీశం' పాత్రను ఇంత విస్తృతంగా విస్తరించలేదు. కానీ... క్రమేపి 'గిరీశం' గురజాడను 'డామినేట్' చేసేసాడని చెప్పవచ్చు. ఎస్ఎం శాస్త్రి గారన్నట్టు Girisham must have taken the author himself by storm and argued and bluffed his way into the drama. గిరీశం ఇంతగా ఇంతమంది ప్రేక్షకులను, పాఠకులను ఎందుకు కుదిపేస్తున్నాడు అని ప్రశ్నించుకుంటే 'గిరీశంలోని లక్షణాలు, జీవితాన్ని అనుభవించాలనే తపన' వంటివి ప్రతి వ్యక్తి సుప్త చైతన్యంలో దాగి ఉంటాయి. అవన్నీ గిరీశంలో ప్రదర్శమవుతాయి.

కన్యాశుల్కం... ఆధునిక సాహిత్యంలో 'సోషల్ రియలిజం' 'గిరీశం'. నిజంగానే నిజమైన పాత్ర. శివసాగర్ అన్నట్లు ..."గురజాడా!, నీవు సృష్టించిన పాత్రలు నిజంగానే సజీవమైనవి. అందుకనే కవి మారే కాలంతో పాటు మార్పు చెందుతున్నవి. 'గిరీశం' ఇందుకు మినహాయింపు కాదు.

■

## కవిత



# నాగలి వెంట నడిచే కవి

- కంచరాన భుజంగరావు
94415 89602

ఓ కవి గారు
ఏ కవితలో చూసినా
ఒకే విషయాన్ని వలపోస్తుంటారు
చెట్లు చెట్లుగానే ఉన్నా
చెదలు వేర్లను తొలిచేసిన వైనాన్ని
విడమరిచి చెప్తారు
చివుళ్లు పచ్చగా ఉన్నా
చేవ చచ్చిన మొదుళ్ల రూపాన్ని
అక్షరాల అద్దంలో చూపుతారు
దారుశిల్పం ఎంత లావణ్యంగా ఉన్నా
మౌనం దాల్చి
షోకేస్‌లో బందీ అయిన
చెక్కమనసు లోగుట్టు విప్పుతారు

చెమట నది ఒడ్లొరుసుకుని పారినా
దాహం తీరక
నేల నరాల్లో రేగే
అలజడి గురించే మాట్లాడతారు
విత్తనంలో వత్తులు మొలకెత్తినా
పొలంలో చీకటి తిష్టవేసిందెందుకో
వేల పదాల్లో ఆరాటపడతారు

ముంగాలి లోతున నీరున్నా
ఆకుమడిలో అగ్గిపుట్టిందెలాగో
నాలుగు వాక్యాల్లో చిత్రిస్తారు
మట్టిమడతల్లో గుబాళింపులున్నా
దుక్కిలో రాలే
కన్నీటి చుక్కల కథ ఏమిటో వివరిస్తారు

పంటమడికి గిరాకీ బాగున్నా
పెట్టుబడికి అప్పు తప్పని
నాగలి నగుబాటు గురించే గానం చేస్తారు
నేలకలను నెత్తిన మోస్తున్నా
చావుకళ సాగులో దోగాడే
ప్రాచీనుడి చరిత్ర చెబుతారు

ఈ కవిగారికి ఒకసారి
తను తినే అన్నం మెతుకు మీద
నాగలి కనిపెట్టినవాడి
అస్థిపంజరం కనిపించిందట!
అప్పటినుండి అతడు
నాగలి వెంటే నడుస్తున్నాడు!

కవిత

# కుంచెవొకటి ...

- మెట్టా నాగేశ్వరరావు



పేదరికంలోంచే
కుంచెవొకటి పురుడోసుకుంది
డిగ్రీ అక్షరాలు
ఆకలికి నూకలు కానపుడు
బతుకు యుద్ధానికి కుంచె చేతబట్టాడు!

సైనుబోర్డు నీలిమందుతాడులాగే
దేహమంతా రంగులు పులుముకున్నాడు
అతడి చేతిలోంచి దూకిన
చిత్రాలను చూసినోళ్ల
గుండెలోని సంతోషం హెూళీ పండగయ్యేది
అతడు గీసిన కళాఖండాలు
కనుల్లోకి మయూరాల గుంపులా వాలేవీ
జలపాతాల్లో ముంచెత్తేవీ
అతడు గీసిన ప్రకృతి బొమ్మల సౌందర్యం
మనుషుల కురూపాల్ని తలపోసేవీ!

కోరికల సముద్రాల్నీ
గుండెలో కలుపుకున్న వాళ్లముందు
తథాగతుడు బొమ్మ గీస్తాడు
ఆత్మగౌరవం తాకట్టుపెట్టే వాళ్లకు
చూపుడువేలు చిత్తరువుని అందిస్తాడు
ఏ దేవుడి బొమ్మకైనా ఆకృతినిస్తాడు
మతమౌఢ్యపు రంగు అతడి డబ్బాల్లో దొరకదు!


బ్రష్ పట్టుకున్నాడంటే
నిలవడ్డ పరిసరాలు హరివిల్లులే
వెలసిపోయిన గోడలు
కొత్త పెళ్లికూతురు కళనద్దుకుంటాయి
మేడల్లోకి పాదం పెడితే
ఇంటీరియర్ సొగసులెన్నో వెల్లువ
ఎక్కడో ఓ దీపాన్ని గీసి
ఆత్మసోయగాన్ని కూడా ఎరుక రేపుతాడు!

చిరుగులకోక ముసలమ్మ స్కెచ్ వేసి
మానవత్వాన్ని గుర్తుజేస్తాడు
గోడలమీద వజ్రాలపోత పోస్తాడు
తడిమి చూస్తే తెలుగక్షరాలు
అవి నిత్యం గాయాన్ని పాడతాయి!

బొమ్మల్ని గీస్తాడు
భ్రమలను తొలగిస్తాయవీ
సమాజాన్ని గీస్తాడు
స్వార్థ పంజరాన్ని దాటిస్తాయవీ
చరిత్రను గీస్తాడు
జరిగిన కుట్రల్ని బయటపెడతావవీ
తాత్వికతను గీస్తాడు
వ్యామోహాల్నుంచి ముక్తినిస్తాయవీ..!

చిన్న చిన్న రంగుల టిన్లు
అతడి గుమ్మంలోని బండెడు నవ్వులు
ఫ్లెక్సీలొచ్చాక
నవ్వులు పల్చబడ్డాయి గానీ...
అతడు మాత్రం
కల్తీనెరుగని చిక్కని రంగు!

■




# రాయలసీమ కథాయానంలో మరో మైలురాయి

- పాలగిరి విశ్వప్రసాద్
93815 06650

**దూ**దరగూళ్ళంటే దుమ్ము ధూళి పట్టిపోయిన బూజుగూళ్ళు. రాయలసీమ నూటక్క రచయితల నూటక్క కథలకు 'మా... దూదరగూళ్ళు' అనే పేరు పెట్టడం కొంత సంశయాన్నీ, కొంత అయోమయాన్నీ పుట్టిస్తుంది. అదే సమయంలో ఆలోచననూ రేకెత్తిస్తుంది. ఇక్కడ దూదరగూళ్ళు అంటే– రాయలసీమ కథలు కాదు; కథల్లోని రాయలసీమ సమస్యలు. ఇక్కడి సామాజిక సమస్యలు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, రాకముందు నుంచి ఇక్కడి సమస్యలు ఇప్పటికీ సమస్యలుగానే ఉన్నాయి. బూజు పట్టిపోయి ఉన్నాయి.

నీళ్ళే నాగరికత అంటారు. ఆ నీళ్ళనే ఇతర తెలుగు ప్రాంతాల రాజకీయ నేతలు, సంఖ్యా బలంతోనో, పలుకు బడితోనో రాయలసీమ నోట్లో దుమ్ముకొట్టి తమ ప్రాంతాలకు తరలించుకుపోయారు. దాంతోనే ఇక్కడి కథల్లోని కడగళ్ళు, దూదరగూళ్ళుగానే మిగిలిపోయాయి. ఇప్పటికీ ఆ సామాజిక సమస్యలు, విషాదాలు, వెనుకబడినతనం, దానివల్ల రూపుకట్టిన మోటుస్వభావాలూ అలాగే సజీవంగా ఉన్నాయి. అందుకే నూటొక్క సీమ రచయితల కథలను సంపాదకురాలు వత్సల 'మా... దూదరగూళ్ళు' అన్నారు. "ఈ సంకలనానికి మా... దూదరగూళ్ళు అనే పేరు నూటికి నూరు పాళ్ళు 'నా ఊరు, నా సీమ' అనడంలో ఉన్న భావనంతా రంగరించి పెట్టబడింది" అని అంటారామె. అయితే ఎంచుకున్న కథలన్నీ రాయలసీమ ప్రాంతీయతనూ, ఉనికిని చాటినవి కాదు. రాయలసీమలో పుట్టి పెరిగిన, ఎక్కడో పుట్టి ఇక్కడ స్థిరపడిన రచయితలందరి కథలూ ప్రచురించాలనే లక్ష్యంతో తెచ్చినదే ఈ సంకలనం.

*మా... దూదరగూళ్ళ*లో ఉన్న ప్రతి కథనూ విశ్లేషించే చోటు కాదిది. కొన్ని అంశాల ప్రాతిపదికన స్థూలంగా చెప్పాల్సి వస్తే, మనోవైజ్ఞానిక తత్వాలను విశ్వసించే ఆర్.ఎస్. సుదర్శనం (ఎరుపు) కథ ఉంది. కారల్ మార్క్స్ భౌతికవాద తత్వాన్ని విశ్వసిస్తూనే, కథానిక హృదయ వ్యాపారమనీ, పాఠకుడిని ఆలోచింపజేస్తూనే అనుభూతింపజేయాలనీ చెప్పిన రా.రా. (దేశంలో దేవకన్యలు) కథా ఉంది. ఆయన బాటలోనే నడిచి మనోవైజ్ఞానిక తత్వాన్నీ సానుకూలంగా పరిశీలించే కేతు విశ్వనాథరెడ్డి (విశ్వరూపం) కథా ఉంది. మార్క్సిజాన్ని బలంగా విశ్వసించిన వల్లంపాటి వెంకట సుబ్బయ్య (బండి కదిలింది), పి.రామకృష్ణారెడ్డి (ఆస్తి), సింగమనేని నారాయణ (హింస), సొదుం జయరాం (తాకట్టు) కథలూ ఉన్నాయి. రాయలసీమలో దళితవాదాన్ని బలంగా చెప్పిన ఆతరం చిలుకూరి దేవపుత్ర (మన్నుతిన్న మనిషి), తర్వాతి తరం నాగప్పగారి సుందర్రాజు (నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద!) కథలూ ఉన్నాయి. మానవతా ఆదర్శాలను కథల్లో నింపే మధురాంతకం రాజారాం (గాలివీడు నుండి న్యూయార్క్ దాకా) కథా ఉంది. తమ మతంలోని అనాచారాలనూ దురాచారాలనూ ఖండించిన సత్యాగ్ని కథ (ముతా), ఆయన బాటలోనే రాస్తున్న వేంపల్లి షరీఫ్ (పరా) వంటి యువ రచయితల కథలూ ఉన్నాయి. సవర్ణ (సొంత కులంలోని) దుర్మార్గాలనూ, రుగ్మతలనూ, అనైతికాలనూ నిస్సంకోచంగా రాసిన పి.రామకృష్ణారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డిల బాటలో నడుస్తున్న సన్నపురెడ్డి (సుడిగాలి), పాలగిరి (చెప్పు కింది పూలు) వంటి రచయితల కథలూ ఉన్నాయి.

రాయలసీమలోనే కాకుండా తెలుగులోనే మాంత్రిక వాస్తవికత (మేజిక్ రియలిజం), అధి భౌతిక వాస్తవికత, మార్మిక వాస్తవికత (మిస్టిక్ రియలిజం), తాంత్రిక వాస్తవికతలతో వచ్చిన కథలు చాలా తక్కువ. రచయితలను ఈ దారివైపు మరలించే దెసగా అవగాహననిచ్చే విమర్శకులు కూడా తెలుగులో కరువే. మాంత్రిక వాస్తవికత కథగా బండి నారాయణస్వామి రాసిన 'తెల్లదయ్యం – అను గ్రామ వివక్ష' కథకూ, ఇదే

ధోరణిలో సామాన్య రాసిన 'మహిత' కథకు సంకలనంలో స్థానం వచ్చింది. 'మహిత' కథను మాంత్రిక వాస్తవికత కథ అనాలో, తాంత్రిక వాస్తవికత కథ అనాలో విమర్శకులు చెప్పాలి.

రాయలసీమలో హాస్య వ్యంగ్య రచయితలు అరుదుగానే కనిపిస్తున్నారు. దీనిపై పరిశోధన జరగాల్సి ఉంది. ముందటి తరంలో కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, ఇప్పటి తరంలో జి.ఆర్.మహర్షి వంటి వారు హాస్యం పండించడంలో సమర్థులే అయినా, మా... దూదరగూళ్ళులో వారి అటువంటి కథలకు స్థానం లభించలేదు. వారి సామాజికాంశపు కథలే (వోబిగాడు, మావూరి మహావైద్యగాడు) ఇక్కడ నిర్ణయమయ్యాయి. నాయిని కృష్ణమూర్తి రాసిన 'తెలుగోడు' ఒక్కటే హాస్య కథగా కనిపిస్తోంది. ఎం.వి.రమణారెడ్డి వ్యంగ్యాన్ని బలంగా రాసినవారే అయినా, ఆ ధోరణి కథ కాకుండా మరొకటి (జుట్టు మామ) ఇక్కడ తావు చేసుకుంది.

గత శతాబ్దంనాటి వరకూ తొలి రాయలసీమ కథగా భావించిన 'గంజి కోసరం' (గుత్తి రామకృష్ణ) రాయలసీమ స్థానికతను తెలిపే కథ కావడం, ఈ సంకలనంలో మొదటి కథగా నిర్ణయింపబడడం సముచితం. గుత్తి రామకృష్ణ వాడుక భాషలో రాసిన ఈ కథ తర్వాత కూడా కొందరు రచయితల కథల్లో గ్రాంథిక వాసన రావడం ఒకింత విచారమే. విద్వాన్ వెంకటరమణ శాస్త్రి 'పరాజిత', నైనారి చిన్నప్ప 'నమ్మలేని నిజం' కథల్లో ఈ వాసన ఉంది.


రాయలసీమలోని కథకుల్లో భౌతికవాదంపై సైద్ధాంతిక అధ్యయనం ఉన్నా లేకున్నా, సామాజిక స్పృహతో అభ్యుదయ దృక్పథంతో సామాజికాంశాలనే కథలుగా రాశారు. దాదా హయాత్, ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, జి.ఉమామహేశ్వర్, సుభాషిణి... ఇలా చెప్పుకుంటూపోతే పుస్తకంలోని దాదాపు 90 మంది రచయితలు ఇటువంటి కథలు రాసినవారే కనిపిస్తున్నారు. రాయలసీమ రచయితల్లో కాల్పనికత లోపించిందన్నది సంపాదకురాలి వ్యాఖ్య. కనీసం ముగింపులోనైనా పరిష్కారం (కల్పనతో) ఉండాలని అభిప్రాయపడ్డారు. సీమ రచయితల కథల్లో వాస్తవిక జీవితమే ఉంటుంది. వాస్తవ జీవితం కథగా రూపొందడానికి కాల్పనికత తప్పక అవసరమవుతుంది. రచనా వ్యాసంగాన్ని ఒక బాధ్యతగా తీసుకున్న రచయితల కథలకు ముగింపులుండవు. వారి కథల్లో వ్యవస్థ లేదా సమాజం ఒక కనిపించని పాత్రగా ఉంటుంది. వ్యవస్థ సృష్టించే దుర్మార్గాలకు దురాగతాలకు వ్యక్తులు ముగింపునివ్వలేరు. ఇస్తే, అది కృతకంగా ఉంటుంది. జీవితంతో సంబంధంలేని కల్పనలూ ఊహాజనితాలూ కాలక్షేప కథలే అవుతాయి గానీ సాహిత్య ప్రయోజనమేమీ ఉండదు. దిగ్భ్రమ కలిగించే ముగింపు (షాకింగ్ ఎండ్) కోసం రాసిన ఊహాజనిత కథలు ఇందులో ఉన్నాయి. పాతతరం రచయితలు నైనారి చిన్నప్ప (నమ్మలేని నిజం), సి.వేణు (మారెమ్మ గుడి) రాసినవి ఈ కోవలోవే. ఒక దశాబ్దం, రెండు దశాబ్దాలుగా రాస్తున్న యువ రచయితలవి కూడా ఇటువంటి 'షాకింగ్ ఎండ్' ఊహా జనిత కథలు సంకలనంలో ఉన్నాయి.

కథల ఎంపికలో సంపాదకురాలు వత్సల నిర్దేశించుకున్న లక్ష్యం, పడిన అగచాట్లు, ఎదురైన అనుభవాలన్నీ కథలకు ముందు రాసిన 'సీమ సావిట్లో...!'లో చెప్పుకొన్నారు. ఒక ప్రాంతానికి చెందిన నూటక్క రచయితల నూటక్క కథలను ఎంపిక చేయడం ఏ సంపాదకుడికైనా కత్తి మీద సామే. ఆ రచయితల నుంచి వారికి నచ్చిన మూడు కథలు తీసుకొని, అవన్నీ ఆమె ఒక్కరే చదివి ఎంపిక చేయడం ఒక సవాలైతే, పంపనివారి కథలు సేకరించి నిర్ణయం తీసుకోవడం మరో సవాలు. ఒక ప్రముఖ రచయిత తన కథలనివ్వడానికి నిరాకరిస్తే, కథ బయటకు వచ్చిన తర్వాత అది సమాజగత మౌతుందన్న భరోసాతో ఆయన కథనూ వేశానన్నారు. ఈ అంశం చర్చించదగినదే. నామిని గారిని అడిగినప్పుడు ఆయన తనవి కథలు కాదని చెప్పినట్లూ – అదే నిజమైతే 'మిట్టూరోడి కథలు' అని పేరు పెట్టిన పుస్తకాన్ని కొంటున్న పాఠకుల పరిస్థితి ఏమిటనే ధర్మసందేహాన్ని సంపాదకురాలు వెలిబుచ్చారు. పీఠికలో ఆమె పుస్తక లక్ష్యానికి విరుద్ధంగా కొన్ని అభిప్రాయాలు వ్యక్తపరిచారు. శుద్ధ వచనంతో చెప్పిన నాలుగు వాక్యాల పేరాను, వాక్యం కింద వాక్యం చేర్చి కవిత అంటున్నారని వ్యంగ్యంగా విమర్శించారు. దీనికి ఉదాహరణగా వరవరరావు రాసిన ఒక వ్యక్తీకరణ'ను చూపడం కొందరికి రుచించక పోవచ్చు. ఒక పాఠకురాలిగా చదివి, పాఠకులకు అనిపించే – 'ఏం కవితిదీ...!' అనే నిరసన భావనను, అసహనాన్నీ చదువరుల తరపున వ్యక్తం చేశారామె. కొందరు ప్రముఖ రచయితలు రాసిన సాహిత్యాన్ని విభాగాలుగా ప్రచురించిన సందర్భాల్లో వారి పేర్లతో కవిత్వం– 1, 2, 3 అని వేసుకోవడాన్ని వత్సల వ్యంగ్యంగా విమర్శించారు. ఇది కూడా ఒక పాఠకురాలిగా ఆమె వ్యక్తం చేసిన అసహనమే. అలా 1,2,3... క్రమంలో వేస్తే, ఫలానా కవిత దేంట్లో వుందో తెలియని అయోమయమే. వీటిని విడిగా చదివితే చర్చింపదగినవిగానే ఉన్నాయి. ఈ అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛ ఆమెకు లేదని కాదు గానీ, 'నూటొక్క సీమ కథల' పుస్తక పీఠికలో ఇమడలేదు. అసందర్భంగా తోచాయి. వీటిని వత్సల ప్రత్యేక వ్యాసంగా రాసుకొని, ఈ కథల వెనుక వేసుకొని ఉండవచ్చు.

ఈ పుస్తకానికి పాపినేని శివశంకర్‌తో ముందుమాట రాయించేందుకు ఇచ్చి, కొన్ని నెలల తర్వాత 'ఆ ప్రాంత రచయితలతోనే రాయించుకోండి' అనే మాటతో వెనక్కు తీసుకున్న ఉదంతాన్ని ఆమె పీఠికలో పంచుకున్నారు. రాష్ట్రంలో ఒక భాగంగా ఉన్న ఒక ప్రాంతం గురించి తెలియకపోవడం నేరం కాదు గానీ, తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం విచారించాల్సిందే.

రాయలసీమ వాసుల స్వభావాలపై సంపాదకురాలు వ్యక్తపరిచిన అంచనాలూ సంశయాత్మకమే! వాస్తవ జీవితంలో ప్రశ్నించేతనం, ధిక్కరించేతనం, పోరాట పటిమ, క్షణక్షణం సీమవాసుల ప్రవర్తనలో ప్రస్ఫుటంగా కనబడుతుందనడం ఒక పొరపాటే. అనాదిగా వెనుకబడిన ఈ ప్రాంత జనుల్లో వాళ్ళకే తెలియని ఒక న్యూనతా సంక్లిష్టత (ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్)తో పాటు మరికొన్ని మానసిక సంక్లిష్టతలు ఉన్నాయి. అర్థం పర్థం లేని పౌరుషం ఈ సంక్లిష్టతల్లో ఒక భాగమే. సామాజిక వెనుకబాటుతనం, చదువులేమి వీటికి కారణాలు. ఈ రుగ్మతల వల్లే రాయలసీమలో ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకోలేదు.

పుస్తకానికి ముందుమాట లేకపోయినా, కథల వెనుక అనుబంధంగా అచ్చేసిన కేతు విశ్వనాథరెడ్డి, నాగప్పగారి సుందర రాజు, సింగమనేని నారాయణ, వల్లంపాటి వెంకట సుబ్బయ్యల వ్యాసాలు ఆ లోటును తీరుస్తాయి. ఇందులో 'రాయలసీమ రాజకీయార్థిక విశ్లేషణ' శీర్షికతో బాలగోపాల్ విరసం సాహిత్య పాఠశాలలో (జనవరి 2007) చేసిన ప్రసంగాన్ని వేశారు. వాస్తవానికి ఇది రాయలసీమ రాజకీయార్థిక విశ్లేషణ కాదు. తెలంగాణా సాగునీటి సిద్ధాంతవేత్త విద్యాసాగర్ రావును బలంగా సమర్థిస్తూ రాయలసీమ నేతలు చేసిన వాదాన్ని వ్యతిరేకిస్తాడీయన (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు కాక ముందు అమలులో ఉన్న బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం, కృష్ణా మిగులు జలాలు వెనుకబడిన రాయలసీమకే – అనే వాదనను). ఇప్పుడు రాయలసీమను ద్వేషించే తెలంగాణ రాజకీయ నాయకుల మాటలకు స్వభావాలకూ, బాలగోపాల్ మాటలకూ స్వభావానికీ ఏమాత్రం తేడా కనిపించదు ఈ వ్యాసం చదివితే. రాయలసీమ రచయితల కథలు ఒక సంకలనంగా వెలువడుంతుదనే ఆశ ఏ రచయితకూ లేదు. గతంలో విశాలాంధ్ర పబ్లిషర్స్ కోసం సింగమనేని 'సీమ కథలు' సంకలీకరించినా, వారు నియమించుకున్న పరిధుల వల్ల పాత తరం రచయితలకూ అందులో స్థానం దొరకలేదు. పబ్లికేషన్స్ సంస్థలు చేయాల్సిన పనిని వ్యక్తిగా చేపట్టి, సీమ రచయితల ఊహకందని విధంగా 'మా... దూదరగూళ్ళు' రూపొందించారు వత్సల. రాయలసీమ సాహిత్యంలో ఇది ఒక మైలురాయే! ■



# అవార్డు స్వీకరించడం లేదు

## తెలకపల్లి రవి

పత్రికారంగంలో చేసిన కృషికిగానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తనకు ప్రకటించిన వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును తాను స్వీకరించటం లేదని ప్రముఖ పత్రికా రచయిత, రాజకీయ సామాజిక విశ్లేషకులు, సాహితీ ప్రస్థానం గౌరవ సంపాదకులు తెలకపల్లి రవి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "నాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును తీసుకోరాదని నిర్ణయించుకున్నాను. ఈనాడున్న వివాదాస్పద రాజకీయ మీడియా, సోషల్ మీడియా వాతావరణంలో ఈ అవార్డును స్వీకరిండం లేదని తెలియజేస్తున్నాను. ఈ పురస్కార ప్రకటన ద్వారా నా పట్ల గౌరవాదరణ ప్రదర్శించిన ప్రభుత్వం, కమిటీ మిత్రులకు, అభినందనలు తెల్పిన ఎందరో స్నేహితులు, శ్రేయాభిలాషులకు ధన్యవాదాలు." అని ఆయన పేర్కొన్నారు.

## 25, 26లలో కెనడా తెలుగు సాహితీ సదస్సు

ఈనెల 25, 26 తేదీల్లో కెనడాలోని టొరంటో కేంద్రంగా అంతర్జాలంలో జరుగుతున్న మొట్టమొదటి కెనడా తెలుగు సాహితీ సదస్సు.. 12వ అమెరికా తెలుగు సాహితీ సదస్సుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు 100 మంది అమెరికా, కెనడా సాహితీవేత్తలు తెలుగు భాషా, సాహిత్య అంశాలపై మాట్లాడతారు. ఈ రెండు రోజులూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల దాకా కార్యక్రమం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులందరూ అంతర్జాలంలో వీక్షించాలని కోరుతున్నాం.

**- వంగూరి చిట్టెన్ రాజు**

కవిత

# గన్ - సితార్

- వెంకటేష్ పువ్వాడ
7204709732

**బు**జ్కాషి చిత్రంలో
ప్రాణాలు కోల్పోయిన స్నేహితుడి కోసం
పదీ పన్నెండేళ్ల రఫీ
శిధిల భవనమెక్కి అహ్మద్.. అహ్మద్... అంటూ
ఆఫ్ఘాన్ గగనతలం ప్రతిధ్వనించేలా పిలుస్తాడు
బహుశా ఇప్పుడు విమానం రెక్కల పైనుంచి
జారిపడుతున్న మిత్రులంతా
ఆ అహ్మద్‌లే అనుకుంటాను!

గ్రనేడ్లకి దారం కట్టి గాలిపటాలు ఎగరేశారు
పక్షి రెక్క చప్పుల్లో కూడా ట్రిగ్గర్ నొక్కిన శబ్దాన్నే విన్నారు
కలల కాసారంలో
సామ్రాజ్యవాదం మొసళ్ల కోరలకి చిక్కిన
ఆ లేత పాదాలనిండా నిత్యం రక్తస్రావమే!
ఒకరికొకరు కన్నీళ్లు అరువిచ్చుకొని
నెత్తుటి మరకల అడుగుల అడుగుల్లో నడిచారు

ఆకలికి సితార్ సంగీతం నేర్పారు
పేగులకు జోల పాడారు
రాతిరి జావళిలో
మొండి మేడపై వెల్లకిలా పడుకొని
తోక తెగిన అమెరికన్ రాకెట్ లాంచర్ల రవ్వల వెలుగులో
భవిష్యత్ బంగారు ఆఫ్ఘన్‌ని ఊహించుకున్నారు
ఏమైందో ఏమో
కాలాన్ని కళ్లు మోసం చేసాయో
లేక కాలమే కళ్లని మోసం చేసిందో తెలీదు
ప్రజాస్వామ్యాన్ని కళేబరం చేసి
బుజ్కాషి ఆడుకుంటున్నారు తాలిబన్లు

అక్కడ సముద్రం లేదు కానీ
రక్త సముద్రమొకటి తీరం దాటింది
ఉగ్గుపాలు కూడా విషమే కాబోతున్నాయి
స్వేచ్ఛకు బహిరంగ మానభంగం సహజాతి సహజం

ఇప్పుడు అహ్మద్లు, రఫీలు లాంటి వాళ్లు
శవాల పక్కనుంచి ఎయిర్పోర్ట్ కి నడుస్తున్నారు
విమానాలెక్కి వెళ్లిపోతున్నారు
"నువ్వు ఆలోచిస్తూ కూర్చుంటే
గోల్డ్ స్మిత్‌గానే మిగిలిపోతావ్!'
అహ్మద్ బతికుండగా, రఫీతో చెప్పిన మాట ఇది!

రఫీ అలాగే మిగిలి పోయాడు
ఇంటికి తిరిగి వెళ్లి
కన్నీళ్లతో స్వప్నాలన్నీ రాల్చేసి
కొలిమిలో కాల్చేసి – ఎర్రగా కాలిన ఇనుముని
బయటకు తీసి దిక్కులు పిక్కటిల్లేలా
సమ్మెటతో మోదాడు
అతడు ఓడిపోయాడు
కాదు; ఓడించేసాం!
ఇప్పుడు ఆఫ్ఘన్ పౌర సమాజమంతా
నేల పైనుండి ఆకాశం వైపే చూస్తోంది
రాలి పడబోతున్న స్నేహితుల్ని ఒడిసి పట్టుకోవడానికి!

మనమేమి భద్రంగా లేము
ప్రస్తుతానికి తుపాకీ వెనుకాతల ఉన్నాం
కత్తికి పిడి పక్క నిల్చున్నాం
ఈ క్షణానికి మనం సచ్చీలురమే!
విద్వేషపు కత్తికి భారతావని కూడా ముక్కలైంది
కొన్నాళ్లు మాంసం ముద్దయింది
ఊచకోతకి ఉచ్చం నీచం తెలీదు
శ్మశాన శాంతే దానికి కావాలి
ఆధిపత్య అరాచకపు హోమంలో
కులం, మతం, ప్రాంతం అన్నీ ఆజ్యం పోసేవే!

ఇకనైనా కరుడు కట్టిన మతం మసిని కడిగేసి
సర్వమత సమానత్వం రంగులనద్ది
ప్రేమ అత్తర్లను జల్లుకొని
కొత్త మానవతకు తలుపులు తీద్దాం!
లేకుంటే మనం కూడా చింతనిప్పుల్లా మండే కళ్లతో
ఆకాశం కేసి చూడాలి!

■



# బతుకు చెట్టు

- పి.వి.బి. శ్రీరామమూర్తి
94400 59067

**గో**ల!

అలజడి!

ఏదో తరుముకొస్తున్నట్టు ...

తలపాగా తలకింద పెట్టుకొని, చుట్ట తిరగేసి నోట్లో పెట్టుకొని పొగ పీలుస్తోన్న చలమయ్యకు తెలివొచ్చేసింది. మళ్లీ ఈ చిన్నపట్నం కేటయ్యింది సెప్మా! అనుకున్నాడు. కొన్నాళ్లు తాగటానికి నీళ్లు దొరక్క అవస్థలు పడ్డారు. మరి కొంతకాలం తుపానుతో జలమయం. అంతకు ముందు 'అమ్మ' చనిపోయిందని గోల!

ఎప్పుడూ ప్రశాంతత లేని నగరం!

మళ్లీ ఏటయింది? జనంలో భయం. అది మరణ భయమో? ఏ దేశం అయినా యుద్ధానికొస్తున్నదో తెలియని భయమో! ఆకాశంలోంచి డేగ భూమ్మీద కోడిపిల్లల కోసం వేటాడినప్పుడు తల్లి కోడి అరుస్తున్న అరుపులు. ఆనందంగా తిరుగుతున్న వేళ గండు పులి వాసనతో పరుగులు తీస్తున్న అలజడి. సంధ్యవేళ పక్షులు గూటికి చేరుతూ చేస్తోన్న అలజడి.. సముద్రం మధ్యలో వేటకెళ్లి తుపానులో చిక్కుకుపోయిన జాలరుల ఆందోళన!

ఎవర్ని అడిగినా ఎవరూ వినిపించుకోని పరిస్థితి. చలమయ్య నిర్మాణంలో ఉన్న పదిహేనంతస్తుల బిల్డింగులో వాచ్‌మేన్. ముందు కూలి పని చేసేవాడు. వయస్సు పైబడి, కాళ్లలో సత్తువ సన్నగిల్లి వాచ్‌మేన్‌గా అమరిపోయాడు.

"చలమయ్యా! మరిక్కడుండకు. ఇక పనులాపేస్తున్నాం. గేటుకు తాళాలేస్తున్నాం" యజమాని అన్నాడు.

"ఏమి? ఏటయ్యింది బాబూ?"

"నీకు తెలీదా? మహమ్మారి కరోనా! అందుకే వారం రోజులుగా పనుల్లేవు. రోజురోజుకీ ఎక్కువైపోతున్నాది. బజారు మూత పడి పోయింది. ఎక్కడి వాళ్లక్కడకెళ్లిపోతున్నారు" అన్నాడు.

చలమయ్య గుండెల్లో ముల్లు గుచ్చుకుంది.

"ఏ ముసిలోడా? నెగవా? మావందరిమీ బయలెల్లి పోతన్నాము. నడవగలవా?" అంది పారమ్మ. పారమ్మా శ్రీకాకుళం నుంచి వచ్చి చేరింది. అక్కడంతా ఆంధ్రా వాళ్లే. రాయలసీమ వాళ్లు, గోదావరి జిల్లా వాళ్లు, తెలంగాణా ప్రాంతం వాళ్లూ, విశాఖ విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల వాళ్లే. అక్కడ జరక్క ఇక్కడి కూలి డబ్బులు ఎక్కువని కుటుంబాల నొదులుకొని వచ్చిన వాళ్లే!

ఇప్పుడు లాక్‌డౌన్ వల్ల పనుల్లేక, డబ్బున్నా కొనుక్కోడానికేమీ దొరక్క "బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు, చావో రేవో అందరకూ ఒక్కడే బతకొచ్చు" అని సొంతూళ్లకు తిరుగుముఖం పట్టడానికి సిద్ధంగా ఉన్నారు.

అందరూ మూట ముల్లే కట్టుకొని తయారయ్యారు. అరవై, డెబ్బైమంది ఉన్నారు. 'నెగు, ఇక్కడేటి సేస్తవు?' అంది పారమ్మ.

అప్పుడు తెలిసొచ్చింది చలమయ్యకు

చలమయ్య సొంతూరొదిలి సుమారు ఇరవై సంవత్సరాలయ్యింది. ఏనాడూ ఊరు విడిసి వచ్చాడో అప్పట్నుంచీ పుట్టిన ఊరు ముఖం చూడలేదు.

"ఏటి సెలమయ్యా, ఇంటికి ఫోన్ చేసినావా?" అడిగా డొకడు. చలమయ్య ఇన్ని సంవత్సరాలు, ఇంత మందితో తిరిగినా ఎవరికీ తన విషయం చెప్పలేదు.

"మీ రెల్లండి, నే[నాను" అందామనుకున్నాడు... కానీ అలాగంటే చాలా విషయాలు చెప్పాలి. అలా చెప్పడం ఇష్టం లేదు. కళ్లంట నీళ్లచ్చాయి. తనకున్న పంచె, తువ్వాళ్లు సంచిలో కుక్కుకున్నాడు. పక్కవాడ్ని పిలిచి మొలలోంచి సంచి తీసి దానిలో చిన్న పుస్తకం తీశాడు. 'ఒరే నాయినా! ఈ నెంబరు కోపాల ఫోన్ చేయ్యరా" అన్నాడు.

వాడు చేశాడు. వెంటనే తగిలింది.

"ఎవరూ"

"మేషారు నేను, సెలమయ్యని.. సెన్నపట్నం నుంచి"

"ఆ... ఆ.. చెప్పు.. ఎన్నాళ్లకెన్నాళ్లకి?"

వచ్చేస్తున్నట్లు చెప్పాడు. రాఘవయ్య మాస్టారు చాలా సంతోషించారు. చలమయ్య కడుపు నిండింది.

చలమయ్య ఏకాకి!

అతనికి దిక్కు రాఘవయ్య మాస్టారే!

చలమయ్యకి చాలా రోజుల తరువాత సొంత ఊరు, పొలాలు, కొడుకు, కోడలూ గుర్తుకొచ్చారు.

ఇంత కాలం అన్నీ మరిచిపోయి అందరితో ఆనందంగా ఉన్నాడు. 'కొడుకు దగ్గరకెళ్లాలా? వద్దా? వెళ్తే కోడలు రానిస్తుందా?' ప్రశ్నలు శూలాల్లా.

శ్రీకాకుళం జిల్లాలో ఓ మారుమూల గ్రామం చలమయ్యది. ఒక ఎకరం పొలాన్ని కష్టపడి పండించి, కూలినాలి చేసి అయిదెకరాలు చేశాడు. చెలమయ్య మేనరికమే చేసుకున్నాడు. భార్య సీత భర్తకు తలలో నాలుక. పెళ్లయి ఆరేడు సంవత్స రాలైనా పిల్లలు పుట్టలేదు.

"ఏవయ్యా! ఇంత సంపాదిత్తన్నాం. ఇంట్లో ఇద్దరమే అయిపోయినాం. ఒక పిల్లాపిచుకా నేదు. ఎవల్నయినా పెంచుకుందామా?" అందో రాత్రి.

"సరే అలాక్కానీ, మీ సెల్లెలి కూతున్ని అడుగు"

''అదిత్తాది కానీ మీవోళ్లు నా చెల్లెలి కూతుర్ని పెంచీసుకున్నాం అనుకుంతారు. మీయప్ప కొడుకునడగరాదూ"

"ఒసే సీతా! ఒక్క మొగపిల్లడైనా, ఒక్కాడపిల్లయినా.. ఆల్లకి మరి సరదా ఉండదు. అందుగురిండి నాన్నా అప్ప కొడుకునీ, నువ్వు నీ సెల్లెలి కూతుర్నీ అడుగుదాం. మనోళ్లే మనకాడే ఉంతారు. ఏటంతావు?"

సీత అంగీకరించింది.

సీత చెల్లెలి కూతురు వసంత, చలమయ్య అప్ప కొడుకు సుకుమారూ... సొంత పిల్లలయ్యారు. సుకుమార్ కొంచెం బద్ధకస్తుడు. పెంకివాడు. కానీ వసంత చురుకైన పిల్ల. వసంత సుకుమార్ కన్నా రెండేళ్లు పెద్ద. పొన్నూరులో పెద్ద బడి ఉంది. సుకుమార్ని అక్కడ చదివించాడు. ఎప్పుడూ అత్తెసరు మార్కులతోనే పాసయ్యేవాడు. వసంత పని పాట్లలో చురుగ్గా పాల్గొనేది. అది చేసే పనులు చూసి అందరూ ముక్కున వేలేసుకునేవారు. అది నాగలి పట్టిపొలం దున్నేది. విత్తనాలు చల్లేది. ఏతాం ఎక్కి నేల నూతిలో నీళ్లు తోడేది. వద్దన్నా వినేది కాదు. ఒకసారి రైతు రాలేదు. వంగ చేనుకు నీరు పెట్టాలి. మొక్కలు మొదట్లో తడిలేదు "ఏం చేద్దాం" అని అనుకుంటుండగా వసంత 'అయ్యా! నేనేతమెక్కుతాను. నువ్వు తోడు. అమ్మ మొక్కలకు నీరెడతాది.' అని.. ఎంత చెప్పినా వినక ఏతాం ఎక్కి అట్నుంచి అటు, ఇట్నుంచిటు హుషారుగా తొక్కుతోంది. దానికి కళ్లు తిరిగాయి. కళ్ల చీకట్లు కమ్మేశాయి. చలమయ్య సీతా పరుగు పరుగున వెళ్లి లేవనెత్తారు. నాలుక బయట పెట్టేసింది. ఎడ్ల బండిని పిల్చి పట్నం తీసుకెళ్లారు. వసంత తోవలోనే ప్రాణం విడిసింది!

ఆ దెబ్బకి ఆ దంపతుల ఇంట్లో దీపం ఆరిపోయింది. దీనికి తోడు 'ఆడపిల్ల చేత ఏతాం తొక్కించాడు అనే మాట ఊళ్లో కొందరి నోట రావడం మరింత భరించరానిదైంది. పుండుమీద కారం చల్లినట్టయింది.

సుకుమార్ డిగ్రీ గట్టెక్కాడు. ఉద్యోగం లేకుండా ఊరుమీద తిరగటం, పంటలు కలిసి రాకపోవడం, కూతురి మరణం... మొగుడూ పెళ్లాలను బాగా కుంగదీశాయి. ఇంతలో కొడుకు సర్పంచ్ కూతురు వలలో పడ్డాడు. సుకుమార్ ఆ అమ్మాయిని తప్పితే వేరొకర్ని పెళ్లి చేసుకోనన్నాడు. ఉద్యోగం వ్యవసాయం లేని కుర్రాడికి నా కూతుర్ని ఇవ్వనన్నాడు సర్పంచ్. సుకుమార్ తిండీ తిప్పలు మానేశాడు. గోరు చుట్టు మీద రోకటి పోటయ్యింది చలమయ్యకి. సీత కొడుక్కి నచ్చచెప్పినా వినలేదు. సర్పంచ్ని బతిమలాడింది. సర్పంచ్ వీల్లేదన్నాడు. చలమయ్య బాగా ఆలోచించి నిర్ణయానికి వచ్చాడు. మండల ప్రెసిరెంటు బాగా తెలిసినవాడు. అతడి ద్వారా ఎమ్మెల్యేని పట్టుకొని రెండుకరాల పొలం అమ్మి కొడుక్కి జిల్లా పరిషత్ స్కూల్లో గుమాస్తాగా వేయించాడు. తరువాత కొడుక్కి పెళ్లి చేశాడు. అందరూ ఆ సంబంధం వద్దని సీతకు చెప్పారు. 'ఆ పిల్లకు

ఇద్దరక్కలు. వాళ్లకి పెళ్లిళ్లవ్వగానే కుటుంబాలని వేరు చేసేశారు. ఈ పిల్లని చేసుకుంటే మీరు సుఖ పడర'ని. అయినా సుకుమార్ ఇష్టాన్ని కాదనలేకపోయారు చలమయ్య దంపతులు.

అందరూ అనుకున్నట్టే జరిగింది. సంవత్సరం తిరక్కుండానే ఇంట్లో తగవులు. చలమయ్య ఆలోచించాడు. మండల ప్రసిడెంటు పలుకుబడితో దూరంగా బదిలీ చేయించేశాడు. కొడుక్కి ఇప్పుడు వాళ్లుచాలా దూరంగా ఉంటున్నారు.

♦ ♦ ♦

"ఏటి సెలమయ్యా! కాళ్లు నొస్తన్నాయా? మనమిప్పుడు నెల్లూరు కాడికొచ్చినాం. ఏటాలోసిస్తన్నావు?" అన్న పారమ్మ మాటలతో ఈ లోకంలోకొచ్చిన చలమయ్య "ఇంకెన్నాళ్లవుతాదో? మావూరెకెల్లీసరికి?" అన్నాడు.

"గడప దాటి గజిం దూరం ఎల్లనేదు కానీ, 'ఇంకెంత దూరం' అన్నట్టా నీనాటోడే" అంది.

"నీకేటమ్మా.. పిక్కలబలముంది. నాను ముసులోణ్ని" అన్నాడు.

సంచుల్లోంచి బన్‌రొట్టెలు తీసి ఒక్కొక్కరూ తిన్నారు. 'ఆకలికి రుచి తెలీదు, నిద్రకు సుఖం తెలీదు' అన్నారు. నెల్లూరు దాటారు. బహిరంగ ప్రదేశం. చిమ్మ చీకటి. అందరూ తలకింద సంచులు పెట్టుకొని పడుకున్నారు. తెల్లారి చీకట్టే లేచి బయలు దేరారు. ఎక్కడా టీకొట్టు లేదు. చుట్టలు కొనుక్కుందామంటే ఎక్కడా కిళ్లీబడ్డీ లేదు. నడుస్తున్నారు. ఒళ్లు నడవటం లేదు. కాళు ్లనడిపిస్తున్నాయి. మంచినీళ్లు దొరకడం లేదు. ఏ చెరువు కనబడితే ఆ చెరువు నీళ్లతోనే దప్పిక తీర్చుకుంటున్నారు.

బయలుదేరిన రోజుకు విజయవాడ చేరుకున్నారు. ఈలోగా కొంత మందికి వాంతులు, కొంత మందికి విరోచనాలు. ఆకలి. తోవలో ఏ గడ్డి కనబడితే ఆ గడ్డి తినే ఆకలి తీర్చుకుంటున్నారు. పత్రికా విలేకర్లు వచ్చి ఫొటోలు తీశారు. డిఎస్పీ ఎవరో దాతను పట్టుకొని భోజనాలు పెట్టించారు. భోజనాలు తిన్న తర్వాత పులిహోర ప్యాకెట్లు ఇప్పించారు. 'బతుకు జీవుడా' అని కాళ్లకు పని చెప్పబోతుంటే ఒక చిన్న ట్రక్కు కనబడింది. డిఎస్పీ, పత్రికా విలేకరులు ఆ ట్రక్కు ఎంతవరకు వెళ్తుందో కనుక్కున్నారు. అన్నవరం వరకు వెళ్తుందంటే వీళ్లని ఎక్కించమన్నారు. దాన్లో ముప్పయి మందే పట్టారు. ముసలోళ్లని, ఆడవాళ్ళని, పిల్లలతో ఉన్నవాళ్లను ఎక్కించుకున్నారు. చలమయ్య ట్రక్కు ఎక్కిపోయాడు. ఈలోగా వర్షం కుండపోతగా తడిసి ముద్దయిపోయారు. ట్రక్కుకి టాపులేదేమో … అందరూ తడిసి పోతున్నారు. ఇంతలో వడగళ్ల మొట్టికాయలు. చలమయ్యలో వణుకు.

అన్నవరం వచ్చేసింది.

"దిగండి" అన్నాడు డ్రైవరు. అందరూ దిగారు.

మళ్లీ కాళ్లకు పని చెప్పారు. ఇంక దగ్గరకొచ్చేశాం. దగ్గరంటే శ్రీకాకుళానికి రెండు వందల కిలోమీటర్లు దాటే ఉంటుంది. అన్నవరంలో కొబ్బరి బోండాలు తాగారు. అవీ అందరికీ చాలలేదు.

"ఒసే సీతా! పోలీసులటెల్లినారు. ఆ గంపతో బోండాలట్రా" అంటున్నాడు, బోండాలమ్ముకునేవాడు.

చలమయ్యకు సీత గుర్తొచ్చింది.

భార్యభర్తలలో ఎవరు లేకపోయినా ఇంకొకరికి లోటే. అయినా సీత ఎంత దారుణంగా చనిపోయిందీ? గుండెల్లో మంటలు.

ఆ రోజు …

"ఏమయ్యా! రేపు బాబు పుట్టిన రోజు ఆడి కరిసెలిట్టం. అరిసెలు, పోకుండలు చేస్తాను. వొట్టుకెళ్తావా?" అంది.

"నువ్వు రారాదా"

"నీను రానయ్యా! నా ముకం సూత్తే దానికి రోగం తిరగబడతాది" అని తెల్లారి రెండు డబ్బాలతో అరిసెలు, పోకుండలు, జంతికలు పట్టుకెళ్లమని ఇచ్చింది. చలమయ్య కొడుకు దగ్గరకెళ్లాడు. కొడుకు సమితిలో సూపరెండెంటయ్యాడు. వాడికి ఖాళీ లేదు. కోడలు ఇంటికెళ్ళిన మావయ్య గారికి మంచి నీళ్లయినా ఇవ్వలేదు. మధ్యాహ్నం కొడుకు వచ్చాడు. పలకరించాడు. 'అమ్మ బాగుందా?' అన్నాడు.

"మీయమ్మ నీ కోసం అరిసెలు, పాకుండలు పంపిందిరా.. నీ పుట్టిన రోజు కదా." అన్నాడు. కొడుకు తిరబోతే కోడలు గంయ్‌మంది. "ముందన్నానికి రండి" అని. మధ్యాహ్నం చలమయ్య చూస్తుండగానే అరిసెలు, పాకుండలూ, జంతికలూ పని మనిషిని పట్టుకు పొమ్మంది.

"అమ్మా.. అవి సుకుమార్ కోసం వాళ్లమ్మ కష్టపడి చేసిందమ్మా!' అంటే "నానా గడ్డీ తింటే ఆరోగ్యం ఏమౌతుంది?" అని విసురుగా వెళ్ళిపోయింది. అక్కడో క్షణం ఉండాలని పించలేదు. తెల్లారి బస్సెక్కి ఇంటికొచ్చేసరికి సాయంకాలం ఏడయ్యింది. వచ్చేసరికి ఇంకేముంది? అంతా మసి బూడిద! ఊరు తగలడింది. అప్పటికన్నీ పూరిళ్లే! ఆ ళ్లు తగలడి, నిద్రలోనున్న వారు బయటకు రాలేక చాలామంది ఇళ్లల్లోనే అగ్నికి ఆహుతయ్యారు! అందులో సీత ఒక్కతి!

చలమయ్య జీవితం చీకటయిపోయింది. వర్షాలు లేవు. పంటలు లేవు. కరువు విలయ తాండవం! అందరూ ఊరొదిలి చెట్టో పుట్టయ్యారు. అలా చలమయ్య చెన్నపట్నం చేరుకున్నాడు. అప్పట్నుంచీ మళ్ళీ సొంతూరు రాలేదు. మళ్లీ ఇదే రావటం. ఒక్క రాఘవయ్య మాస్టారితో తప్ప ఇంకెవరితోనూ సంబంధాలు లేవు!

♦ ♦ ♦

"చాలా ఘోరం జరిగిపోయింది సుకుమారూ! నిన్ననే ఎమ్మార్వో ఫోన్ చేశారు. 'చలమయ్య మీకు తెలుసా' అని. తెలుసన్నాను. చెన్నపట్నం నుంచి వస్తూ కరోనాతో హాస్పిటల్లో ట్రీట్‌మెంటు తీసుకున్నా ప్రయోజనం లేకపోయింది. శవదహనం జరిగిపోయింది" రాఘవయ్య గారు దు:ఖం ఆపుకోలేక పోయారు.

సుకుమార్ తలగోడకి కొట్టుకొని ఏడవటం మొదలు పెట్టాడు. "పుత్రులు తల్లిదండ్రులనుద్ధరిస్తారనుకుంటారు. నేను వాళ్లకేమీ చేయలేకపోయాను. నేదు ద్రోహిని. పాపిని. వాళ్ల ఉసురు పోసుకున్న నేను క్షమార్హుణ్ని కాను మాస్టారూ!"

'ఇప్పుడేడిస్తే ఏం లాభం నాయనా! అంతా అయిపోయింది. జరిగిందేదో జరిగిపోయింది. మీ నాన్న ఓ మహావృక్షం. చెట్టు సగానికి నరికినా అది మళ్ళీ చిగుళ్లు తొడిగి నీడనిస్తుంది. మీ నాన్నా అంతే. నా బలవంతంమ్మీద ఐదు లక్షలకి ఎల్లయిసీ చేశాడు. అప్పుడు పాతిక సంవత్సరాల స్కీము.. ఇంకా సంవత్సరం కట్టాలి. ప్రతి సంవత్సరం మీ నాన్న డబ్బులు కట్టి పాలసీని బతికించుకున్నాడు. నెలనెలా డబ్బులు పంపి దాచుకునేవాడు. "ఎందుకు చలమయ్యా! ఈ డబ్బేం చేస్తావు?' అంటే 'మా సుకుమార్ పిల్లలోడు, ఆడికే" అనేవాడు. నీ మాద కోపం అన్నదే అతనికి లేదు. నువ్వీఫారాల మీద సంతకం చెయ్యి. బోనసుతో సహా 10 లక్షలు రావచ్చు. అంతే కాదు.. మీ నాన్న గడించిన మూడెకరాల పల్లం ఉంది. ఇప్పుడు కాలవ వచ్చింది. ఎకరా పాతిక లక్షలు ధర పలుకుతుంది. పొలంలో టేకు మొక్కలున్నాయి. అవన్నీ కలిపితే వచ్చిన డబ్బు నీకేననేవాడు. ఆ కాగితాలన్నీ ఇవిగో" అని ఎల్లైసీ డాక్యుమెంట్లు, పట్టాదారు పాసు పుస్తకాలు సుకుమార్ చేతికిచ్చాడు.

సుకుమార్ కళ్లల్లోంచి నీళ్లు కెరటాల్లా తరముకొని వచ్చాయి. అనుకోని సంపద ఘుల్లు ఘుల్లుమని కాళ్ల దగ్గరకు రావటం చేతనా? తండ్రి మరణాన్ని తట్టుకోలేకనా? అన్న విషయం రాఘవయ్య గారికి అర్థం కాలేదు.

■



## గంట

ఫోను గంట మ్రోగింది
నేనులేనని బదులిచ్చి
పక్కకి ఒత్తిగిలి పడుకున్నాను

తలుపు గంట మ్రోగింది
నేను లేనని బదులిచ్చి
పక్కకి ఒత్తిగిలి పడుకున్నాను

అలారం గంట మ్రోగింది
నేను లేనని బదులిచ్చి
పక్కకి ఒత్తిగిలి పడుకున్నాను

ఒకరోజు
మృత్యు గంట మ్రోగింది
గాబరాగా లేచి కూర్చున్నాను..
'నేనున్నాను- నేనున్నాను- నేనున్నాను'
మృత్యువు అంది
'పక్కకి ఒత్తిగిలి పడుకో'

హిందీ మూలం : **కున్వర్ నారాయణ్**
తెలుగు అనువాదం : **పాయల మురళీకృష్ణ**

## పరిచయం




# అన్వేషణకు పురిగొల్పే పుస్తకం

- ఆర్.డబ్ల్యు.జె.విజయ కుమార్
94945 49969

**ఓ** ముఖచిత్రం, ఓ తుది చిత్రం.. ఆ రెంటి నడుమా కొన్ని పుటలు.... ఇంతేనా పుస్తకమంటే! అనేక కష్టనష్టాలకోర్చి, ఈతిబాధలకు తట్టుకొనీ తదేక ధ్యానంతో చేసిన తపఃఫలితం పుస్తకమంటే. ఓ రచయిత కన్న ఓ అందమైన కల. ఆలోచనల సుడిగాలుల్లో, అన్వేషణల్లో అనేక నిద్ర లేని రాత్రులు గడిపిన అనంతరం సాక్షాత్కరించిన సుమధుర స్వప్నం. అటువంటి పుస్తకాన్ని పరిచయం చేయాలంటే ఆ రచయితతో సహానుభూతి చెందగలగాలి. అతను తిలకించిన స్వప్నాన్ని మనమూ దర్శించగలగాలి. అప్పుడు మాత్రమే ఆ కృషిని తూచగలం. మరి 'పెద్దాపురం సాహితీ మూర్తులు' అనే ఈ గ్రంథాన్ని పరిచయం చేయడానికి నాకున్న అర్హత ఏమిటి? జోశ్యుల కృష్ణబాబు మాస్టారి అసంఖ్యాక శిష్యుల్లో నేనూ ఒకడిని. తరగతిలో మాస్టారి పద్య ఆలాపనని మంత్రమగ్ధుడినై వింటూ, అనుకరిస్తూ పద్యమాలపించే విధానాన్ని నేర్చుకున్నవాడిని.


'పెద్దాపురం సాహితీ మూర్తులు' పుస్తకాన్ని సంపుటి, సంకలనం... ఈ పేర్లేవీ సరితూచలేవు. ఎందుకంటే ఇదో పరిశోధనా గ్రంథం. ప్రాచీనుడైన ఏనుగు లక్ష్మణ కవి మొదలు ఇప్పుడిప్పుడే కలం ఝుళిపిస్తున్న సమకాలీన యువ కవులు, రచయితల వరకూ వారి సాహిత్య కృషిని పరిచయం చేసిన పరిశోధనా గ్రంథమిది. పరిధి విస్తృతమైనా తెగువతో, అంతకుమించి ప్రేమతో ఈ బాధ్యతను తలకెత్తుకున్నారు రచయిత. కాల గర్భంలో కలిసిపోయిన రత్నాల్లాంటి కవులనూ, రచయితలను ఆర్తితో తవ్వి తీసి పుస్తక పీఠంపై అధిష్ఠింపజేసారు. కళ్ళెదుటే సామాన్యుల్లా సంచరిస్తూ తమదైన రచనా పాటవంతో అలరిస్తూ ఈ మధ్యకాలంలోనే అస్తమించిన కవులూ, రచయితల సాహితీ సేద్యాన్ని ఎరుక పరిచి ఉన్నతాసనంపై వారిని కూర్చుండబెట్టారు. ఉత్సాహంగా కలం పట్టి, సామాజిక స్పృహతో, బాధ్యతతో రచనలు చేస్తున్న వర్ధమాన, యువ కవులకూ రచయితలకు కూడా సముచిత స్థానం కల్పించారు

'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నాడో అలంకారికుడు. ఇదే ఈ పుస్తకానికి మూలసూత్రం. ముద్రితమా, అముద్రితమా; ప్రచురితమా, అప్రచురితమా; సుప్రసిద్ధుడా, అనామకుడా... ఈ ప్రశ్నలకు తావే లేదిక్కడ. రచన చదువరుల మనసులను తాకిందా లేదా? వారి మస్తిష్కంలో చిరుముద్రలు వేసిందా లేదా? ఇది మాత్రమే ప్రామాణికం ఇక్కడ. అందుకే ఉద్దండులైన కవుల సరసనే వర్ధమాన కవులూ చోటు సంపాదించుకున్నారు. చేయి తిరిగిన మేటి రచయితల సరసనే ఇప్పుడిప్పుడే కలం పట్టి తప్పటడుగులు వేస్తున్న వారూ ఉన్నారు. ఈ పుస్తకం చూశాక.. 'మన ప్రాంతం పైనా ఇటువంటి పరిశోధనా గ్రంథమొకటి ప్రచురింపబడితే ఎంత బాగుండునో కదా' అనే ఆశ జనిస్తుంది. రచయితల కైతే 'నేను కూడా మన ప్రాంతపు సాహితీ మూలాలను ఓర్పుతో నేర్పుతో పరిశోధించి ఇలాంటి గ్రంథాన్ని కూర్చాలి' అనే ఆలోచనా బీజాలు హృదయ క్షేత్రంలో అప్రయత్నంగానే నాటుకుంటాయి. మనకూ మనసులోని భావాలను కవితగానో, కథగానో, పాటగానో మాటగానో ..... వ్యక్తీకరించాలనిపిస్తుంది. ఈ సాహితీ మూర్తులలో చేరిపోవాలని పిస్తుంది. తమ తమ ప్రాంతాల సాహితీ మూలాలను అన్వేషించడానికి పూనుకొనేలా పురికొల్పుతుంది. ఇదే రచయిత సాధించిన, సాధించదలచుకున్న విజయం. సామాన్యుల్లో తామూ సాహితీ కృవలులం కావాలనే తపనను రగిలించటం కన్నా మించిన ప్రయోజనం ఓ గ్రంథానికి ఇంకేముంటుంది?

■

కవిత

# యుద్ధమూ - సంధీ - శాంతి



యుద్ధం.. యుద్ధం.. యుద్ధం..
ఇప్పుడొక కామా ఫుల్‌స్టాపు లేని యుద్ధం నడుస్తున్నది
దృశ్య కరణిని సవాలు చేస్తూ
అదృశ్య కరణి విసురుతున్న
చావు అణుబాంబుల విస్ఫోటనాలు
సంధి చేసుకునే అవకాశమూ లేదు
చావో, గెలుపో తేల్చుకునే యుద్ధమే
శాంతి జెండా ఎగరేసే వీలూ లేదు
చావో, గెలుపో తేల్చుకునే యుద్ధమే
సంఘర్షణ తరాజుతో బతుకు మనుగడ సంఘర్షణ
పోరాటంలో దు:ఖం ముంపులు
బతుకులు శవాలై అనాథ శవాలుగా
శ్మశానాలకు చాలు కడ్తున్నయి
అదృశ్యకరణి గెలుస్తున్నట్లు కనపడుతుంది
దృశ్యం చేతులెత్తేస్తుందనే భయం
పిరికితనం, భయం దిగలాగుతున్నా
గాడి తప్పిన జీవనగమనం దారిలో పడటానికి
సైన్సు వసంతం వస్తుంది
దృశ్యం భరోసా జండా ఎత్తి తీరుతుంది
యుద్ధం ఏమిస్తున్నదో
అభిమన్యులై పోరాడినోళ్ళకు తెలుసు
ఓడిపోవడం మరణమా?
బతుకు జెండా యెగరడం గెలుపా?
ఆగిన దాడులు మళ్లీ ఎటువైపునుంచి
ముంచుకొస్తవో అని భయపెడ్తుంది
యుద్ధాల సీరియళ్లు ఎన్ని కన్నీటి సాగరాలను
చావు చిత్రాలను చరిత్రకెక్కించి చూపిస్తయో
శబ్దం మూగవోయి నిశ్శబ్దం యుద్ధమై
కాలంలో చీకటిమేడలు కడ్తున్నది
సంధీ శాంతీ లేని యుద్ధం సృష్టించిన
నష్టాన్ని నెమరేసుకుంటూ
బతుకు దీపాలు వెలిగిస్తామనే
సంకల్పం ఊపిరై నడిపిస్తది
మనిషి ప్రకృతితో సంధి చేసుకొని
మళ్ళీ సావాసం చేయడం మొదలు పెడితే
యుద్ధానికి సంధికి చెక్ చెప్పి
బతుకు శాంతి పొలమై పండుతుంది!

- వల్లభాపురం జనార్దన
94401 63687

## సాహిత్య ప్రస్థానం ఆగస్టు 2021 పురస్కారాలు

**కొన్ని కన్నీళ్లు .. కొన్ని ఆనంద బాష్పాలు**
*వ్యాసానికి రూ.500*
వ్యాసకర్త: **ఎస్.హనుమంతరావు**

**ఊరి మర్లు**
*కథకు రూ.500*
రచయిత : **మారుతి పురోహితం**

■■■

*వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*కథకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■


*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

కవిత

# ఆవిరైన స్వప్నాలోచనలు

- గోపగాని రవీందర్
94409 79882



కాలమెంత కఠినమైనదో
కన్నీళ్లు వచ్చినప్పుడల్లా
అవగతమౌతూనే ఉంటున్నది
మానవ జీవన ప్రవాహానికి
ఒడవని పరీక్షలను పకడ్బందీగా
ఏదో ఒక దశలో కాలం నిర్వహిస్తున్నది
జయాపజయాలతో సంబంధం లేదు దానికి
అధికార స్వరాల ఆధిపత్యంపైన
ధిక్కార అలలు ఎగిసిపడుతున్నాయిప్పుడు..!

ఇప్పుడంతా వస్తున్నవి కలత నిద్రలే
అంతులేని అయోమయమైన విచిత్రమైన
విడిచిపెట్టలేని భయంకరమైన వికార శబ్దాలు
పొరలు పొరలుగా ఉక్కిరి బిక్కిరి చేసే ఆలోచనలు
అసమానత్వపు వివక్షలు ఇంకెంత కాలమని
నిచ్చెన మెట్ల దురహంకారం ఇంకెంత కాలమని
జీవనానంద దృశ్యానికి పదే పదే
దూరమౌతూనే ఉంటున్నామందరమిప్పుడు..!

ఉన్మాదుల ఘాతుక చర్యలు
దూకుతున్నాయి జలపాతాల్లా నిరంతరం
మనల్ని సరదాగా నవ్వించేవో
మనల్ని కసిగా ఏడిపించేవో
మనల్ని ఎప్పటికప్పుడు హెచ్చరించేవో
అప్పుడప్పుడు మనల్ని పలకరించేవో
ఎన్నో మధురమైన అనుభూతుల
మరువని స్వప్నాలు లాలించేవి
ఇప్పుడవి కనుమరుగై కానరాని లోకాలకు
వెళ్ళాయని వేదనపడుతున్నామిప్పుడు..!

పని చేయాలని అడుగేస్తే చాలు
అవాంతరాల అడ్డుగోడలు
అప్రమత్తమై సిద్ధంగుంటాయి
నడిజామురాత్రి కావచ్చు
తెల్లవారుజామున కావచ్చు
సమయంతో సంబంధం లేకుండా
మదిని అనేక ప్రశ్నలు తొలుస్తున్నాయి
స్వేచ్ఛా వాతావరణానికి
సంకెళ్ళు తొలగిపోయేదెప్పుడని
ప్రజాస్వామికవాదులు నినదిస్తున్నారిప్పుడు..!

రోజులన్ని పక్షుల్లా ఎగిరిపోతున్నాయి
తీరని వాంఛలన్నీ మిగిలిపోతున్నాయి
కలలోనైనా తీర్చుకుందామని
కనులు మూస్తే చాలిక
విషాదంలో మునిగిన
కుటుంబాల ఆర్తనాదాలు
విపత్కర విషాదకర దుస్థితులు
తనువంతా సలుపుతున్న
గాయాలతో తల్లడిల్లుతున్నామిప్పుడు..!


మిత్రుల అవస్థల కథనాలు
ఊళ్లకు ఊళ్ల దు:ఖభరితమైన దృశ్యాలు
మనమంతా కట్టుదిట్టంగా ఉన్నా
కట్టడి చేయలేక పోతున్నామనే దిగులు
కాలం భుజాలపై భారం వేయడం తప్ప
ఓదార్పు సైతం నోచుకోవడంలేదు
నిస్సహాయ చూపుల దీనత్వం
కత్తుల్లా గుచ్చుకుని గాయపరస్తున్నాయి
ఈ శతాబ్ది అతి పెద్ద విపత్తుకు
మౌనసాక్షుల్లా రోదిస్తున్నామిప్పుడు...!

ఉపాధులు కోల్పోయి
రోడ్డున పడిన బతుకుల వెతలు
కాళ్లను నమ్ముకొని
వందల కిలోమీటర్లు నడిచిన
వలస కార్మికుల వొడవని దు:ఖాలు
చేయూత కోసం చకోర పక్షుల్లా
ఎదురు చూస్తున్న కోట్లాది ప్రజానీకం
వినూత్న పథకాలతో ప్రవేశపెడుతున్న
పాలకవర్గాల సంక్షేమ వరాల జల్లులు
ఎప్పుడొస్తాయని నిలదీస్తున్న గొంతులు
కంచెలను దాటుకుని వాళ్ళను చేరేలోగా
ఆ ప్రాంతాలన్నీ మనుషుల అలికిడి లేక
సమాధుల్లా దర్శనమిస్తాయి కావచ్చప్పుడు..!

పర్యావరణ విధ్వంసం వల్లనే
జరిగిన అనర్థదాయకమైన క్షోభ కావచ్చు
మితిమీరిన స్వార్థశక్తులు సృష్టించిన
బయోవార్ దుష్ఫలితాల ప్రభావం కావచ్చు
భూగోళంపై మనిషిని కాపాడుకుందాం
మనిషితనపు మానవత్వాన్ని చాటుదాం
ఆవిరైన స్వప్నాలోచనలను గాలిద్దాం
అసలైన స్వప్నాల తీరాలను చేరడానికి
నేలపై పచ్చని చిగురుల్లా వికసించి
భవిష్యత్ తరాలకు భరోసానిద్దామిప్పుడు..!

■

సమీక్ష



# గిరిజన వెతలను వినిపించే నగారా ధ్వనులు

- డాక్టర్ జి శైలమ్మ
9618361905

**ని**ర్మలాపుతుల్ ఒక సంతాలీ రచయిత్రి. సంతాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను, జీవన విధానాన్ని ఆమె కవిత్వీకరించారు. దీనిని అశోక్ సింహ్ హిందీలోకి అనువదించారు. డా॥ వి. చంద్రశేఖరరావు తెలుగులో 'నగారావలె ధ్వనిస్తున్న శబ్దాలు' పేర అనువదించారు. 'నగారా వలె ధనిస్తున్న శబ్దాలు' గిరిజనుల ఆవేదన నినాదాలు, ఆకలి ఆర్తనాదాలు, సంతాలీల సంస్కృతి ప్రతిబింబం.

స్త్రీలు ఏకాంతంగా ఉండటానికి గల కారణాలు తెలుసుకోవాలని, ఆస్తికి వారసురాలిగా చూడాలని, తను పుట్టింది ఒకచోట వివాహమైతే మరోచోట తనకు తెలియకుండా తన చిరునామా కోల్పోయే తీరుని ఆలోచించాలని ఈ కవిత్వం ప్రబోధిస్తుంది. స్త్రీ పిల్లలను కనే యంత్రం అనో, వంటింటి కుందేలుగానో చూడొద్దంటుంది. 'మీకు తెలుసా?' అన్న కవితలో ...

"ఒక 'స్త్రీ'కి తనదైన/ స్వంత భూమిని గూర్చి

మీరు చెప్పగలరా?" అని ప్రశ్నిస్తుంది.

"భూమిని వెతుక్కుంటున్న వ్యాకులిత వనిత" అన్న కవితలో

"ఇది ఎలాంటి మోసం!

ఒక మాన్య పురుష దృష్టితో

స్వంత ప్రపంచాన్ని చూడటంలో అందరమూ నేర్పరులమే!"

స్త్రీలకు ఆస్తిలో భాగమివ్వకుండా ఏదో విధంగా కొన్ని కానుకలిచ్చి వాటితో సరిపెట్టుకోమంటున్న వారందరు మాటనేర్పరులే అని అంటున్నారు. గిరిజన స్త్రీలు చేతిపనులైన ఈత చాపలల్లడం, చీపుర్లు, బూజుకట్టెలు, అల్లిక బుట్టలు, కోళ్ల జీబులు, ఈత బుట్టలు, విస్తరాకులు... ఇలా ఒకటేమిటి? నాగరిక సమాజం ఇళ్లను అలంకరించే వస్తువులను గిరిజన స్త్రీలు తయారు చేస్తున్నారు. ఇవి గిరిజనులనుగాని, వారి గృహాలనుగాని, వాటి ఇంటినిగాని పోషించలేకపోతున్నాయని 'బాహుముఖీ' కవితలో వివరిస్తుంది.

"నీ చేతుల్లో తయారైన విస్తళ్ళు

వేలాది మందికి పొట్ట నింపుతున్నాయ్.... కాని

ఆ వేలాది విస్తళ్ళనీ పొట్టని మాత్రం

పోషించలేకపోతున్నాయ్!"

మహిళలను వర్ణించడం, ఆనందాన్ని పొందడం కవులకు సహజగుణం. గిరిజన మహిళలను కూడా వర్ణించి వారి అందచందాలను వర్ణిస్తూ, వారు ఆనందంగా వున్నారని వర్ణిస్తున్న వైనాన్ని 'ఆదివాసీ ఆడపిల్లలు' అన్న కవితలో

"నిశ్చయంగా అతడు

మన శ్రమను దోచుకొని అనుభవించిన

మనిషి కావచ్చు" పుట:12.

నిజమే ఆదివాసీ ఆడపిల్లలు ఆదివాసీయేతర నాగరికులచేత మోసగింపబడుతూ నిరంతరం వారి వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారు, వాస్తవాన్ని దాచిపెట్టి అబద్ధాలను చెప్పడం

నిరసిస్తున్నారు.

కోడళ్లు, అత్తలు, అమ్మలుగా వున్న ఆదివాసీ స్త్రీలు దోపిడీ కాబడుతున్నారు. సారా కాసి వ్యాపారం చేయడం ద్వారా అదే సారాను గిరిజనులు తాగడం వల్ల తమ గ్రామాల్లో ఏ అరాచకం రాజ్యమేలుతుందని గ్రహించాలని, చదువు పేరుతో ఆదివాసీ పిల్లలను వ్యభిచారంలో దింపుతున్నారని తమ భాషతో మాట్లాడి ఆదివాసీయేతరులు చేస్తున్న మోసాలను తుద ముట్టించాలంటే గిరిజనులు మేల్కొనాలని అంటున్నారు.

ఆత్మ/ న్యాయం కోసం గావుకేక పెడుతూ

నీ బస్తీల్లోనే తిరుగుతోంది

చూడు, విను 'చూడకాఫోరెన్' పుట:16.

బతకడం కోసం శీలమమ్ముకొంటున్న గిరిజన స్త్రీలను రక్షించుకోమంటుంది. మోసం చేసిన పురుషుల నుంచి న్యాయం పొందడానికి కలసి ప్రయత్నం చేయండని వేడుకొంటుంది. ఆదివాసీల ప్రాంతంలోకి గిరిజనేతరుల ప్రవేశంతో వారి సంప్రదాయాలు మలినమవుతున్నాయి. పొలం దున్ని పంట వేయాలని చెప్పిన మాటను మరచిపోయి స్త్రీలు భూమిని దున్ని సాగుచేయడం నేరమని వారిని శిక్షిస్తున్నారని 'సజోనీ కిస్కూ – నాకేం చెప్పొద్దు'లో సజోనీకి జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తుంది. 'సజోనీ' పురుషుడు చేయగల పనులన్నీ చేయగలదు. అన్యాయాన్ని ఎదిరించగలదు. అదే ఆమె చేసిన తప్పు. అందుకుగానూ 'గూటానికి కట్టి గడ్డి తినిపించారు' పుట:19.

నీ భర్త నిన్ను/ పశువులా బలాత్కరించి

చెవీ ముక్కులు కత్తిరించి

ఇంటి బయటికి నెట్టేయగలడు" పుట:20.

సమాజం మంచిని సమాధి చేస్తుందని ఇక్కడ అరిచి చెప్పాలనుకొన్న అందరు చెవిటివారివలె వున్నారని అంటుంది. ఎదురు తిరిగి వాస్తవాలు మాట్లాడితే నగ్నంగా నృత్యం చేయిస్తున్న సంఘటనలు ఆదివాసుల ఆచారాలను అణచి వేయబడుతున్న స్త్రీ ఆవేదనను తెలియజేసింది. మారుతున్న గిరిజనుల సంప్రదాయాలు ప్రపంచీకరణతో అంతరించి పోతున్న సంథాల్ పరగణాలు' కవితలో వారి సంప్రదాయాలను పరిరక్షించాలంటూ మీటింగులు పెట్టి వ్యయం చేస్తుంటే సంథాల్‌పరగణాల సంప్రదాయాలు కొంచెం కూడ అక్కడ మిగిలి లేవని తెలియజేస్తుంది.

"అంతే! ఏముంది సంతాల్ పరగణాల్లో

సంతాలీ సంస్కృతీ శిథిలాలు కూడా

సంతాల్ పరగణాల్లో

కనుచూపుమేరలో కానరావు!"

ప్రకృతిలో భాగం చెట్లు. చెట్లను దయలేకుండా నరికేయడం వల్ల భూమి చింతిస్తుంది. భూమి బాగుంటే ప్రజలంతా బాగుంటారు. చెట్లను నరకడం ఆపి ప్రకృతిని రక్షించమని 'దు:ఖిస్తున్న ధరణి' అనే కవితలో వేడుకుంటుంది.

"నీ ఇంటి వెనుకభాగంలో/ రుధిర ధారలు విరజిమ్మే

గాలి గాథల గూర్చి/ ఎన్నడైన ఆలోచించావా?

నిశ్శబ్దంగా అన్నింటినీ భరిస్తూ/ ఎన్నడూ ఫిర్యాదు చేయని

భూమి పడుతున్న వేదన గురించి" పుట :30

భూమిని రక్షించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరి మీదుందని గుర్తు చేస్తుంది. సమాజంలో విసిగివేసారిపోయినవారు, కాశీ వెళుతుంటారు. మళ్లీ తిరిగొచ్చే దాకా నమ్మకం వుండదు. అలాగే, అస్సాంలో పనికోసం వెళ్లిన వారు తిరిగి ఇంటికి రాని సమయంలో ఆ కుటుంబం పడినపాట్లు గురించి ఓ కవితలో వినిపించింది. మారిపోయిన ఊరు, అరాచకం రాజ్యమేలుతున్న వైనాన్ని, ఒంటరిగా వున్న మహిళలపై గిరిజనేతర పురుషుల దాడిని 'దేపచా' – 'బాబూ' అన్న కవితలో తెలియజేశారు.

"రోజూ చాలా కష్టపడి

నదికెళ్ళి నీరు తెచ్చుకుంటున్నాను

స్కూలు కొళాయి పాడైనప్పుడు

"ప్రధాన్" ఇంటి నూతికి నీళ్ళకెళితే

సకిలిస్తూ చూస్తుంటాడు ప్రధాన్" పుట : 45.

అయినా, ఆమె ఇంటి నుంచి వెళ్లిన వారి కోసం ఎదురుచూడటం మాత్రం మానడం లేదు.

"ఇవన్నీ నేనెవరిపై నెట్టి

ఎక్కడికిపోను?

ఇన్ని బాధల్ని, దు:ఖాన్ని భరించాను

కాని మీ మాదిరి అమ్ముకోలేదు!" పుట:47.

ఆదివాసీ స్త్రీల దోపిడీ కాబడుతున్నారు. అందరూ చూస్తుండగా వారిని చూసి ముఖం చిట్లిస్తారని, రాత్రిపూట ఆహ్వానం పలుకుతారని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

"వాళ్ళు మా పరువుల మీద/ మమ్మల్ని బలాత్కరిస్తారు

మా భూమినే ఆక్రమించి/ మా ఉనికి గురించి ప్రశ్నిస్తారు" పుట : 56.

ఛత్తీఘడ్, జార్ఖండ్ స్వతంత్ర రాష్ట్రాలుగా ఏర్పడిన సందర్భంలో... సంతాలుని జాగ్రత్తపడమంటూ, ఎక్కడా ఎవరిచేతిలోనూ మోసపోవద్దని వేడుకొంటుంది.

ఝార్ఖండ్ రాష్ట్రం ఎన్నో పోరాటాల ఫలితం. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మరొకరి చేతిలోకిపోయి కీలుబొమ్మల్లా గిరిజనులు మారిపోయే ప్రమాదం వుందని హెచ్చరిక చేస్తుంది. "తమ్ముడా – మంగళ్ బేసరా!" జాగ్రత్తగా ఎందుకుండాలంటే

"నీవు ఎవరి శోషణ నుండైతే

విముక్తి కోరుకున్నావో – వాళ్ళు

నిన్నటి వరకు నీ విరోధులు

కాని – ఈ రోజు వాళ్ళే

అందరి కంటే ముందు

నీ వరుసలో నిల్చున్నారు

నీ మేలు కోరే పెద్దమనుషులుగా....

ఎంత ఆశ్చర్యం!" పుట : 62.

కూడా వుంటూ పోరాటాలు సృష్టించవచ్చు. రాష్ట్రం వచ్చిందని కాదు ఆ రాష్ట్రంలో గిరిజనులు కోరుకున్న స్వేచ్ఛ వుండేలా చూడాలని గుర్తు చేస్తుంది.

వివాహానికి ఒకప్పుడు విలువుండేది. ఒక పురుషుడికి ఒక భార్య వుండేది. కాలక్రమంలో నియమంలో మార్పు, ప్రేమలో మార్పు వచ్చింది. గిరిజన పురుషుడు ప్రకృతిలో భాగంగా ఉన్నప్పుడు..

"ఒక ముద్దు కోసం పూలమాల కట్టేవాడని

నీ జడ కుచ్చుల్ని పూలతో అలంకరించేవాడని" అంటుంది. పుట:72. ఇప్పుడు ప్రేమలో మార్పు ఎందుకొచ్చింది? "పిలచూ ముసలీతో" నాయనమ్మ చెప్పిన ప్రేమ కథలు కనిపించకపోవడం శోచనీయం.

"ఇప్పటి బుద్ధి లేని ప్రజలు – నీ వంశం వాళ్ళని

ఒకతెను విడచి – రెండవ దాన్ని

దాన్నీ విడచి – మూడవదాన్ని " పు:73.

ఇలాంటి సంస్కృతిని అసహ్యించుకొంటుంది.

ఆదివాసీలు తమని తాము రక్షించుకొని, తమ సమాజాన్ని కాపాడుకొనాలనుకొనే వీర వనితలు పుడుతుంటారు. "నిర్మలా పుతుల్ మరలా పుడుతుంది". పోరాటం చేసే వారిని అంతమొందిస్తే పోరాటం ఆగిపోతుందనుకుంటారు కొంతమంది. ఒక పోరాట యోధుడు మరణిస్తే మరో పోరాటయోధులు పుడుతూనే వుంటారు." అని కవితలో రాస్తుంది.

"ఈ పచ్చని భూమి మీద

ఎన్ని వర్ష బిందువులు వర్షిస్తాయో

అంతమంది నిర్మలా పుతుల్‌లు

పుడతారు.........." పుట : 92. అంటుంది.

గిరిజనులు సంతోషాన్ని, దు:ఖాన్ని ఏదైనా, సమాచారాన్ని అందరితో కలసి పంచుకోడానికి నగారాని మోగిస్తారు. వారి కష్టనష్టాలను కలబోసుకుంటారు. 'నగారా' దు:ఖంతో మోగగలదు, సంతోషంగా వుండే విషయాలను చెప్పాలనుకొని మోగిస్తే సంతోషంగా మోగగలదు. ఈ నగారా చేసిన శబ్దాలు గిరిజన స్త్రీల వెతలు, గిరిజన పోరాట యోధులు పడుతున్న అవమానాలు, అనుక్షణం సాగిస్తున్న ఆర్థిక దోపిడీలు ఒకటేమిటి? గిరిజన స్త్రీ పురుషుల మీద, వారి సమాజం మీద వచ్చిపడుతున్న కష్టాలను మనముందుకు తీసుకొచ్చే ప్రయత్న ఫలితం "నగారా వలె ధ్వనిస్తున్న శబ్దాలు". చక్కని తెలుగు లయలో వచ్చిన అనువాదం ఇది. డా॥ వేమకోటి చంద్రశేఖరరావు రచనా శిల్పం వస్తువు లోపం రానీకుండా చాల చక్కగా తెలుగు పాఠకునికి చదవాలనిపించే విధంగా కుదిరింది. ఇది గిరిజనుల జీవన విధానంపై పరిశోధన చేస్తున్నవారికి చక్కని ఉపయోగకారిగా చెప్పొచ్చు.

■

## సమీక్ష




# సమకాలీన సమాజ దర్పణం 'దార్ల మాట శతకం'

- డాక్టర్ జడా సుబ్బారావు
98490 31587

**ఉ**త్తమ పరిశోధకుడిగా, కవిగా, అధ్యాపకుడిగా, తెలుగుశాఖ అధ్యక్షుడిగా, బహు గ్రంథకర్తగా, ఉత్తమ సాహిత్య విశ్లేషకుడిగా ప్రసిద్ధులైన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు 'దార్ల మాట' శతకం ద్వారా శతకకర్తగా కూడా తమ ప్రతిభను చాటారు. ఒక పక్క విస్తృతంగా వ్యాసాలను వెలువరిస్తూనే, మరోపక్క అంతర్జాల సాహితీ సదస్సుల్లోనూ పాల్గంటూ తెలుగుభాష వైశిష్ట్యాన్ని దశదిశలా వ్యాప్తిచేస్తున్న భాషా ప్రేమికుడు.

తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. వంద పద్యాలు లేదా నూట ఎనిమిది పద్యాలతో మకుటాన్ని కలిగివుండే రచన శతకంగా చెప్పబడింది. కథా ప్రాధాన్యం, వర్ణనా ప్రాధాన్యం లేకుండా ఏ పద్యానికి ఆ పద్యంగా విడివిడిగా ముక్తకాలవలే ఉన్న శతకాలు తెలుగునాట సామాన్య ప్రజానీకంలో బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి. నీతి, భక్తి, వైరాగ్య, అధిక్షేపలాంటి అనేక శతకాలు కూడా ఆయా కాలాల్లో సమాజాన్ని విస్తృతంగా ప్రతిబింబించాయి.

'దారి పూలతోట దార్ల మాట' మకుటంతో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు రచించిన 'దార్ల మాట' శతకం 165 పద్యాలతో, సమాజంలోని అనేక అంశాలను వస్తు వైవిధ్యంతో దర్శింపజేస్తోంది. 'శంకరాభరణం' అనే వాట్సప్ గ్రూప్ ఇచ్చే పూరణలను పూరించి వారిచ్చిన ప్రోత్సాహంతో శతకాన్ని రచించాలనే ఆలోచన వచ్చినట్లుగా దార్ల తమ ముందుమాటలో చెప్పారు. ఈ శతకంలో సమకాలీన సమాజం చిత్రించబడిన తీరును రేఖామాత్రంగా పరిశీలిద్దాం.

**ఎన్నికల హామీలు - ఓటు విలువ**

భారతదేశం ప్రజాస్వామిక దేశం. ఐదేళ్లకోసారి రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా జరిగే ఎన్నికలు నిబద్ధత, విలువలు కలిగిన వ్యక్తుల్ని దేశాధినేతలుగా, ప్రజాప్రతినిధులుగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ప్రజల ఆశయాలకు, అవసరాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఈ ప్రతినిధులు పరిపాలన సాగించాలి. కానీ వాస్తవంలో ఎన్నికలు నిర్వహించడానికి చేసే ఆర్భాటపు ప్రచారాలు, ప్రజలకిచ్చే వాగ్దానాలు ఆచరణలో విఫలమవుతున్నాయి. అందుకే ఈ కింది పద్యంలో ఇలా చెప్తున్నాడు శతకకర్త.

**కప్పలన్ని కలిసి చెప్పలేనంతగా**
**వర్షమొదవు వేళ హర్షమొందు**
**ఎన్నికలకు ముందు ఎంత హడావిడో**
**దారి పూలబాట దార్ల మాట**

వర్షం వచ్చే ముందు కప్పలన్నీ కలిసి చెప్పలేనంతగా హర్షం వ్యక్తం చేస్తున్నట్లుగానే, ఎన్నికలచ్చేముందు మాత్రమే రాజకీయ నాయకులు హడావిడి చేస్తారు తప్ప తర్వాత కనిపించరని చెప్తున్నాడు. ప్రజలు చిన్నచిన్న తప్పులు చేస్తే ప్రభుత్వాలు జరిమానాలు వేస్తుంటాయి. కానీ నోటుతో ఓటు కొనుక్కోవడం అనే దాన్ని కూడా శతకకర్త నిశితంగా విమర్శిస్తున్నారు ఈ కింది పద్యంలో.

**తాగి కారు నడుప తప్పయినప్పుడు**
**ఓటు వేయునపుడు నోటునిచ్చి**
**తనకు వేయుమనుట తప్పు కాదందురా**
**దారి పూలబాట దార్ల మాట**

డబ్బులకు, వస్తువులకు లంగి ప్రజాస్వామ్యదేశంలో ఓటును అమ్ముకోకూడదనే సందేశం ఇస్తున్నాడు కవి. డబ్బులు తీసుకుని

ఓటువేస్తే వచ్చే నాయకులు కూడా దేశాన్ని, ప్రజాధనాన్ని కొల్లగొడతారని, ప్రజా పరిపాలన కుంటుపడుతుందని, మంచి నాయకులను ఎన్నుకోవల్సిన బాధ్యత ప్రజలదే కనుక పిచ్చివాళ్లను, తుగ్లక్'లను ఎన్నుకోవద్దని చెప్తున్నాడు శతకకర్త.

**నోట్ల రద్దు**

భారతదేశ ఆర్థిక వ్యవస్థను కుంగదీసిన చర్యల్లో నోట్లరద్దు ఒకటి. లక్షలాది ప్రజల జీవితాలను రోడ్డున పడేసి, చిరు వ్యాపారుల పాలిట పీడకలలా దాపురించిన నోట్ల రద్దు వల్ల జరిగిన 'సత్ఫలితాలు' అందరికీ అనుభవంలోనివే. 'ఏనుగులు దూరే దారి విడిచిపెట్టి చీమలు దూరే దారిని మూసిన' చందంగా నల్లధనాన్ని, అవినీతిపరులను బయటకు తీయాలనే అత్యుత్సాహం భారత ప్రజల ప్రాణాలతో చెలగాటమాడింది. బ్యాంకుల్ని కొల్లగొట్టిన పెద్దలంతా విదేశాల్లో దాక్కుంటే, కష్టపడి కూలిపనులు చేసి దాచుకున్న సొమ్ముల కోసం ప్రజలంతా రోడ్లపాలయ్యారు. అందుకే ఈ కింది పద్యంలో ఆ అవస్థలను చెప్తుంది.

**నలిగిపోయె జనత నల్లధనము పేర**
**నోట్ల రద్దు వలన కోట్లకొలది**
**చావు రాక బ్రతికి సన్యాసులయ్యేరు**
**దారి పూలతోట దార్ల మాట"**

**"క్రొత్త నోట్ల వలన కోరి వచ్చుననిరి**
**నోట్లు రద్దు చేయ కోట్ల కొలది**
**నల్ల ధనము లేదు తెల్ల ధనము లేదు**
**దారి పూలతోట దార్ల మాట"**

**బ్యాంకుల నిర్వీర్యం**

'దోచుకునే వాడికి దారులెక్కువ' అన్నట్లుగా ప్రస్తుతకాలంలో బ్యాంకుల్ని కొల్లగొట్టడం ఆనవాయితీగా మారిపోయింది. చిన్నచిన్న వ్యాపారస్తులకు అప్పులివ్వడానికి ఎన్నో నిబంధనలు పెట్టే బ్యాంకులు పెద్దవాళ్లకు మాత్రం వేలకోట్ల రూపాయల్ని అప్పుగా ఇచ్చి అవి వసూలు చేయడానికి వాళ్ల ముందు చేతులు కట్టుకుని నిలబడుతుంది. అదే పేదవాడు తీసుకున్న అప్పును ముక్కుపిండి వసూలు చేస్తుంది. అందుకే ఈ కింది పద్యాల్లో ప్రస్తుత పరిస్థితిని చమత్కారంగా చెప్తున్నాడు శతకకర్త.

**పట్టపగలు దోచి నిట్టనిలువు ముంచు**
**విజయ మాల్య మోడి ఖిలుండు**
**బ్యాంకు వైపు పోకు బెంగ యెక్కువగును**
**దారి పూలతోట దార్ల మాట"**

**"స్టేటు బ్యాంకు బుద్ధి వేస్టు బుద్ధగునట**
**డబ్బులున్న యెడల ధర్మహుండి**
**దోచుకొనుట కొరకు దొడ్డ యాప్పుండురా**
**దారి పూలతోట దార్ల మాట**

బ్యాంకులు పెద్దవాళ్లకే చుట్టాలుగానీ పేదవాళ్లకు కాదని, బ్యాంకు వైపు వెళ్తే బెంగ ఎక్కువని చెప్తూనే దోచుకోవడానికి దొడ్డయాప్పుండురా అని చమత్కరిస్తున్నాడు కవి. వేలకోట్ల రూపాయలకు ఎగ్గొట్టి విదేశాల్లో తలదాచుకున్న వాళ్లను మనదేశానికి తీసుకురావడానికి ఎన్ని తిప్పలు పడుతున్నారో మన అనుభవంలోనిదే.

**మాతృభాష**

మాతృభాషా పరిరక్షణ అనేది నినాదం స్థాయినుంచి వివాదం స్థాయికి చేరుకుంది. తెలుగులో మాట్లాడడం కంటే ఇంగ్లీషులో మాట్లాడ్డానికే నేటి యువత ఆసక్తి చూపిస్తోంది. మాతృభాషను పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు కూడా తెలుగుభాషను పట్టించుకోవడం లేదు. తెలుగు పాటల్లోనూ, మాటల్లోనూ నూటికి 99 శాతం ఆంగ్లమే వినిపించడం విచారకరం. తెలుగుభాషా పరిరక్షణ సమితి కోసం ఎన్నో సంస్థలు ఆవిర్భవించి కఌషి చేస్తున్నా ప్రభుత్వాల నుంచి సరైన సహకారం లేక నిరుపయోగమౌతున్నాయి. దక్షిణాదిలోని కర్నాటక, తమిళనాడు, కేరళలాంటి రాష్ట్రాలు తమ మాతృభాషను కాపాడుకోవడానికి పెద్దపీట వేస్తుంటే మన ప్రభుత్వాలు భాష విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం బాధాకరం. 'ఇతర భాషలు ఎన్ని నేర్చినా మాతృభాషను మరచిపోవద్దు' అనే ఉద్బోధ ఒక తెలుగు ఆచార్యుడుగా ఈ కింది పద్యాల్లో వ్యక్తపరుస్తారు శతకకర్త. ఆంగ్లభాషను తేనెతోనూ, మాతఅభాషను నీళ్లతోనూ పోలుస్తూ, నీళ్లు మనకు నిత్యావసరం కనుక భాష విషయంలో జాగ్రత్తపడమని చెప్తున్నాడు

**"అవసరంబు మేర యన్యభాషనయిన**
**మాటలాడవలయు మరువవద్దు**
**మాతఅభాషయేను మనకు జీవనమగు**
**దారి పూలతోట దార్ల మాట"**

**"మాతృభాష యన్న మాకిపుడది బూతు**
**యెంగిలాంగ్లమన్న నెంత హాయి**
**ఊరకనుటకైన నుండవలె కదరా**
**దారి పూలతోట దార్ల మాట"**

**"మంచినీటి వోలె మనకాంగ్ల భాషయ్యె**
**తేనె వంటిదాయె తెలుగు భాష**
**నిత్యమవసరంబు నీళ్లాయెను కదరా**
**దారి పూలతోట దార్ల మాట"**

**మధుమేహం**

ఈ శతకంలో కనిపించే కొన్ని పద్యాలు 'మధుమేహా'నికి సంబంధించినవి. జన్యుపరంగా సంక్రమించే వ్యాధిగానే కాకుండా ఆధునిక కాలం జీవనశైలి కారణంగా, మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా, విపరీతమైన పని ఒత్తిడి కారణంగా చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ 'షుగరు' వ్యాధి బారిన పడుతున్నారు. ఒక్కసారి షుగరు వస్తే జీవితాంతం మాత్రలతోనో, ఇంజెక్షన్లతోనో కాలం గడపాల్సిందే. షుగరును పూర్తిస్థాయిలో అరకట్టడానికి మందులింగా అందుబాటులో లేని కారణంగా ఎవరికి వారుగా వ్యక్తిగతంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. కనిపించిన ప్రతివారూ 'అది తినకు', 'ఇది తినకు' అని సలహాలిచ్చేవారే గానీ మధుమేహాన్ని మట్టుబెట్టే శాస్త్రవేత్తలు లేరని చెప్తూ 'మనల జంపు సఖి మధుమోహనాంగి' అని చమత్కరిస్తున్నాడు కవి.

**"అడగకుండనిత్తురందరు సలహాలు**
**శాస్త్రవేత్తలేరి శాశ్వతముగ**
**మట్టుబెట్టువారు మధుమేహ జాడ్యమున్**
**దారి పూలతోట దార్ల మాట"**
**"తినకముందు నొకటీ తిన్నప్పుడొకటి**
**పొడుచుకొనవలయును జడుసుకొనకు**
**మనల జంపు సఖియె మధుమోహనాంగిరా**
**దారి పూలతోట దార్ల మాట"**

**కార్పొరేటు విద్య, వైద్యం**

దేశప్రజలందరికీ అవసరమైనవి విద్య, వైద్యం. విద్య వ్యక్తిని మానసికంగా స్థిమితంగా ఉంచడానికి, వైద్యం మనిషి బలహీనపడకుండా ఉండడానికి సహాయపడుతుంది. దురదృష్టవశాత్తూ మనదేశంలో విద్య, వైద్యం ప్రైవేటు, కార్పొరేటు సంస్థల చేతుల్లోకి వెళ్ళిపోయాక ధనవంతులకు తప్ప సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. కరోనా లాంటి విపత్తులు వచ్చాక కూడా కార్పొరేటు మాయాజాలాలు ఎంత దారుణంగా ఉన్నాయో, లక్షలు డబ్బు వసూలుచేసి శవాల్ని ఇచ్చిన పరిస్థితులు ఎంత హృదయవిదారకంగా ఉన్నాయో మన అనుభవంలోని విషయాలే. అందుకే 'కాటు వేయగలదు కార్పొరేటు', 'కార్పొరేటు విద్య కలలు త్రుంచె' అని చెప్తూ నేటి వాస్తవ పరిస్థితిని కళ్లముందుంచుతున్నాడు కవి. ఒకనాడు ఆత్మవిశ్వాసాన్నిచ్చిన చదువు నేడు పిల్లల్ని ఆత్మన్యూనతలోకి తీసుకెళ్లి వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పించడం విచారకరం.

**"కదులు మెదులు లేక కనపడకుండనే**
**కాటు వేయగలదు కార్పొరేటు**
**కరుణ యనెడి మాట తరచి చూసిన లేదు**
**దారి పూలతోట దార్ల మాట"**
**"విద్యనిచ్చు నాత్మవిశ్వాస మొకనాడు**
**కార్పొరేటు విద్య కలలు త్రుంచె**
**విద్య పేరు చెప్పి విసుగెంత పెట్టురా**
**దారి పూలతోట దార్ల మాట"**

**నీటి విలువ**

'భవిష్యత్తులో జరిగే యుద్ధాలన్నీ నీటికోసమే' అంటారు దృశ్యాదృశ్యం నవలా రచయిత్రి చంద్రలత. మనిషికి ప్రకృతి ప్రసాదించిన అద్భుత వరప్రసాదం నీళ్ళు. అయినా నీటి విలువ తెలుసుకోవడంలో, నీటిని నిలువచేయడంలో మనమెప్పుడూ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నాము. గోదావరీ జలాల వివాదాలు, కావేరీ జలవివాదాలు, కఅష్ణాజలాల వివాదాలు ప్రస్తుతం ప్రభుత్వాల మధ్య ఎంత అస్థిరతను కలిగిస్తున్నాయో నిత్యమూ చూస్తూనే ఉన్నా మనలో పరివర్తన కలగకపోవడం శోచనీయం. కనుకనే ఏ కాలమైనా నీటి అవసరం తప్పనిసరి. అందుకే నీటివిలువను గుర్తించి నీటిని నిల్వచేసుకోమని ఉద్బోధిస్తున్నాడు ఈ కింది పద్యాల్లో.

**"వరదవోలె మనము వదిలెదు జలమును**
**మంచినీరు వోలె మరల మనకె**
**ఇచ్చునండి మార్చి ఇంకుడు గుంతలే**
**దారి పూలతోట దార్ల మాట"**
**"విప్పి యుంచకండి విచ్చలవిడిగాను**
**పళ్లు తోమునపుడు పట్టనట్టు**
**ఎల్లవేళలందు నల్లాను బిగియించు**
**దారి పూలతోట దార్ల మాట"**
**"గడ్డమెపుడు గీయ నడ్డదిడ్డంబుగా**
**వ్యర్థముగను నీళ్ళు వదులుచుండ్రు**
**కొద్ది నీళ్ళె కోట్ల గొంతు తడిపె చూడు**
**దారి పూలతోట దార్ల మాట"**

**కులం**

నేడు రాజకీయానికి, అరాచకీయాలు సృష్టించడానికి అవసరమైన అంశం కులం. 'వేరెవర్ యూ గో అవర్ నెట్వర్క్ ఫాలోస్' అన్నట్లుగా మనిషి ఎక్కడికి వెళ్ళినా కులం అతన్ని వెంటాడుతూనే ఉంది. గుర్రమెక్కాడనీ, తలపాగా చుట్టాడనీ, పంక్తిలో కలిసి కూర్చుని భోజనం చేశాడని, ఆవును దొంగిలించాడని.. ఇలా ఎన్నో కారణాలతో దళితులు అగ్రవర్ణాల హింసను భరిస్తూనే ఉన్నారు. వీటికి తోడు పరువు

హత్యలకు లెక్కేలేదు. 'భళిభళి అన్నవాళ్లంతా నీదే కులమని అడిగితే బాకులతో పొడుస్తున్నట్లుగా' ఉందని వాపోతాడు జాషువా. ఈ పరిస్థితి మారాలనే ఆవేదన ఈ కింది పద్యాల్లో వ్యక్తపర్చాడు శతకకర్త.

**"దళితుడెంత యున్నత పదవి నుండిన**
**కులము కర్మ యనుచు కూర్మి లేదు**
**భరతభూమినందు భాగ్యంబు చూడరా**
**దారి పూలతోట దార్ల మాట"**

**"కలవకుండ నెంత కాలముంచగలవు**
**మాల మాదిగలను మాయచేసి**
**వలదు రచ్చగొట్టు వర్గీకరణ నేడు**
**దారి పూలతోట దార్ల మాట"**

వైరాగ్యం

ఆస్తులు కోల్పోయినప్పుడో, ఆప్తులు దూరమైనప్పుడో, అనారోగ్యం పీడించినప్పుడో మనిషి తనకు తెలియ కుండానే వైరాగ్యంలోకి దిగిపోతాడు. అప్పటివరకూ తానునుభవించినవన్నీ వఅథాగా అనిపిస్తాయి. కలిగివున్న సంపదలు, సౌకర్యాలన్నీ పనికిరానివిగా తోస్తాయి. ఈ శతకంలో కూడా ఈ రకమైన వైరాగ్య భావనను వ్యక్తపర్చిన పద్యాలు కనిపిస్తాయి. 'ఏమి కొనుచు వచ్చు, ఏమి తాగొని పోవు, పుట్టువేళ నరుడు గిట్టువేళ' అని చెప్పిన వేమన పద్యాలను జ్ఞప్తికి తెచ్చేలా ఉన్న ఈ పద్యాలు మనిషి భవబంధాల భ్రమల నుంచి బయటపడడానికి, తనను తాను తెలుసుకోవడానికి, తనలోని దైవత్వాన్ని గుర్తించడానికి, జీవితం నీటిబుడగతో సమానమనే సత్యాన్ని గ్రహించడానికి ఉపయోగపడతాయి.

**"ఏది శాశ్వతమగు నేదశాశ్వతమగు?**
**నిన్న నేటికేది? మొన్న యేది?**
**తల్లిదండ్రులన్నదమ్ములంతయు భ్రమ**
**దారి పూలతోట దార్ల మాట"**

**"ఏల వచ్చినావు? ఎందుకు పోవలె?**
**మమతలేల? మరల మరణమేల?**
**నీటి బుడగవోలె నిత్యమ్ము మునకేల**
**దారి పూలతోట దార్ల మాట"**

నిద్ర

'మా కంపెనీ పరుపులు కొనండి, తనివితీరా నిద్రపొండి' అంటూ టీవీలో కనిపించే ప్రకటనలు కోకొల్లలు. వాతావరణ అనుకూలత, మానసిక ప్రశాంతత లేకుండా నిద్రపోవడం అసాధ్యం. నిరంతరం డబ్బు సంపాదనలో మునిగి తేలుతున్న ప్రజానీకానికి మంచినిద్ర కరువైపోయింది. 'కొనగవచ్చు పరుపు, కొనగలవా నిద్ర' అన్నట్లుగా అరనిద్రతో సరిపెట్టుకునే స్థితికి మానవాళి చేరుకుంది. ఉద్యోగాల్లో 'రాత్రి డ్యూటీలు' వచ్చాక నిద్రపోవడమన్నది అందని ద్రాక్షగా మారిపోయింది. వచ్చే జీతాలతో పట్టెమంచాలు కొనుక్కుంటాం, పట్టు పరుపులు కొనుక్కుంటాం కానీ మంచి నిద్రను పొందలేము. 'తిండి నిదుర రెండు తింగరిబుచ్చులే' అంటూ తిండికీ నిద్రకూ ఉన్న సంబంధాన్ని చమత్కారంగా ఈ కింది పద్యాలలో చెప్తాడు శతకకర్త.

**"పట్టెమంచమున్న పడుకొనలేమాయె**
**నడుమునొప్పులన్ని నాట్యమాడు**
**జీతమున్నగాని జీవితం బేదయా**
**దారి పూలతోట దార్ల మాట"**

**"నిదుర పోకుమన్న నిదురవచ్చునెపుడు**
**నిదుర పోదమన్న నిదురరాదు**
**తిండి నిదుర రెండు తింగరిబుచ్చులే**
**దారి పూలతోట దార్ల మాట"**

ప్రతి పద్యాన్ని ప్రాణం పెట్టి విలక్షణంలా మలచడంలో అందెవేసిన చేయిగా కనిపిస్తారు ఈ శతకకర్త. కొన్ని పద్యాల్లోని అభివ్యక్తులు వినూత్నంగా అనిపిస్తాయి. చక్కటి పోలికలతో చెప్తున్న విషయాన్ని దృశ్యమానం చేస్తాయి. తీరికలేని అధ్యాపక విధులతోనూ, పరిపాలనా బాధ్యతలతోనూ సతమతమవుతునే మనసుకు ఊరట కలిగించే సాహిత్య పఠనాన్ని విడిచిపెట్టని నిరంతర అధ్యయన శీలి. 'కులమతాలన్నీ కుత్సిత బుద్ధుల'ని ధైర్యంగా చెప్పగల చైతన్య శీలి. 'అన్ని మరచిపోతిని అమ్మను చూడగా' అని అమ్మపై ప్రేమను తెలియజేసినా, 'మనసు పొడుచునట్లు మాట పలుకుటేల' అని సున్నితత్వాన్ని ప్రదర్శించినా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి వ్యక్తిత్వంలోని మరో కోణం మనకు అవగత మవుతుంది. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ శతకాలు రచించాలని ఆశిద్దాం. ■


## ప్రస్థానం

**చందాదారులుగా చేరండి ...**

**చేర్పించండి..**

**వివరాలకు**

**94900 99157 నెంబర్లో**

**సంప్రదించండి.**

## కవితలు

# మగన్యాయం

- మందరపు హైమవతి
9441062732

**చ**ర్మలిపి మాత్రమే తెలిసిన వారికి
అద్దంలో ప్రతిబింబంలా
అవయవాలు మాత్రమే కనిపించే వారికి
బట్టల వెనకవున్న మనసు కనిపించదు
చర్మం పొరల కిందవున్న హృదయం అదృశ్యం
మాంసం భాష మాత్రమే తెలిసిన వారికి
తరతరాల నుంచి చేసిన గాయాల ఆనవాళ్ళు గుర్తుండవు
న్యాయమూర్తుల వారూ! అభినందనలు!

ఎంత మంచి తీర్పు ఇచ్చారు!
పండగ చేసి కొంటారు అందరూ!
ఇప్పుడు బట్టలకీ చర్మానికీ మధ్య
అంగుళాల్లెక్కన దూరమెంతో కొలవాలి
జాకెట్‌కి దానికింద వున్న గుండెలకి మధ్య
దూరాన్ని లెక్కించాలి
చీరకు శరీరానికీ మధ్య ఎడాన్ని గణించాలి
దేహం మీద గాయం చేసిన వారినే శిక్షించే
న్యాయమూర్తులు
శరీరం పోస్టర్లపై మురికిచూపుల పేడముద్దులు చల్లినా
దేహ ప్రతిమలను చూపుల చేతులతో తడిమినా
తనవు పూలవనంపై తుమ్మెదల తొండాలు గుచ్చినా
నేరమేమీ కాదు
చర్మాన్ని తాకితేనే గదా శిక్ష
దేహాన్ని చీల్చి రెండు తొడల మధ్య వీరంగం వేసినా
సాక్ష్యం లేకపోతే శిక్ష పడదు
అవమానాల మాటల తూటాల గురిపెట్టినా
నిందల వడిసెల రాళ్ళు విసిరినా ఏం ఫరవాలేదు
ఆడవాళ్ళు కదా!
పురుషాహంకార పర్వతం పాదాలతో తొక్కేస్తారు
అసలే న్యాయదేవత అంధురాలు!
ఆపై మగన్యాయం మరింత గుడ్డిది!

■




# ఆత్మస్తుతి - ఒక శోధన!

- నిఖిలేశ్వర్
9177881201

**మా**నవ మేధస్సు
ఒక మహా సంక్రమణం
శతాధిక యుద్ధాల ఖండాంతరాల
బలాబలాలను
అదుపు చేసిన తేజస్సు
ధరిత్రి రొమ్ములో
సజీవంగా వున్న క్రిమిచేతిలో
ఇపుడు బూదిగా ఎముకల పోగుగా
చివరికి శిలాజాలుగా మిణిలేచోట
పురాస్మృతిగా
తవ్వుకుంటూ తవ్వుకుంటూ..
భూగోళపు అంచుల దాకా
మరేమో అక్కడ పొంగిపొర్లని
మహాసముద్రాల మంచు మౌనం
ఇక అంతరిక్ష హద్దులు మీరని
గ్రహాల గతిని గణిస్తూ
సర్వత్రా దాగిన వైరస్‌ను విసర్జించే యోచన!
అణ్వాయుధాల గొడుగుల కింద
శాంతి సందేశాలు వెదజల్లే
దేశాధిపతుల ఆత్మవంచన
పరస్పర ఆక్రమణల భయాల మధ్య
స్వజాతీయతల పురావైభవాల
నిరంతర సంకీర్తనల ఆత్మస్తుతి!

■






# ఉత్తరాంధ్ర బడుగు జీవుల బతుకు కథ

- పిల్లా తిరుపతిరావు
70951 84846

**వం**దేళ్ల ఉత్తరాంధ్ర జనజీవనాన్ని కళ్ళ ముందు పెట్టడం ఒక గొప్ప ప్రయత్నం. దానిని ఓ కథ గానో, ఓ వ్యాసం గానో బంధించాలంటే అసాధ్యం. అందుకే ప్రముఖ కథా, నవలా రచయిత అట్టాడ అప్పల్నాయుడు బృహత్తర సాహితీ యజ్ఞానికి పూనుకొన్నారు. ఉత్తరాంధ్ర బహుజనుల దుర్భర జీవనయానాన్ని ఇముడ్చుతూ 'బహుళ' నవలకు శ్రీకారం చుట్టి, మూడేళ్ల కాలానికి పూర్తి చేసి, ఇటీవల ఆవిష్కరించారు. సుమారు 170 పాత్రలతో 467 పుటల నిడివి గల పెద్ద నవల బహుళ. ఈ నవల్లో ప్రతి పాత్రకు రచయిత జీవం పోయడంతో అవి సజీవ శిల్పాల్లా మన ముందు దర్శనమిస్తాయి. పాఠకులు తమ జీవితాలను వెనక్కి తిరిగి చూసుకుంటే, ఈ పాత్రలన్నీ ఏదో రూపంలో తారసపడినవే. అంతలా జనజీవన అంత:సంబంధాలను, అంతరంగాలను తడుముతూ నవల ఆద్యంతమూ ఆసక్తికరంగా నడుస్తుంది.

రచయిత తన స్వీయ అనుభవాలల్లోంచి, పరిశీలనల్లోంచి చూసిన పాత్రలనే ఎంపిక చేసుకుని ఈ సుదీర్ఘ నవలా రచనకు పూనుకోవడమనేది యథార్థం. ఇందులో రచయిత జీవితం కూడా ఉన్నట్లే అనిపిస్తుంది. అందుకే రచయితతో దగ్గరి సంబంధం ఉన్న 'గంటేడ' వారికి కూడా ఈ భావనే స్ఫురించింది. రచయిత ఆశావహ దృక్పథంతో నవలలోని పలు సామాజిక చేతనాంశాలను ప్రజల ముందు ఏకరువు పెట్టారు. అవి ఏనాటికైనా ఆచరణ రూపంలోకి రావలసిన అగత్యాన్ని చాటుతాయి. శతాబ్దాల కాలంగా ఆధిపత్య భావజాలం గల వ్యక్తుల చేతుల్లో అనేక ఒడిదుడుకులు, అష్టకష్టాలు, కన్నీటిపర్యంతాలు, పీడనలు, వేధింపులకు గురవుతున్న ఉత్తరాంధ్ర బహుజనులు నేటికైనా సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావల్సి ఉందని రచయిత ఆశిస్తాడు.

'నవల' అనేది వాస్తవ విషయాలతో మరికొన్ని కల్పిత సంఘటనలతో ఉత్కృష్ట కథన స్వభావం కలిగి ఒక నిర్దిష్ట పొడవుతో ముందుకు సాగుతుంది. ఇది ఒక సమగ్రమైన, సమాహార సాహితీ ప్రక్రియ. తెలుగులో ప్రఖ్యాతి గాంచిన సాంఘిక నవల ఉన్నవ మాలపల్లి. ఆచార్య రంగా ... టాల్‌స్టాయి 'యుద్ధము–శాంతి' నవలతో మాలపల్లిని పోల్చారు. ముందుమాట రాసిన ఏ.కె ప్రభాకర్ కూడా బహుళను అదే రీతిలో పోల్చడం గమనార్హం. ఈ నవల చదివేటప్పుడు గతంలో నేను చదివిన 'మాలపల్లి, ప్రజల మనిషి, ఏడు తరాలు, అంకుల్ టామ్స్ క్యాబిన్' నవలలు జ్ఞప్తికొచ్చాయ. రష్యన్ బోల్షెవిక్ ఉద్యమ నేపథ్యంలో నాటి దేశకాల పరిస్థితులను చూసి చలించిపోయి ఉన్నవ 'మాలపల్లి'ని రాసారు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యాన్ని, తదనంతర పరిణామాలను ప్రతిబింబిస్తూ 'ప్రజల మనిషి' రాశారు ఆళ్వారు స్వామి. బానిసత్వ నిర్మూలన దిశగా పోతూ, మహిళా హక్కుల ఉద్యమానికి బాటలు పరిచి, క్రైస్తవం స్వభావాన్ని శోధించడమనే

బలమైన నేపథ్యం 'అంకుల్ టామ్స్ క్యాబిన్'లో కనిపిస్తుంది. 'రూట్స్' నవలను 'ఎలెక్స్ హేలీ' రచించారు. ఇది 'ఏడు తరాలు' పేరిట తెలుగులో అనువాదమైంది. మిగతా నవలల కంటే, రూట్స్ నవలతో బహుళను పోల్చి చూస్తే, దగ్గర పోలికలు కనిపిస్తాయి. హేలీ తన వంశచరిత్రను తెలుసుకునే క్రమంలో పరిశోధన చేసి తన వంశ మూలపురుషుడైన 'కుంటాకింటే' నుంచి తన జీవితం వరకూ జరిగిన సంఘటనలను నవలలో హృద్యంగా పొందుపరిచాడు. ఆఫ్రికా నల్ల జాతీయుల బానిసత్వపు వేదనలు ప్రతిబింబించేలా ఆ నవల ఉంటుంది. బహుళలో కూడా రచయిత తన స్వీయచరిత్రనే చెప్పుకున్నట్లు అగుపిస్తుంది. ఈ క్రమంలో నడిచిన వివిధ పోరాటాలు వీరోచితంగా కనబడతాయి.

పెద్ద నిడివి గల 'బహుళ' నవలలోని పాత్రల భిన్న స్వరూప స్వభావాలను, కథాగమనం మలుపులను, చిన్న చిన్న పిట్ట కథలను, మొత్తం కథా సారాంశాన్ని కేవలం కొన్ని వందల పదాలలో నిబిడీకృతం చేస్తూ సమీక్ష రాయడం ఏ రచయితైనా సవాలే. 'కన్యాశుల్కం'లోని పాత్రల్లా 'బహుళ'లోని ప్రతి పాత్రకూ ఒక పరిశోధనా పత్రాన్ని రాయవచ్చు. అందువల్ల నవలలోని కథా సారాంశం, వివిధ దశల్లో కొనసాగిన ప్రజా ఉద్యమ నేపథ్యాన్నే మాత్రమే తీసుకుని సమీక్షించడం ఉత్తమంగా భావిస్తున్నాను.

ఏటికవతల అడివి. ఏటికివతల 'గంగువాడ' గ్రామం. ఆ ఊరిలో బేతాళయ్య అనే రైతు. అతని చిన్న కొడుకు పెద నారాయుడు. ఇతను సాహసి. ఇతనికి కోసంగి ఈనాందారు జగన్నాథదాసు కుమార్తె సుభద్రతో పెళ్లి చేస్తారు. పెదనారాయుడికి ఇద్దరు కుమారులు గుంపస్వామి, రామస్వామి. కుమార్తెలు ముగ్గురు. వారిలో చిన్నది వరహాలమ్మ. ఈమె కొడుకు నారాయుడు. నారాయుడు కూడా తన తాత పెదనారాయుడిలా ధైర్యశాలి. చిన్నతనంలో ఎక్కువగా తాతగారి ఇంటనే ఉండేవాడు. ఆ ఊరిలో సింహాద్రప్పయ్య గొప్ప తప్పెటగుళ్ళు కళాకారుడు. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చేవాడు. ఆ ప్రదర్శనను చూసిన నారాయుడు ఎలాగైనా తప్పెటగుళ్ళు నేర్చుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. నేర్చుకునే క్రమంలో సింహాద్రప్పయ్య కూతురు బంగారమ్మతో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారి, ఒకరోజు ఎవరికీ చెప్పాపెట్టకుండా భిలాయ్ లేచిపోతారు. వీరికి రాధేయ పుడతాడు. అక్కడ కూలీ దొరక్క, నారాయుడు అండమాన్ వెళ్తాడు. బంగారమ్మను కన్నవారు ఊరు పంపుతాడు. బంగారమ్మ తండ్రి చనిపోతే, నారాయుడు మేనమామ రామస్వామి ఆదరిస్తాడు. ఈలోగా నారాయుడు అండమాన్ నుంచి వచ్చి, మేనమామ ఇంట్లోనే ఉంటాడు. మేనమామ కూతురు అన్నపూర్ణ చాలా మంచిది. అన్నపూర్ణను చిన్నప్పుడే నారాయుడికి ఒనేసారు. కానీ అనుకున్నదొక్కటి అయిందొక్కటి. రామస్వామి చాలా మంచివాడు. నాయుడోరి కుటుంబం అయినప్పటికీ ఊరి జనంతో కలుపుగోలుగా ఉండేవాడు. రామస్వామి, సింహాద్రప్ప య్య మిత్రులు. అందువల్ల బంగారమ్మను సొంత కూతురిలా చూసుకునే వాడు. ఈలోగా రామస్వామికి ఆరోగ్యం చెడి చనిపోతాడు. దాంతో అన్నపూర్ణ ఒంటరి అవుతుంది. తన వల్లనే నాయుడోరి కుటుంబానికి చెందిన నారాయుడు అనేక కష్టాల పాలయ్యాడని, పైగా అన్నపూర్ణ ఒంటరిది అయ్యింది కాబట్టి, నేను ఎక్కడికైనా దూరంగా పోతే నారాయుడు అన్నపూర్ణను చేసుకొని, రాధేయను చక్కగా పెంచుకుంటాడని ఆలోచించి, ఒకనాటి రాత్రి బంగారమ్మ ఎవరికీ చెప్పా పెట్టకుండా ఊరు దాటి పోతుంది. కొన్నాళ్ళకు అనివార్యంగా అన్నపూర్ణను నారాయుడు పెళ్లి చేసుకుంటాడు. అన్నపూర్ణ రాధేయను కన్నబిడ్డ కంటే ఎక్కువగా చూసుకుంటుంది. రాధేయను చక్కగా చదివిస్తుంది. స్వామి మాస్టారి వల్ల రాధేయకు సామాజిక స్పృహ అలవడుతుంది.

రాధేయ పార్వతీపురంలో చదువుతుండగా, ఒకరోజు జనసందోహం మధ్య కోర్టు ఆవరణలో ఇద్దరు నక్సలైట్ నాయకుల మృతదేహాలను చూస్తాడు. అక్కడ ఒక లెక్చరర్ గొప్ప ఉపన్యాసాన్ని ఇస్తాడు. ఆ ఉపన్యాసానికి రాధేయ ఆకర్షితుడవుతాడు. ఈలోగా అక్కడికి పోలీసులు 'బలరాం' అనే నక్సలైట్‌ను తీసుకొస్తారు. కోర్టు ఆవరణ నుంచి బలరాం పోలీసులు కళ్ళుగప్పి తప్పించుకు పోతాడు. ఒక రాత్రివేళ రాధేయ మిత్రుడు రెల్లి జానేషు ఇంటికి బలరాం వచ్చి, రాధేయకు కబురు పంపుతాడు. అలా రాధేయకు బలరాంతో సాన్నిహిత్యం పెరిగి, ఉద్యమ సానుభూతిపరుడిగా ఉంటాడు. పలు సామాజిక కళా ప్రదర్శనలు గ్రామాల్లో ఇస్తూ ఉంటాడు రాధేయ. ఈ క్రమంలో సహ కళాకారిణిగా బలరాం కూతురు సంధ్య పరిచయం అవుతుంది. పరిచయం ప్రేమగా మారి రాధేయ సంధ్యను ఆదర్శ వివాహం చేసుకుంటాడు. రాధేయ, సంధ్య వ్యవసాయం చేస్తారు. కరువు కాటకాల వల్ల అనేక ఇబ్బందులు పడతారు. రాధేయ పాత్రికేయునిగా, కార్మికునిగా

చేరి, అష్టకష్టాలు పడుతూ, చివరకు ఒక ప్రభుత్వ ఉద్యోగిగా స్థిర పడతాడు. సంధ్య కేన్సర్ వ్యాధితో చనిపోతుంది. కొన్నేళ్ళ తర్వాత తన మిత్రుడు జానేషు కొడుకు సత్యకాం పిలుపు మేరకు మనవుడితో కలిసి గంగువాడ వస్తాడు రాధేయ. పెద నారాయుడు సమాధి వద్ద జరిగే సంబరాల్లో భాగంగా సత్యకాం పార్టీలకతీతంగా బహుజనోద్యమం సభను నిర్వహిస్తాడు. సత్యకాం అంబేద్కరిజాన్ని నమ్మినవాడు. ఆ సభకు హాజరైన రాధేయను పోలీసులు అడ్డుకుంటారు. రాధేయను 'అర్బన్ నక్సలైట్'గా పోలీసులు పేర్కొంటూ, సభలో పాల్గనవద్దని అంటారు. కానీ రాధేయ సభలో ప్రసంగిస్తాడు. ఆ ప్రసంగాన్ని చక్కగా వింటున్న ఒక ముసలమ్మను చూస్తాడు రాధేయ. అదే ముసలమ్మ పోలీస్ స్టేషన్‌లో కొనఊపిరితో పడి ఉండడంతో రాధేయ ఊరి జనంతో కలిసి వెళ్తాడు. ఆమె రాధేయ తల్లి బంగారమ్మగా జనం గుర్తుపడతారు. అమ్మా... అమ్మా... అని ఆప్యాయంగా పిలుస్తూ కన్నీరు మున్నీరవుతాడు రాధేయ. ఆమె కళ్లు తెరుచుకుని రాధేయను చూస్తూ ఊపిరి వదిలేస్తుంది. ఇదే బహుళ నవల కథా సారాంశం.


ఈ నవల్లో ఉత్తరాంధ్ర ప్రజల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు గోచరిస్తాయి. వీటితోపాటు పలు మూఢనమ్మకాలు, దురాచారాలు కూడా చూస్తాం. ఇక్కడ పుట్టిన ప్రజల అమాయకత్వం, మొరటుతనం రెండూ ఒకదానికొకటి పోటీ పడతాయి. సిక్కోలు యాసలో పలికే పలుకుబడులు నవలకు మరింత శోభను తెస్తాయి. ఈ నేలపై అనాదిగా సాగిన ఉద్యమ నేపథ్యాన్ని అడుగడుగున చూస్తాం. జమీందార్లు, తెల్ల దొరలు బహుజనులపై జరిపే దౌర్జన్యాలు, దాష్టీకాలు కథలో కనబడతాయి. శిస్తు వసూలులో భాగంగా మొఖాసాదార్లు, ఈనాందార్లు రైతులపై పడి పీక్కుతినే సందర్భాలు గోచరిస్తాయి. కరువు కాటకాలతో అల్లాడుతున్న రైతులు ఇటు శిస్తులు కట్టలేక, అటు పస్తులుండి జీవనాన్ని సాగిస్తుంటారు. తమ ఆకలి బాధలను తీర్చే నాథుడిగా, జమీల మీద తిరుగుబాటు ఎక్కుపెట్టిన నాయకుడిగా పెదరాయుడును ప్రజలు ఆదరిస్తారు. కొన్నాళ్ళు జైల్లో కూడా ఉంటాడు. మిరాశీని చంపి అజ్ఞాతంలోకి వెళ్తాడు. పాలకొండ జమీలకు వ్యతిరేకంగా సాగిన రైతు పోరాటంలో పాల్గొంటాడు. జమీలు, తెల్లదొరలు పెద నారాయుడు ఆచూకీ కనిపెడతారు. ఒకరోజు పెదనారాయుడు శవమై తోటలో చెట్టుకి వేళాడతాడు. అది చూసిన జనం బోరున విలపిస్తారు. అక్కడ నుంచి పెదనారాయుడి పేరిట ఆ ఊరిలో ఉత్సవాలు ప్రతియేటా ఘనంగా నిర్వహిస్తుంటారు. పెద నారాయుడి కథను జానపదులు తమ కళారూపాల్లో వీరగాథగా చెబుతుంటారు. పెదరాయుడు మనవుడు కనకంనాయుడు పార్లమెంటరీ రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తాడు. నారాయుడు తన మిత్రుల సహాయంతో కనకం నాయుడును సర్పంచ్‌ను చేస్తాడు. కానీ కనకం నాయుడు నేటి కుటిల రాజకీయాలకు విసిగిపోయి, చివరకు వామపక్ష భావజాలం వైపు మళ్ళుతాడు. భూస్వాములపై తిరుగుబాటు బావుటా ఎగురవేస్తాడు. బలరాం వల్ల రాధేయ కమ్యూనిజం వైపు ఆకర్షితుడై, ఉద్యమానికి తన వంతుగా సహాయ సహకారాలను అందిస్తాడు. ఈ సందర్భంలో జైలుకు వెళ్లడం కూడా జరుగుతుంది. బలరాంతో పనిచేసిన మూర్తి మాటల్లో అజ్ఞాత ఉద్యమం దుష్ఫలితాలను రచయిత బయటపెడతాడు. ఉద్యమంపై రాజ్యం ఉక్కుపాదం మోపి అణచి వేయడం దగ్గరగా చూసిన వ్యక్తిగా మూర్తిని కవి చిత్రీకరిస్తాడు. మూర్తి ఉద్యమ వైరాగ్యం పొంది సాధారణ వ్యాపారస్తుడిగా మారతాడు. ఉద్యమాల ద్వారా మనం ఏం సాధించాం? వ్యక్తిగత జీవితాలు పోగొట్టుకున్నాం కదా! అని మూర్తి పాత్ర ద్వారా వివరిస్తాడు రచయిత. చివరకు సత్యకాం పెట్టిన బహుజనోద్యమ సభలో రాధేయ పాల్గని, ఉద్యమ అవసరాలను వివరిస్తాడు. ఈ నవల్లో ఈ సభే హైలెట్‌గా నిలుస్తుంది. ఈ సభ ద్వారా జనం, ఎలాంటి పోరాటాలు ఇకముందు చేయాలో తెలుసుకుంటారు.

గ్రామీణ జానపద కళారూపాలు, వాటిని ప్రదర్శించే కళాకారులు, అవి ఉద్యమానికి ఎలా పనికొచ్చాయో చెప్పే పలు పిట్ట కథలు ఈ నవల్లో నిండుగా ఉంటాయి. అగ్రవర్ణ ఆధిపత్య భావజాలం గలవారు తమ కింది వర్గాలపై చెలాయించిన అధికారం, వాటిపై అణగారిన వర్గాల తిరుగుబాటు ఉద్యమాలు ప్రస్ఫుటంగా నవల్లో కనబడతాయి. పెదనారాయుడు, గుంపస్వామి, రామస్వామి, నారాయుడు, కనకం నాయుడు, జానేషు, బంగారమ్మ, చిట్టెమ్మ, అన్నపూర్ణ, వరహాలమ్మ, రుక్మిణమ్మ, బలరాం, మూర్తి, రాధేయ, సంధ్య మొదలగు పాత్రలను రచయిత అద్భుతంగా మలిచాడు. తద్వారా నవలకు ఉత్కృష్ట స్థానాన్ని కట్టబెట్టాడు. "ఈ నవల వందేళ్ల ఉత్తరాంధ్ర స్థల పురాణం. సచేతన స్థల పురాణం. ఇది ఒక చరిత్ర. ఇది ఒక మైత్. తోడుకునే శక్తి ఉండాలేగానీ, ఎండిపోని జీవన సత్యాల చెలిమ" అని అభివర్ణించిన ప్రముఖ కవి శివారెడ్డి గారి మాటలను ఉటంకిస్తూ సమీక్షను ముగిద్దాం. ■

## కొక్కెం తిరగబడింది!

మొత్తం మసగ్గా ఉంది
లిప్త కాలంలో వేయి మెరుపులు మెరిసిన చప్పుడు
కాలం నీళ్లపై కదులుతున్నట్లు అనెండింగ్ ప్రాసెస్

గుండెను గమనిస్తూ ఎక్స్ రే చూపులు
బట్టలున్న బతుకు బిత్తల కనిపిస్తోంది
గొంగట్లో తినే బువ్వ వెంట్రుకలేరుకుంటోంది



అద్దం అస్పష్టంగా ఉంది
ఆలోచనలు కాలుతున్న చిటపటలు
సంస్కారాల ఆర్తనాదాలు

సిరాలన్నీ సమ్మెలో ఉన్నాయి
ముసుగేసి ముద్దులు పెడుతుంటే
లోపల బూచోడు ఒకటే వేధిస్తున్నాడు

నాతో మొదలు కాని తప్పుల చిట్టా
సిగ్గూ ఎగ్గూ లేని నిజాల కుప్పలు
అద్దానికి అడ్డంగా పంచపాండవులూ మంచం కోళ్ళు

నాన్చుడు మూలుగులు, నవ్వుల తూకాలు
అంతే తెలియని కృష్ణబిలాలు
అద్దంలో చూస్తే ఉక్కిరిబిక్కిరిగా ఉంది

సెల్ఫ్ సర్వేలో తప్పని ఓటమి
ఆట మిడిల్ డ్రాప్ అవుతుందా?
అద్దం అడ్డంగా తలూపుతోంది

కొక్కెం తిరగబడి నిలబడింది
గోచీ కూడా లాగేసింది, బేషరమ్
అద్దం స్పష్టంగా ఉంది!

- డాక్టర్ పళని
99123 43804



## ఊపిరి చెట్టు

మట్టి విత్తుకు ప్రాణం పోసింది
చెట్టు మబ్బు చాటున దాగున్న
చినుకులను రప్పించి
భూమికి ఆకుపచ్చని ఊపిరి పోస్తుంది
పచ్చని చెట్టు పులకిస్తే
కొండాకోనలు వాగులు వంకలు
చెరువులు స్వేచ్ఛ ఉసురు పోసుకొని
పొంగిపొర్లుతూ
సంగీత ధ్వనులతో పరవశిస్తాయి!

తరువులు ఊపిరి వరాలిస్తేనే..
పిట్టల గూడు పదిలంగుండేది
జంతువుల ఆవాసం చల్లగుండేది
మనుషుల ఇళ్లకు రక్షణ ఉండేది

మట్టి పరిమళం విచ్చుకుంటేనే
చెట్టు తాత్వికతను నేర్పి
జీవిత మనుగడను సాక్షాత్కరిస్తుంది

కాలుష్యపు కోరల్లో చిక్కుకున్న
వసుధను కాపాడే పనిలో..
నిబద్ధతతో అందరం నిమగ్నమవ్వాలి..
విజ్ఞతతో విధిగా మొక్కలు నాటాలి..!

- కొలిపాక శ్రీనివాస్
98665 14972




# మానవత్వం పరిమళించే మౌని కథలు

- డాక్టర్ పి.సి. వెంకటేశ్వర్లు

**సి**నారె, ఆరుద్ర వంటి ఉద్దండులైన తెలుగు సాహిత్య కర్తల చేత 'శభాష్' అనిపించుకున్న త్యాగదుర్గం మునిస్వామి వృత్తిరీత్యా తితిదేలో ఉద్యోగి. 'మౌని' అనే కలం పేరుతో ఎన్నో రచనలు చేశారు. ఏడు పదుల వయసులో ఇప్పుడూ రాస్తున్నారు. వివిధ పత్రికల్లో అచ్చయిన 41 కథల్ని 'కొత్తపొద్దు' పేరుతో పుస్తకరూపంలో తెచ్చారు. తాను చూసిన సమాజంలోని సంఘటనల్ని నలుగురికి చెప్పాలనే ఆత్రుత ఆయనిది. సింగమనేని నారాయణ జీవితం తెలిసిన కథకుడిగా, జీవితానుభవం పండిన కథకుడిగా డా౹౹మౌనిని అభినందించారు. 'సంఘ జీవితంలో మానవీయ సంబంధాలను మహోన్నతంగా ప్రశ్నించడమే గాకుండా సాహిత్యం యొక్క పరమార్థం. సామాజిక, సామూహిక శ్రేయస్సు అని తన కథల ద్వారా నిరూపించిన కథకుడు' అని మెచ్చుకున్నారు.

మనిషిని, మానవత్వాన్ని కేంద్రబిందువుగా చేసుకున్న ఏ రచనైనా సమాజంలో నాలుగు కాలాలపాటు జీవిస్తుంది. గ్రామీణ జీవితాల్ని చిత్రించే కథల్లో, కుటుంబ సంబంధాల్ని పటిష్టపరిచే ఇతివృత్తాల్లో, ప్రపంచీకరణ చెడుప్రభావాన్ని చూపించే వస్తువుల్లో, ప్రేమ సన్నివేశాల్ని రూపుకట్టించే సందర్భంలో మానవీయతలోని పొరల్ని మనకు స్పష్టంగా చూపిస్తాడు మౌని. సన్నపురెడ్డి వెంకటరామి రెడ్డి 'సర్వసాక్షిగా ఉండి సంఘటనల్ని కథలుగా మలచి చేతులు దులుపుకునే రకం కాదు మౌని గారు. సమస్య మూలాల్లోకి వెళ్ళిపోతారు' అని అనడంలో ఆ మూలబిందువు మానవత్వం అని అర్థం చేసుకుంటే కథల తత్త్వం అర్థమైపోతుంది.

మౌని తొలి కథలు చిత్తూరు జిల్లాలోని పాకాల, దామల చెరువు, తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లోని పల్లెవాసుల సహజత్వాన్ని వివరిస్తాయి. తర్వాతి కథలు పల్లెల్లో వస్తున్న మార్పులపై అవగాహన కలిగిస్తాయి. ఇటీవలి కాలంలో వచ్చిన కథలు గ్రామాలు, పట్టణాలపై పరుగులు తీస్తున్న తీరును చూపిస్తాయి. అంటే మౌని రాసిన గ్రామీణ సంబంధ కథల్లో మనిషి గమనంలో మార్పును కథల గ్రాఫ్ ద్వారా చూపిస్తాయి. ఎర్రమట్టి ఇటుకల ఇల్లు, అకారణం, చీకటిముల్లు, బోరుబండ, చిట్లాకువ్వ, కొలిమి, రెక్క తొడిగిన హృదయం, ఎలుగెత్తిన కృతజ్ఞత, కొత్తపొద్దు వంటి కథల్లో గ్రామీణ నేపథ్యం వస్తువు. పేద, మధ్య తరగతి మనుషుల హృదయాలు ఈ కథల్లో కనిపిస్తాయి. పల్లెలో స్త్రీ పక్షాన నిలబడి రచయిత న్యాయం చెప్తాడు. పల్లెల్లో వృత్తికారుల మనస్సులు, పెత్తందారుల పరుషపు మాటలతో ఎలా గాయపడుతున్నామో వివరించే ప్రయత్నం చేస్తాడు. కరుణకుమార, గోపీచంద్ కథల్లో కనిపించే గ్రామాలు, మనుషుల మనస్తత్వాలు ఈయన కథల్లో కూడా కన్పిస్తుంటాయి.

'బోరుబండ' కథ కె.సభా రాసిన 'పాతాళ గంగ'కు కొన సాగింపుగా కనిపించినా, మౌని కథనం ప్రత్యేకంగా సాగుతుంది. చిత్తూరు జిల్లాలో రైతు నీటికోసం బోరుబావుల, జూదం ఆడుతున్న తీరును వివరించిన కథ ఇది. రెండెకరాల పొలాన్నే నమ్ముకున్న సన్నకారు రైతు రాజన్న, చాలీచాలని నీటితో సేద్యం చెయ్యలేక, పొలాన్ని అమ్మలేక పడుతున్న ఆందోళనాత్మక మనసును చూపిస్తుంది. నీటికోసం అరవై వేలు అప్పు చేసి వేయించిన బోరు, బండ అడ్డం పడిందని ఆగిపోయినపుడు, ఆ రైతు గుండె పగిలి నేలపై కుప్ప కూలిన సన్నివేశం మనసున్న ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది. 'ఎర్రమట్టి ఇటుకల ఇల్లు' కథలో వెంకటముని వర్షానికి కారుతున్న పూరిల్లు బదులు కొత్త ఇల్లు కట్టుకోవా లనుకుంటాడు. తనపొలంలోని ఎర్రమట్టిపై ఊరి కామందు కన్ను పడిందని గ్రహించలేక దాన్ని అమ్మేది లేదని తేల్చి చెబుతాడు. పొలంలో మట్టితో ఇటుకలు కోయించి, చెట్లకలపతో ఇల్లు కట్టుకోవడానికి సిద్ధమౌతాడు. ప్రమాదవశాత్తు బావిలో పడి అనారోగ్యం పాలవ్వడం వల్ల, వైద్యంకోసం చేసిన అప్పు తీర్చడానికి ఆ కామందుకు ఇటుకలు, కలప అమ్మాల్సి వస్తుంది. అయితే, సగటుమనిషి ఇల్లు కట్టుకోవడం కలగానే మిగిలిపోవడం, ప్రాణం మిగిలింది చాలు అని తృప్తిపడటం, బడుగుజీవుల

మనస్తత్వాన్ని ప్రతిఫలిస్తుంది. ఊరి మనిషి ఆపదల్లో, అప్పుల్లో ఉన్నాడని తెలిసి మానవత్వాన్ని మట్టిలో కలిపేసి, ఎదుటివారిని వీలైనంతమేర దోచుకుందామనే బూర్జువా వర్గపు ఆలోచనల్ని కామందు అమానవీయ పాత్ర ద్వారా చూపించాడు మౌని.

రూపం, సంపద, చదువు, తెలివివంటి వాటిలో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తికీ ఒక మనసుంటుంది. తోటి మనిషిని తనలాంటి వాడే అని గుర్తించలేనివాడు నిజమైన దివ్యాంగుడు. 'అకారణం' కథలో దొరస్వామి సన్నని రూపంవల్ల ఇంట్లో, బయటా అవహేళనకు గురవుతాడు. తనకు తానే ఆత్మన్యూనతకు గురికావడానికి కారణం తన చుట్టూవున్న మనుషుల ప్రవర్తనే. తల్లిదండ్రుల్ని పోగొట్టుకోవడం, తోటి విద్యార్థుల ఎగతాళి భరించలేక చదువు మానేయడం, అన్నలు అసమర్థుడిగా ముద్రవేసి పెళ్ళి చేయకపోవడం, చివరికి అతణ్ణి ఆత్మహత్య చేసుకునేలా చేశాయి. తనని మనిషిగా గుర్తించని సమాజాన్ని చీదరించుకున్న దొరస్వామి, తన చావు ద్వారా లోకానికి బుద్ధి చెప్పనున్నాడనేది రచయిత వ్యాఖ్య. ఈ కథలో తమకు తాము మనిషితనాన్ని చంపేసుకున్నవారు, మానవత్వంగల మనుషుల చావుకు ఎలా కారణమవుతున్నారో చూపించాడు మౌని. అదే విధంగా 'చీకటిముల్లు' కథలో గ్రామాల్లోని కట్టుబాట్లు స్త్రీల విషయంలో ఎంత దారుణంగా, మానవత్వం లేకుండా ఉన్నాయో వివరించాడు. సీతమ్మ భర్తను నమ్ముకొని వేరే ప్రాంతం నుంచి సంజీవరాయ పట్టెడ గ్రామానికి వస్తుంది. ఆమెను ఒంటరిగా వదిలేసిన తాగుబోతు భర్త, వేరే ఆడమనిషితో వెళ్ళిపోయినా ధైర్యంగా పనిబాటలు చేసుకుంటూ బతకడం నేర్చుకుంటుంది. తప్పని పరిస్థితుల్లో ఒక ఇంటి యజమానితో కలిసి జీవిస్తుంది. ఆ సహజీవనాన్ని ఊరిపెద్దలు ఒప్పుకోరు. వారిని ఊరినుంచి వెలివేయాల్సి వచ్చినపుడు స్త్రీ (సీతమ్మ) పై చర్య తీసుకోవడం మానవీయత లోపించిన ఘటనగా రచయిత నిర్ధారించాడు. ఒంటరిదాన్ని చేసిన భర్తకు, తనను లోబరుచుకున్న యజమానికి ఎలాంటి శిక్ష వేయని గ్రామం, స్త్రీకి మాత్రం ఎందుకు శిక్ష వేస్తుందని రచయిత సంధించిన ప్రశ్న. చివరికి ఆ ఇంటికోసం ఎంతో శ్రమించిన సీతమ్మ ఊరికి దూరంగా బతకడం, అక్కడే ప్రాణం విడవడం, యజమాని సమాధి పక్కన సమాధి కావడం తప్ప ఇంకేమీ పొందలేకపోతుంది. చనిపోయాక సమాధి విషయంలో ఉదాసీనత చూపిన ఊరు, బతికున్నప్పుడు మానవత్వంతో ప్రవర్తించి ఉంటే ఆమె జీవితం ఆనందంగా ఉండేది కదా! అనే సందేశాన్ని అందించాడు రచయిత.

మనిషి జీవితంలోని పొరల్ని, వృత్తికారుల బతుకుల్లోని వ్యథల్ని మౌని దగ్గరగా చూశాడు. తన చుట్టూ ఉన్న వివిధ శ్రామిక కులాల వాళ్ళు పిడికెడు స్వేచ్ఛకోసం పడుతున్న ఆరాటాన్ని గమనించాడు. వృత్తిపనులు చేసి, గ్రామ ప్రజలకు సహాయం చేసే తమను కూడా మనుషులుగా చూడమని మూగగా రోదించే మనుషుల్ని చూశాడు. వాటిని కథలుగా మలిచాడు. అయితే, ఈ కథల్లో ఎదురుతిరిగి ప్రశ్నించే పాత్రలు కనిపించవు. నచ్చని పని నుంచి మౌనంగా వైదొలగి ఆ సమాజాన్ని ఈసడింపుతో తామే వెలివేసి, తాము ఎంచుకున్న ప్రత్యామ్నాయ మార్గంవైపు పయనం సాగించే బడుగులు కనిపిస్తారు. 'చిట్లాకువ్వ' కథలో గిరిజన తాండాల్లోని సుగాలీల ధన, మానాలపై ఆధిపత్యం చెలాయించే బూర్జువా పతనం కథా వస్తువు. పెళ్ళికి ముందు రోజు చాందినీని గ్రామపెద్ద కొడుకు మత్తుమందు చల్లి తీసుకుపోవడం, అది తెలిసి కూడా ఊరిపెద్ద బెదిరించడం, అందరికీ ఏమి జరిగిందో తెలిసినా, ప్రశ్నించే ధైర్యంలేక మౌనంగా ఉండిపోవడం, తర్వాత పట్టణంలో గ్రామపెద్ద కొడుకు లాడ్జిపై నుండి పడి మరణించడం వంటి సన్నివేశాలతో కథ సాగుతుంది. చాందినిపై అత్యాచారం చేసిన వ్యక్తి మదాన్ని అణచి, ఆమెను గౌరవంగా పెళ్ళి చేసుకున్న లక్ష్మణా నాయక్‌లోని ఉన్నత మానవీయ విలువల్ని ఆవిష్కరించాడు మౌని. 'చిట్లాకువ్వ' వెలుగు దుర్మార్గుని అంతానికి సూచకంగా కాకుండా, లక్ష్మా నాయక్ ఆదర్శాలకు సంకేతకంగా చెప్పివుంటే బాగుండేది.

'రెక్క తొడిగిన హృదయం' తమకింద పనిచేసే పనివాళ్ళను మనుషులుగా చూడని బూర్జువా మనస్తత్వం గల వ్యక్తి తత్వాన్ని వివరించే కథ. రాయుడు తన కూతురు పెళ్ళికోసం ముందే నిర్ణయించుకున్న దళిత గోవిందు కూతురు పెళ్ళిని వాయిదా వేయించేంత అహంకారి. చివరకు తన కూతురు దళిత యువకుణ్ణి పెళ్ళి చేసుకుందని తెలిసి రాయుడు కుప్ప కూలడంతో రచయిత నుంచి సందేశాన్నిచ్చాడు. దుర్మార్గం, తోటివారిని మనుషులుగా గుర్తించకపోవడం వంటి అవలక్షణాలు మనిషిని పతనం చేస్తాయనే తత్వాన్ని తెలిపాడు. అలాగే, 'కొలిమి' కథలో కూడా ఊర్లో నిజాయితీగా కమ్మరి పనిచేసే పెద్దన్నను రైల్వే ఇనుముతో వస్తువులు చేయడానికి పురమాయించిన గ్రామపెద్ద రాజశేఖరం, చివరికి పోలీసు కేసు కావడంతో దొంగతనం నేరం వృత్తికారుడిపైకి నెట్టేసి, తాను తప్పుకోవడం వ్యక్తి స్వార్థానికి నిలువెత్తు నిదర్శనం. కఠినమైన ఇనుమును అతి చాకచక్యంగా వంచగలిగాడేగానీ, కరుడుగట్టిన ఊరిపెద్దల దుర్మార్గపు ఆలోచనలనే కొలిమి మంటల నుంచి తప్పించుకోలేకపోయాడు పెద్దన్న. వృత్తికారుడి చేత తప్పు చేయించి అది బయటపడుతుందనే కుట్రతో పెద్దన్నకు బెయిల్ రాకుండా చేసిన ఊరిపెద్ద ఒకవైపు, కొన్నేళ్ళుగా తనచేత రకరకాల పనిముట్లు చేయించుకొని కష్టసమయంలో మౌనంగా ఉండిపోయిన ఊరిజనం ఇంకోవైపు, అతని మనసును పిండేశాయి. అందుకే జైలు నుంచి వచ్చాక కొలిమి వృత్తిని వదిలేసి పట్టణంలో ఏదోఒక పని చేసుకోవడానికి పయనమైనాడని ముగింపునిచ్చాడు రచయిత.

పల్లెల్లో పెత్తందార్ల ఆధిపత్యాలతో సర్దుకుపోలేక పట్టణాలకు వలస వెళ్ళిన వృత్తికారుల మనసును అద్దంలో చూపే కథ

'ఎలుగెత్తిన కృతజ్ఞత'. చిత్తూరు జిల్లాలో డప్పులు, టపాసులు లేనిదే పేదింట్లో కూడా శవయాత్ర జరగదు. ఒక గ్రామంలో దళితులంతా కలసి గ్రామపెద్దల అరాచకాలకు చరమగీతం పాడ టానికి చావు సమయంలో డప్పు మోగించడం ఆపేస్తారు. తమ వృత్తుల్ని తామే నిషేధించుకునే పరిస్థితులు గ్రామాల్లోని రాజ కీయాలు నిర్దేశిస్తున్నాయని చెప్పడం రచయిత ఉద్దేశం.

తమ మనసుకు తగిలిన గాయాన్ని ఊరిపెద్దలు మాన్పే ప్రయత్నం చేసి ఉంటే, సహృదయతతో తమ వృత్తి ఆచారాన్ని కొనసాగించి ఉండేవారని మౌని నర్మగర్భంగా సూచించాడు. అదే ఊరిలో ఉంటూ పేద, దళిత వర్గాలకు స్థలాలు ఇచ్చి, ఇళ్ళు కట్టించిన ఒకనాటి గ్రామపెద్ద మరణించినప్పుడు, ఊరు విడిచి వెళ్ళిన దళితులంతా ఏకమై వచ్చి డప్పులు కొట్టడం ఈ కథలో ముగింపు.

'కొత్తపొద్దు' కథ గ్రామంలోని మంగలి, మేదరి, కుమ్మరి మొదలైనవారు తమ అస్థిత్వాన్ని కోల్పోయి ఆర్థికంగా, సాంఘి కంగా నలిగిపోతున్న సంఘటనలకు నిరసనగా ఊరు విడచి వెళ్ళిపోవడం కనిపిస్తుంది. ఒకప్పుడు గ్రామంలోని వృత్తికారు లంతా కామందుల ఇళ్ళలో వృత్తిపనులు నిర్వర్తిస్తూ, సంవత్స రానికి ఒకసారి ఇచ్చే 'మేర'పైన జీవించేవారు. వారి కుటుంబాల్లో అనుకోని ఖర్చుపడినప్పుడు వడ్డీకి అప్పు తెచ్చుకునేవారు. అది తీర్చడానికి వేరే సంపాదన ఉండేదికాదు. ఇలా రోజురోజుకీ వృత్తికారుల కుటుంబాలు దరిద్రంలోకి, భూస్వాముల కుటుం బాలు సంపదలోకి వెళ్ళిపోతున్న తీరును రచయిత ఈ కథలో చాలా జాగ్రత్తగా చూపించాడు. మార్క్స్ చెప్పిన కొందరి శ్రమ విలువ భూస్వాములకు సంపద మిగులుగా మారిపోయిందనే వాస్తవాన్ని ఈ కథలో ప్రతిపాదించాడు. చివరకు ఊరిపెద్దలు గ్రామంలో జాతర చేయాలని చెప్పినప్పుడు అప్పటికే పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన గ్రామంలోని వృత్తికారులు జాతరకు సహకరించక, తాము బతుకుతెరువు కోసం పట్టణాలకు వెళ్ళిపోతున్నామని తేల్చి చెబుతారు. ఊరిపెద్దలకు తీర్చాల్సిన అప్పులు సంవత్సరం గడువుతో తీరుస్తామని హామీ పత్రాన్ని, కలెక్టర్ ద్వారా అందించి తమ జీవితాల్లోకి 'కొత్తపొద్దు'ను ఆహ్వానించారని సరికొత్త ముగింపునిచ్చాడు రచయిత.

మౌని చెప్పిన వృత్తి సంబంధ జీవిత ఇతివృత్తాల్లో గ్రామాల్లో భూస్వామ్య వర్గాల అణచివేత ధోరణులు అడుగడుగునా కనిపిస్తాయి. అయితే, అలాంటి కామందుల తత్వాన్ని ప్రశ్నించాలనే ఆలోచన కూడా మౌని సృష్టించిన పాత్రలు చేయవు. తమ పని తాము చేసుకుంటూ అందులో అవరోధాలు ఏర్పడినపుడు మెల్లగా ఆ పని నుంచి విరమించుకొని, పరోక్ష నిరసనను వ్యక్తం చేయడం కనిపిస్తుంది. ప్రతి వృత్తికారుడి పాత్రలోని మనిషితనాన్ని, మానవత్వం గుబాళిస్తున్న తీరును చూపిస్తూ, అదే ఎప్పటికైనా గెలుస్తుందని నిర్ధారిస్తూ ముగింపునిస్తాడు.

మనిషి నిత్యజీవితంలో దయాగుణంతో, సేవానిరతితో, మానవత్వంతో జీవించాలనేది మౌని తపన. దైవం, 'మానుష్య రూపేణ' కథ గురు శిష్య సంబంధాలను ముఖ్యంగా మాన వీయతను వ్యాఖ్యానించిన కథ. మధురాంతకం రాజారాం రాసిన 'తాను వెలిగించిన దీపాలు' కథలాగా అనిపించినా, మధ్యలో మరో విధంగా నడుస్తుంది. రాతిని శిల్పంలా మలిచే కళాకారుడి వంటివాడే విద్య నేర్పే గురువని మౌని నమ్ముతాడు. చిన్నతనంలో బడికి రాకుండా అల్లరి చిల్లరగా తిరిగే రజకుడైన రామకృష్ణను నారాయణ శర్మ సామదానదండోపాయాల ద్వారా విద్యావంతుణ్ణి చేయడం, ఆ తర్వాత ఆ మాష్టారు బదిలీపై వెళ్ళిపోవడం, రామకృష్ణ గొప్ప గుండె వైద్యుడిగా తయారుకావడం, ఒకరోజు తానుంటున్న ఆసుపత్రికి వచ్చిన గురువును చూసి ఆశ్చర్యపడటం, గురువు చేసిన సహాయం వల్లనే తాను ఎదిగాడు కాబట్టి కృతజ్ఞతను మరచిపోకుండా గురువును సంపూర్ణ ఆరోగ్యవంతునిగా తయారుచేయడం ఈ కథలో ఇతివృత్తం.

'సొంతలాభం కొంత మానుకో, పొరుగువాడికి తోడు పడవోయ్' అంటాడు గురజాడ. మౌని రాసిన 'జర్నీ' కథలో దశరథరామయ్య తన దగ్గరున్న మంచినీళ్లను పసిబిడ్డకు ఇచ్చి ఆదుకొని తన ప్రాణాలను పోగొట్టుకుంటాడు. శ్రీశైలంలో బస్సులో వెళుతూ ముందు సీటులో ఉన్న పసిబిడ్డ నీళ్లు లేక గుక్కపట్టి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోతున్న సందర్భంలో, బస్సులో ఎవరి దగ్గర నీళ్లు లేకపోవడంతో తన దగ్గరున్న కొద్దిపాటి నీళ్లను ఆ పసిబిడ్డకు అందిస్తాడు. తెల్లవారు జామున అనుకోకుండా ఆయనకు గుండెనొప్పి వచ్చినప్పుడు మాత్ర నోట్లో వేసుకొని నీళు లేకపోవడంతో, అది లోపలికి దిగక అలాగే ప్రాణాలు కోల్పోతాడు. హృదయాన్ని కదలించే ఇలాంటి సన్నివేశాలు ఈ కథల్లో చాలా చోట్ల కనిపిస్తాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి డబ్బుకు విలువిచ్చి మానవత్వాన్ని ఎలా నాశనం చేసుకుంటున్నాడో 'చిగురించిన మోడు', 'గుండె తడి'. 'నేల విడిచిన సాము', 'నిర్ణయం', 'మట్టి మనసు' వంటి కథల ద్వారా రూపు కట్టించాడు. విద్యా బోధన చేసి, నైతిక విలువలు నిరూపించాల్సిన గురువులు కొందరు ప్రపంచీకరణలో చిక్కుకుపోతున్న వాస్తవాన్ని 'చిగురించిన మోడు' కథ ద్వారా వివరించాడు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వెంకటరమణ పట్టణంలో ఉంటూ రియల్ ఎస్టేట్‌లో, షేర్లలో డబ్బులు పెట్టి అప్పుల పాలైపోతాడు. చివరకు ఉ ద్యోగంపోయే పరిస్థితి రావడంతో వారసత్వంగా వస్తున్న రెండెకరాల పొలాన్ని తండ్రిచేత అమ్మించి సమస్యల నుంచి బయటపడతాడు. కొంతమంది తమ వృత్తి ధర్మాన్ని సరిగా నిర్వర్తించకుండా, అత్యాశతో వ్యాపారాలు చేసి చేతులు కాల్చు కుంటున్న యదార్థ సంఘటనలను రచయిత కళ్ల ముందుంచాడు.

'గుండెతడి' కథ కుటుంబ జీవితంలో ప్రపంచీకరణ

చూపిస్తున్న మానవీయత విధ్వంసాన్ని కళ్లముందుంచుతుంది. రామినాయుడు, రత్తమ్మ దంపతులు ఇద్దరు కొడుకుల్ని రెక్కలు ముక్కలు చేసుకొని చదివిస్తారు. ఉద్యోగాలు వచ్చిన కొడుకులు పట్టణంలో స్థిరపడిపోతారు. తల్లిదండ్రులకు డబ్బులు పంపడం రుణం తీర్చుకున్నట్లుగా భావిస్తుంటారు. కొంత కాలంగా అనారోగ్యంతో నలిగిపోతున్న భర్తను చూడలేక పట్నం వెళ్లి కొడుకులకు విషయం చెప్పిన రత్తమ్మకు, వారి సమాధానంతో తల తిరిగిపోతుంది. ప్రపంచీకరణ కబంధహస్తాల్లో పడి మధ్యతరగతి కుటుంబాలు ఎలా గిలగిలా కొట్టుకుంటున్నాయో మౌని ఈ కథలో చూపించాడు. ఇలాంటిదే 'నిర్ణయం' కథ కూడా. ఎందరో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దిన రాఘవయ్య మాష్టారు మరణించినప్పుడు, ఆయన కొడుకు అంత్యక్రియలకు రాకపోవడం ప్రపంచీకరణ దుష్ప్రభావ ఫలితమేనని వ్యాఖ్యానిస్తాడు. 'మట్టి మనసు' కథ ప్రపంచీకరణ పల్లెల్ని, పల్లెవాసుల్ని పరోక్షంగా ఎలాంటి మానసిక క్షోభకు గురిచేస్తుందో వివరిస్తుంది.

గడ్డ పెరుగు, అతడు-ఆమె, చెన్నపట్నం కదంబపూల పరిమళం, నిజానికి నమ్మకానికి మధ్య, సుమిత్ర, లోవెలుగు, బతుకు ముంగిట్లో భాగ్యాలపంట కథలు కుటుంబ సంబంధాలను వివరిస్తాయి. ఈ కథల్లో మానవ సంబంధాల్ని వివరించేటప్పుడు ప్రాంతీయమైన సామెతలను కలిపి సహజత్వాన్ని తీసుకొస్తాడు రచయిత. ఎన్నో తాత్విక వాక్యాలు మనల్ని ఆలోచింపజేస్తాయి. మౌని కథలన్నింటిలో స్త్రీకి అపారమైన విలువను, ప్రాధాన్యతను ఇచ్చాడు. "ఈ దేశంలో ప్రతి ఆడమనిషికి మొగుడంటే అమాయకుడని, తను లేకపోతే ఒకక్షణం కూడా బతకలేదని వెర్రి నమ్మకం. అందుకే అదృష్టం పట్టిన ఈ మగజాతి ఆడజాతిని అప్పటికీ ఇప్పటికీ ఇలా ఏమార్చి ఆడుకుంటూనే ఉంది" (గడ్డ పెరుగు). "మామూలుగా మొగుడు అనేవాడు ఒక వింతప్రాణి తాను మొగుడు కావడం వల్లనే భార్యమీద, ఆమె మనస్సుమీద అధికారం ఉందని భావిస్తాడు" (అతడు-ఆమె). ఇలాంటి వంటి వాక్యాలు మౌని కథల్లో కనిపిస్తాయి. మౌని కథలు శిల్పవిన్యాసాలు లేకుండా సూటిగా పాఠకుడిని ముందుకు తీసుకెళతాయని డా॥మధురాంతకం నరేంద్ర అన్నప్పటికీ, కొన్ని కథల్లో అద్భుతమైన శిల్పనిర్మాణం కనిపిస్తుంది. నిషేధించబడ్డ 'హరిజన' పదాన్ని ఒకటిరెండు కథల్లో రచయిత ఉపయోగించాడు. ముద్రించేటప్పుడు దాన్ని దళితపదంగా మార్చి ఉంటే బాగుండేది. కొన్ని కథల్లో కర్మ సిద్ధాంతపు ముగింపులు, మరికొన్ని కథల్లో అభ్యుదయ ఆలోచనలు గల మలుపులు ఉన్నాయి. అయినా మార్పును కోరుకునే సంఘర్షణ ఈ కథల నిండా కనిపిస్తుంది. ■



# చెట్టు

**అ**డగనిదే అమ్మైనా పెట్టదు
అడక్కుండానే అన్నీ పెడుతున్న
ఆత్మ బంధువు చెట్టు
ప్రాణ వాయువును పంచి పెట్టి...
బతుకునిస్తుంది
ఆకలి తీర్చి... ఆరోగ్యం పెంచుతుంది
పరుచుకున్న పచ్చదనంతో
ఎండకు గొడుగు పడుతుంది
వానకు ఆయువు పోస్తుంది
పంటలు పండిస్తుంది
సంపద సృష్టిస్తుంది
మనుజుల పాలిట
సిరుల సింగారం చెట్టు
చెట్టును తెగనరికి
కొయ్య బొమ్మగా మార్చి
మక్కువ తీర్చమని
మహిమలు చూపమని
మొక్కులు మొక్కనేల...?

మౌఢ్యం నిండిన దారుల్లో
ఈ తిరోగమన పరుగులేల?
మొక్కను పెంచి చెట్టును సాకి
ప్రకృతి గూటిలో గువ్వలా
ఒదిగిపోతేనే... హాయి!

**- వి.రాజగోపాల్**
**94900 98036**

# నిర్భయ దిశ కోసం ...

- మల్లేశ్వరరావు ఆకుల
94400 07374



**ప**ట్టపగలు నడిరోడ్డుపై
ఒంటరి యువతిపై కత్తితో దాడి చేసి హత్య చేయడం
దుర్మార్గం ఉన్మాదం!
ఆ పిచ్చి వాడి సంగతి సరే
మరి జనాలకు ఏమైంది?
మనమెంత బే-ఫర్వాగా
అసలేమి జరగనట్టు
ఎవరి దారిన వారు పోవటం దేనికి పరాకాష్ట?

అదే షూటింగ్ అయితే వేలంవెర్రిగా మూగిపోతామా?
ఎవరు ఎప్పుడు ఎవరినైనా హత్య చేయవచ్చా?
చట్టమూ పోలీసులూ తర్వాత ...
మహిళా సంఘాలు మానవహక్కులు,
ఘటన జరిగిన తర్వాతే కదా గొంతెత్తగలవు
భద్రత గురించి గొంతు చించుకుంటామే
సాటి మనిషిపై దాడి చేస్తుంటే
నిష్పూచీగా, నిమ్మకు నీరెత్తినట్లు దాటుకు పోవడం
మనిషితనం కాదు.. మానవత్వం ఏమైపోతోంది?

ప్రతిఘటించలేని నిర్వీర్యులను తయారుచేస్తోందా సంఘం?
ఆటవిక, పాశవిక మానసిక స్థితిని పెంచి పోషిస్తోందా?

జనారణ్యం అనే మాట
నేడు మరింత సార్థకం అవుతోందా?
మనుషుల వేట .. మనిషే మృగమై ... !.

చూడటం గాయపడటం అయితే-
ఇది ఎప్పటికి మానుతుంది?
పచ్చి పుండు, మచ్చగానే ఉంటుందా?
అలవాటుగా మారి కన్ను కెమెరాగా
మనిషి మరమనిషిగా
వీధులు నేరస్తులకు నిర్భయారణ్యాలుగా మారిపోతాయా?

కరోనా వీధుల్లోకి రానీయ లేదు
కానీ ఈ కరోడాలు, కరోనా పోయినా
ఆడ మగ తేడా లేక కాటువేస్తూనే ఉంటారా?

వ్యక్తులనే కాదు, వ్యవస్థలోని
అన్ని కారకాలను ప్రశ్నించాల్సిందే!
ప్రక్షాళించాల్సిందే తక్షణం !
లేకుంటే.. 'రక్తోత్సవాలు' జరుపుకోవాల్సిందే!
దేశ పతాకంపై అభాగ్యుల రుధిరం పులమాల్సిందే!!

ఇక వేగంపై కాదు నిఘా, నేర నిఘా కళ్ళను
ప్రతి వీధి స్థంభానికి అతికించాల్సిందే!
ఎన్ కౌంటర్లు, కస్టోడియల్ మరణాల నమోదు
చరిత్ర పుటలకు అతికించుకుంటూ పోవాల్సిందే..! ■



## తెలుగు కథా సాహిత్యం

# వృత్తిదారులపై ప్రపంచీకరణ ప్రభావం

- డాక్టర్ కడియాల వెంకట రమణ
99496 17591

**20**వ శతాబ్దం చివరి భాగంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిణామాల్లో ప్రపంచీకరణ ఒకటి. ప్రపంచదేశాల మధ్య వస్తువులు, సేవలు, మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం, శ్రమ, మానవ మూలధనం మొదలగునవి ఎలాంటి అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా ప్రవహిస్తాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సంఘటితం చేసే ప్రక్రియ. ప్రపంచీకరణ ప్రధాన లక్షణం స్వేచ్ఛామార్కెట్. ఈ స్వేచ్ఛా మార్కెట్ సహజంగానే ఆర్థిక అంతరాలను వేగవంతం చేసింది. ఈ ప్రపంచీకరణ ప్రభావం అన్ని రంగాలపై ప్రభావం చూపింది. అలా ప్రభావం చూపబడిన వాటిలో కులవృత్తులు కూడ ఒకటి. ఈ కులవృత్తులు ప్రపంచీకరణలో భాగంగా అభివృద్ధి పేరిట విధ్వంసం చెందాయి. వృత్తికులాలవారికి ఎలాంటి రక్షణ లేకుండాపోయింది. ప్రాచీన భారతీయ సమాజంలో వృత్తికులాలవారే శాస్త్రజ్ఞులు. వీరు తయారు చేసిన వస్తువులను విదేశాలకు ఎగుమతి చేస్తూ వచ్చారు. ప్రపంచీకరణలో భాగంగా 18వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం కులవృత్తులను కబళించివేయడం మొదలుపెట్టింది. పారిశ్రామిక విప్లవం వల్ల భారతదేశంలో కులవృత్తులు తీవ్రమైన నష్టాలను చవిచూశాయి.

### కుమ్మరి వృత్తిపై ప్రభావం

చస్తేనే కుండ అవసరం అని కొందరంటే మాకు ఆ అవసరం కూడా లేదనేవారు ఉన్నారు ఇప్పుడు. ఈ దేశ చారిత్రక ఆధారాలు మొహంజదారో, హరప్పాలోని కుండ పెంకుల్లో నిక్షిప్తమై ఉన్నాయి. కళాత్మకంగా రూపుదిదిద్దుకున్న మృణ్మయ పాత్రలు మన సంస్క ృతి ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా చేసిన రూపశిల్పి కుమ్మరి. ఇంత ప్రాధాన్యత ఉన్న కుమ్మరుల మట్టి పాత్రలు నేడు మరుగన పడ్డాయి. దీనికి కారణం జర్మన్ సిల్వర్ పాత్రలు. మట్టి పాత్రలతో పోల్చుకుంటే ఇవి పగిలిపోవు. ప్లాస్టిక్ రంగ ప్రవేశంతో ప్రజానీకం క్రమంగా ఆ వైపు మొగ్గు చూపింది. క్రమంగా మట్టి పాత్రలు దూరమయ్యాయి. ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వాళ్ళు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఇటువంటి విషయాలను మానిగంప, చిప్ప, కాగుబొత్త కథలలో కుమ్మరులు వృత్తి కోల్పోయిన విధానాన్ని మనం చూడవచ్చు.

'మానిగంప' కథలో పారిశ్రామిక ఉత్పత్తుల మూలంగా ప్లాస్టిక్ రంగ ప్రవేశం చేసి కుమ్మరుల జీవితం అతలాకుతలమైన స్థితిని రచయిత బాలసుధాకర మౌళి చిత్రించాడు. ఈరన్న రోజంతా నెత్తిమీద మట్టి కుండల్ని పెట్టుకొని అమ్మడానికి వెళ్తే ఒక్క కుండ కూడా అమ్ముడుపోదు. ఈరన్న ఇంటికి వచ్చి భార్యతో 'ఈ కాలంలో మట్టికి, మట్టిని నమ్ముకున్నోనికి విలువెక్కడుందే మనమీద శెని కూకోబట్టిగానీ.. ఆ జగన్నాథం గాడు పిల్లా జెల్లాతో పుట్టినూరిని వదిలేసి పట్నం యెలిపోయినాడు. ఆ పోలయ్య పెళ్ళాన్ని పుట్టింటికి చారెట్టేసి ఆడుదారి ఆడుసూసుకున్నాడు. పట్నం సరుకొచ్చి మనబతుకుల్ని బుగ్గిపాలు సేస్సాయే. మన థ్రెమగాని ఈ కాలంలో మట్టి ముద్దల్ని యెవడుకొంతాడే సెప్పు!"[1] అని అంటాడు. ఈ అంశాన్ని పరిశీలిస్తే కుమ్మరుల వృత్తి జీవితంలో పారిశ్రామిక విప్లవం సృష్టించిన విధ్వంసం,

కుమ్మరులు వృత్తిని కోల్పోవడాన్ని మనం గమనించవచ్చు. పట్నం సరుకు వచ్చిందని చెప్పడంలో ఉద్దేశం ప్లాస్టిక్ రంగప్రవేశం చేసి మట్టి పాత్రల స్థానాన్ని ఆక్రమించింది. దీంతో ఉన్న ఊరిలో పనుల్లేక వలస వెళ్ళి బతకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈరన్న కుండలు అమ్ముడుపోక అలసిపోయి కూర్చుంటే ఆ ఊరి నూకాలమ్మ "ఓరె ఈరన్నా కులవృత్తులు మానేసి కూలికో నాలికో ఎలిపోతే... బతికినన్నాళ్ళూ కడుపుకి గెంజి నీళ్ళకైనా ఓసిపోముగదరా. ఈ కాలంలో వృత్తిని నమ్ముకొని బతుకుని యెలగ బెడాదమంటే నట్టేట్లో మునిగితేరా" అంటుంది. నూకాలమ్మ మాటలను బట్టి చూస్తే కుమ్మరులు వృత్తి చేసుకుంటూ బతికే దారి పూర్తిగా మూసుకుపోయింది. మట్టితో తయారు చేసే వస్తువులకు విలువలేకుండా పోయింది. ఒకవైపు పారిశ్రామీకరణ జరిగితే మరోవైపు మనిషి ఆధునికతకులోనై జీవనవిధానంతోపాటు అభిరుచుల్లో మార్పులు వచ్చాయి. ఈ కారణాలతో మట్టి వస్తువులకు ప్రాధాన్యత తగ్గింది. తద్వారా అది కుమ్మరుల వృత్తి జీవనంపై ప్రభావం చూపి వారికి బతుకుదెరువు లేకుండా చేసింది.

### కమ్మరి వృత్తిపై ప్రభావం

తొలకరి వర్షాలకు ముందే వ్యవసాయ పనిముట్లు చేయడంలో కమ్మర్లు నిమగ్నమవుతారు. పెద్ద బాడిసె, మలాటి ఉపయోగించి తమశక్తి సామర్థ్యాలు చాటేవారు. వ్యవసాయరంగంలోకి ఆధునాతన యంత్రాలు రావడంతో వీరికి తొలకరిలో పనులు లేకుండా పోయాయి. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం బ్యాంకురుణాలు, సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించింది. నిరంతరం శ్రమించే కమ్మరిని ప్రభుత్వం విస్మరించింది. ఫలితంగా కునారిలుతున్న కమ్మరి వృత్తిదారులను నూతనంగా వచ్చిన పరిశ్రమలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఆ పరిస్థితులను 'గూడుచెదిరి', 'కొలిమి', 'చెట్టుకింది చుట్టము' కథలలో చూడవచ్చు. ఈ కథలో కమ్మరులు వ్యవసాయరంగానికి అందించే వ్యవసాయ పనిముట్ల స్థానంలో ఆధునిక యంత్రాలు వచ్చాయి. కమ్మరులు తమ వృత్తిని కోల్పోయి తద్వారా ఉపాధికి దూరమయ్యారు. పట్నం వెళ్ళి మురికివాడలలో ఉంటూ కూలీలుగా బతుకుతున్న వైనాన్ని రచయిత దిలావర్ ఈ కథలో చిత్రించాడు. ముత్తిలింగం కొలిమి ముందు కూర్చుంటే రోజంతా పని ఉండేది. కొలిమి కొట్టం తమ్మమొద్దుల్తో నిండిపోయింది. నాగళ్ళు, గొర్లు, దంతెలు, గుంటకలు చేపిచ్చుకోవడం కోసం రైతులు బారులు తీరేవారు. చేతినిండాపని ఉండేది.

"ఒకరోజు భువిని ఆకాశాన్ని బద్దలు చేసేటంత చప్పుడు చేసుకుంట ఒక కొత్త ట్రాక్టరు వూల్లెకచ్చింది. అది చూసిన ముత్తిలింగం అదిరేటి గుండెల్ని అదిమి పట్టుకుంట ఎవల్ది వాయా ఆ ట్రాక్టరు?" అని అడిగింది... అటెంక కొన్ని దినాలకె ఆ వూల్లె అనుకోని మార్పులు జరగబట్టినయ్, ఒక్క ట్రాక్టరే వందల ఎకరాల భూమిని నమిలి పిప్పిజేతాంది. పెంటదోలడం, కల్లాలకాడ్నించి దాన్నెం ఇంటికి దోలడం, అమ్మకానికి పట్నం దోలడం, గడ్డిదోలడం, ఎరువులు తేవడం, ఇంటిగ్గావల్సిన సిమెంట్ రేకులు తేవడం పిశాచ మాల్లె అన్ని పనులూ ట్రాక్టరే జేత్తాంది. ట్రాక్టర్లు బంట్లైతయో లేదోగాని బండ్ల మాత్రం ట్రాక్టర్లైనయ్. అరక సామాను జేసుడు లేదు. బండ్ల జేసుడు లేదు. ఇండ్లు గట్టుడు లేదు. చేతిల పనిలేని ముత్తిలింగం గుండె బిగిలి పిచ్చోని తీర్గ మారిండు... పుట్టి పెరిగిన వూల్లెనె నయా పైస పుట్టే దారి లేక అల్లెడం తల్లడమై పట్నం దారి బటింద్రు" అలా ముత్తిలింగం పట్నం చేరి కూలీగా మారాడు. ఉండటానికి ఇల్లు కూడా లేక మురికివాడలో భార్యతో ఉన్నాడు.

కమ్మరుల వృత్తిలోకి పారిశ్రామిక రంగం అడుగు పెట్టడంతో వృత్తి స్వరూపం మారిపోయింది. వ్యవసాయానికి ముందు నుంచి అవసరమయ్యే అన్ని ఇనుప పనిముట్ల నుండి పంట చేతికొచ్చాక కోత కోయడానికి ఉపయోగించే కొడవలి వరకు అన్ని రకాల వస్తువులు కమ్మరి వారి చేతి నుంచి తయారయ్యేవి. ట్రాక్టర్ వచ్చి అన్ని పనులు చేయడంతో కమ్మరులు తమ ఉపాధికి దూరమయ్యారు. ఏ యంత్రమైనా మనిషికి సహాయపడేదిగా ఉండాలిగాని మనిషి స్థానంలోకి వచ్చి మనిషికి పనిలేకుండా చేయకూడదు. ఇలా మనిషి స్థానంలో యంత్రాలు రావడం వల్ల వృత్తిదారుల జీవితాలు చీకటిమయమయ్యాయి. వారిలో ముత్తిలింగం ఒకడు. ఉన్న ఊర్లో పనిలేక పట్నం చేరి కూలీగా మారాడు. కనీసం ఉండడానికి కూడ యిల్లు లేకుండా మురికివాడల్లో ఉన్నాడు. పచ్చని పల్లెలో వృత్తి జీవితం గడపాల్సిన ముత్తి లింగం జీవితం అనే గూడు ప్రపంచీకరణతో చెదిరి పోయింది.

### మంగలి వృత్తిపై ప్రభావం

కులవ్యవస్థ తమకు నిర్దేశించిన మానవసేవలో వేలాది సంవత్సరాలుగా మంగలి కులం ఉంది. ఈ వృత్తిలోకి

పెట్టుబడి ప్రవేశించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ వృత్తిలోకి ప్రవేశించారు. హైదరాబాద్, విశాఖ, తిరుపతి, విజయవాడ వంటి అనేక నగరాల్లో హైటెక్ సెలూన్లు లక్షల్లో పెట్టుబడి పెట్టి నిర్వహిస్తున్నారు. ఈ సెలూన్‌లో వినియోగించే ఒక్కో కుర్చీ ఖరీదు పాతికవేల రూపాయల పై మాటే. కాస్మోటిక్స్, బాడీమసాజ్, స్టీమ్‌బాత్, స్థూలకాయాన్ని తగ్గించడం వంటి ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిని నిర్వహించగల నేర్పు ఈ వృత్తి వారికి ఉన్నప్పటికి ఆర్థిక స్తోమత లేదు, హైటెక్ సెలూన్‌ల కారణంగా వీరు వృత్తిని కోల్పోతున్నారు. తమ వృత్తిని వదిలి పట్టణాలకు వలసలు వెళ్ళి కూలీపనులు చేసుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితులను *దృశ్యాదృశ్యం, ఇంటర్నేషనల్ ఫ్రాంఛైజీ, ఫ్రాంఛైజీస్ కావలెను* కథల్లో చూడవచ్చు.

'దృశ్యాదృశ్యం' కథలో శ్రీశైలం డ్యాం ముంపు తరువాత బతుకు దెరువుకు ఎవరిదారి వారు చూసుకుంటారు. అయితే ఆనంద్ కూడా పట్నం వచ్చి సంప్రదాయంగా వస్తున్న క్షవరవృత్తిని ఆచరిస్తాడు. ఈ వృత్తిలోకి పెట్టుబడిదారులు హైటెక్ సెలూన్లరూపంలో ప్రవేశిస్తారు. ఒకవైపు ఊరి ముంపు, మరొకవైపు పెట్టుబడిదారులు కులవృత్తుల్లోకి ప్రవేశించడంతో ఈ వృత్తి వారి జీవితాలు అదృశ్యమైన విధానాన్ని రచయిత వెంకటకృష్ణ దృశ్యాదృశ్యం కథలో చిత్రించాడు.

ఆనంద్ శ్రీశైలం ముంపు తర్వాత బతుకుదెరువుకోసం కర్నూల్ వచ్చి ఒక చిన్నపాటి బంకులో క్షవరం చేస్తూ జీవనం సాగిస్తాడు. అదే ఊరికి చెందిన హనుమంతరెడ్డి కూడా కర్నూలు వచ్చి ఒక ఖాళీ స్థలాన్ని లీజుకు తీసుకొని కొట్టం వేసుకొని నాలుగు ఎనుములతో ఆనంద్‌కు దగ్గరగా ఉన్నాడు. షేవింగ్ సెలూన్‌లో కూచున్న ఆనంద్ దగ్గరకి ఆ షాపు ఓనర్ వచ్చాడు. నెలరోజులు టైమిస్తా వేరేచోటు చూసుకోమని చెప్తాడు. ఇంతలో ఆనంద్ కొడుకు రవి ఒక పాంప్లెట్ తీసుకొచ్చి "ఎదురుగా కట్టిస్తాండే బిల్డింగులో పైనపోర్లు ఆడవాళ్ళకు బ్యూటీపార్లర్ కింద మగాళ్ళకు జిమ్, మెన్ బ్యూటీపార్లల్, బాడీమసాజ్ సెంటర్ పెడ్తున్నారంట నాయనా అదే ఈ పాంప్లెట్" అని చెప్పగా ఆనంద్ గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది.

ఆ షాపింగ్ కాంప్లెక్స్ కట్టించేది హనుమంతరెడ్డి. అతిథిగా ఎమ్మెల్యేని పిలిచాడు. "ఒక సైబర్ కేఫ్, ఒక పబ్ సెంటర్ ఒక జిమ్. హైటెక్ సేవింగ్ సెలూన్ కమ్ బాడీ మసాజ్ సెంటర్ వెరసీ యువతకు ఆధునిక స్వర్గమొకటి ప్రారంభమవుతూ ఉంది" అని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి దానికి తలుపులు తెరుస్తున్నాడు. ఆ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా వుండే ఆనంద్ షాపును ఓనర్ ఖాళీ చేయిస్తాడు. అతడు చివరికి నగరానికి బయట చెక్‌పోస్ట్ ఏరియాకు మారిపోతాడు. బహుజన వృత్తి కులాల్లో పెట్టుబడి ప్రవేశించి హైటెక్ షేవింగ్ సెలూన్‌గాను, మసాజ్ సెంటర్లుగా ఒక వినూత్న రూపంలో అవతరించి వృత్తి కులాలవారి జీవితం అదృశ్యం అవుతూ కనిపించే దృశ్యం మనకు దృశ్యా దృశ్యం కథలో కనిపిస్తుంది. క్షవరం లాభసాటి వ్యాపారం కావడంతో పెట్టుబడిదారులు ఈ వృత్తిలోకి ప్రవేశించారు. తద్వారా ఆ వృత్తి వ్యాపారంగా మారింది. వృత్తిదారుల వద్ద అంత పెట్టుబడి లేక షాపులు పెట్టడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో వీరి వృత్తికి ఉనికి లేకుండాపోయింది. గత్యంతరం లేక ఆ హైటెక్ సెలూన్ షాపులో వీరు కూలీలుగా చేరడమో లేక వృత్తిని వదులుకోలేని ఆనంద్‌లాంటివారు నగరానికి చివర్లో బంకులు పెట్టుకుని దారుణమైన పరిస్థితుల్ని ఎదుర్కోవడమే జరుగుతోంది.

**రజక వృత్తిపై ప్రభావం**

తరతరాలుగా ఇంటిల్లిపాది చాకిరేవులో బట్టలుతికేవారు చాకలి వారు. వీరు బట్టలుతకడమేగాక పురుడు పోసే మంత్రసానిగా వ్యవహరిస్తారు. ఇంటిని శుభ్రం చేస్తారు. మైలపడిన బట్టలు ఉతుకుతారు. పెళ్ళిళ్ళలకు కాగడాలు మోస్తారు. చావులకు కబురు చేస్తారు. అంటే ఎవరైనా చనిపోతే పక్కఊరు వెళ్ళి చెప్పి వస్తారు. పండుగ సమయాల్లో మేకలు, పొట్టేళ్ళను చాకలివారు శుభ్రం చేస్తారు. ఇన్ని పనులు చేస్తున్నా వీరి బతుకంతా అవమానాలతో నిండి ఉంటుంది. ఆకలితో అలమటిస్తారు. అందువలన వీరు 'రజకులు'గా తమ కులాన్ని సంస్కృతీకరించుకున్నారు. వృత్తి విషయాని కొస్తే సోడు, సబ్బులతో మురికి బట్టలను పెద్దపెద్ద బానలలో వేసి ఉడికించి మురికిని వదలగొట్టేవారు. పల్లెల్లో సంవత్సరానికి కుంచాల లెక్క వడ్లు, లేదా రొక్కం (కూలీ) ఇస్తారు. పట్టణాల్లో ఎప్పటి డబ్బులు అప్పుడు ఇచ్చి సేవలు జరిపించుకుంటారు. నేడు ఈ వృత్తిలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆధునిక యంత్రాలతో అగ్రవర్ణాల వారితో పాటు బహుళజాతి వారు ఈ వృత్తిలోకి ప్రవేశించారు. చాకలి వారిని కూలీలుగా మార్చారు. పల్లెల్లో చెరువులు, వాగులు, దోబిఘాట్లలో నీళు

ళ్ళలే ఈ వృత్తి చేయలేకపోతున్నారు. ఒకవైపు కరువుతో రైతులు కూడ వ్యవసాయం చేయలేక వీరిని వెలివేశారు. పోనీ ఆధునిక యంత్రాల సాయంతో వృత్తి చేద్దామన్నా వీరి దగ్గర పెట్టుబడి లేదు. ఈ విషయాలను దొర్ల రామచంద్రరావు రాసిన 'చాకిరేవు' కథలోను, కె.వి. నరేందర్ రాసిన 'ఉసుల్లు' లోను, నేరళ్ళ శ్రీనివాస్ గౌడ్ రాసిన 'తెగిన బంధాలు' కథల్లో చూడవచ్చు.

"చాకిరేవు" కథలో భూస్వామ్య పెత్తందారీ కులాలు, గ్రామకరణం, బి.సి.లు, 'దళితుల శ్రమను దోపిడి చేసి సుఖాలు అనుభవించే తీరును, చాకలి వారి జీవితంపై పారిశ్రామీకరణ ప్రభావం, అది వారి వృత్తిని ధ్వంసం చేసిన తీరును రచయిత దార్ల రామచంద్రరావు వివరించారు. కరణం గారి కొడుకు పెళ్ళి పట్నంలో జరుగుతుంది. మరుసటి రోజు కరణం ఉండే ఊర్లో పెద్ద విందు జరిగింది. రాత్రికి ఊరేగింపు చేయిస్తాడు. ఈ ఊరేగింపులో చాకలి సైదులు, మాలసోమడు, కుమ్మరి వెంకయ్య పెట్రోమాక్స్ లైట్లు పట్టుకొని నడుస్తారు. ప్రమాదవశాత్తు చాకలి సైదులు పట్టుకున్న పెట్రోమాక్స్ లైట్ నుండి కిరసనాయిల్ కారి ఒక్కసారిగా కాలిపోతాడు. ఇంతలో కరణం వచ్చి ఊరేగింపు ఆగకూడదని అందరిని హెచ్చరిస్తాడు. సైదులను పక్క ఊర్లో హాస్పిటల్‌కు తీసుకెళ్తారు. 20 రోజులు డాక్టర్ హాస్పిటల్‌లో ఉండమని చెబుతాడు. సైదులు భార్య కలమ్మ అప్పుచేసి డబ్బులు తెచ్చి కడుతుంది. 20 రోజుల తర్వాత సైదులు హాస్పిటల్ నుండి ఇంటికొస్తాడు. గాయాలు పూర్తిగా మానలేదు. కాని పనిలోకి వెళ్ళకపోతే తిండికి కష్టమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని చాకిరేవు దగ్గరకు వెళ్తాడు.

సైదులు, కలమ్మ దంపతులకు ముగ్గురు బిడ్డలు. అందులో ఒక ఆడబిడ్డకు పెళ్ళి ఎలా చేయాలని వారు ఆలోచనలో పడ్డారు. మిగతా ఇద్దరు కొడుకులను దొరల దగ్గర జీతానికి ఉంచారు. బిడ్డకు పెళ్ళి చేయాల్సివచ్చి డబ్బులు సరిపోక అప్పుచేస్తాడు. ఈ అప్పులు తీర్చడానికి కొడుకు పట్నంలో ఉంటాడు. సైదులు, కలమ్మ బట్టలు ఉతకడానికి వెళ్తారు.

"వీళ్ళెవరూ" అని అడిగింది కరణం గారి కోడలు అత్తని.

'చాకలోళ్ళు'

'వీళ్ళనెందుకు తీసుకొచ్చావు'

'మన ఇంట్లో బట్టలుతాకడానికి'

'అవసరం లేదు'. 'ఎందుకు అవసరం లేదు ఎట్ల'

'బట్టలుతకడం కోసం మీ కొడుకు వాషింగ్ మిషన్ తెచ్చిండు. బటన్ నొక్కితే చాలు బిర బిర ఐదు... పది నిమిషాల్లో బట్టలుతుకతది. సబ్బులు పౌడర్లు వేసి నానబెట్టిన తర్వాత అదే ఉతుకతది. తీసి జాడిచ్చి ఎండలో ఆరేయటమే గాదా! గాపని ఇప్పుడు సులభమైంది. చాకలి వాళ్ళు అవసరం లేదు" అన్నది కోడలు అత్తతో.

'మరి ఇస్త్రీ ఎవరు చేస్తారు'

'ఇస్త్రీ పెద్ద సమస్య కాదు. బటన్ ఆన్ చేస్తే కరంటు ఇస్త్రీ ఒక్క నిముషంలో చేసుకోవచ్చు. దీని కోసం మనిషి ప్రత్యేకించి అవసరం లేదు అత్తమ్మగారు' అన్నది కోడలు. ఆ మాటలు విన్నాక సైదులు, కలమ్మ ఇంటికి వెళ్దామని అనుకున్నారు. పల్లెకు పోదామంటే అక్కడ కరువు. తాగడానికి నీళ్ళు దొరకడం లేదు. దీంతో, పట్నంలోనే ఒక హోటల్‌లో పని చేసుకుంటారు.

ఈ కథను పరిశీలిస్తే గ్రామాల్లో ఊరేగింపుల సమయంలో చాకలివారు లైట్లు పట్టడం ఒక ఆచారంగా కొనసాగుతూ వచ్చింది. అందుకు అంగీకరించని వారిపై దాడులు జరుగుతాయి. లేదంటే ప్రమాదవశాత్తు సైదులు లాంటివారు గాయాలపాలవుతారు. అసలే ఎదుగుదల లేని వారి జీవితాల్లో ప్రమాదాలు జరిగితే వారి జీవితం మరింత దుర్భరం అవుతుంది. మరొకవైపు ప్రపంచీకరణ ఈ వృత్తిని కొనసాగిస్తున్న వారిని మరింత దెబ్బతీసింది. వాషింగ్ మెషిన్‌లు, కరెంట్ ఇస్త్రీ పెట్టెలు రావడంతో ప్రజలకు అవి వాడటం సులభంగా ఉండడంతో ఈ వృత్తి వారికి ఉపాధి లేకుండా పోయింది.

ఈ వృత్తిలో బట్టలు ఉతికి మురికిని పోగొట్టే శాస్త్రీయతను సమాజానికి వీరు నేర్పినప్పటికి లాండ్రీషాపులు పెట్టేంత పెట్టుబడి లేనందువల్ల వీరు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో కడుపు నిండని కూలీలు కరువుతో పట్టణాలకు వలసల పాలవుతున్నారు. పట్టణాలకు వెళ్ళి కొంతమంది డ్రైక్లీనింగ్ షాపులు పెట్టినప్పటికి ఈ వ్యవస్థలో యితర కులాల వారి పోటీతో వీరి జీవితాలు సంక్షోభానికి గురయ్యాయి.

యాంత్రికీకరణ, ప్రపంచీకరణ విధానాలు వృత్తిదారుల వెన్ను విరుస్తున్నాయి. వృత్తిదారులు ఇతర వృత్తులకు మారడం అంత తేలిక కాదు. వారు కొత్త వృత్తిని స్వీకరించి దానికి కావాల్సిన పనిముట్లు, నైపుణ్యాన్ని సమకూర్చుకోవడానికి కావాల్సి పెట్టుబడి వారి వద్దలేదు. ప్రభుత్వ సహాయం లేకపోతే వడ్డీ వ్యాపారుల చేతుల్లో అనివార్యంగా వీరి చిక్కుకుంటారు. కుల వృత్తుల్లో యంత్రాలు ప్రవేశించి క్రమంగా స్థానిక వృత్తిదారులను దెబ్బతీస్తున్న విషయాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి శిక్షణ, రుణ, మార్కెట్ సదుపాయాలు లేకపోవడం వలన అద్భుత ప్రతిభ ఉన్నప్పటికి వృత్తి దారులు పస్తుల పాలవుతున్నారు. ఇలాంటి పరిణామాలు ఎన్నింటినో తెలుగు కథకులు తమ కథల్లో రికార్డు చేశారు.

■



# నలుపు తెలుపులు

- పద్మావతి రాంభక్త
9966307777

**సూ**ర్య అలా చేస్తాడని అప్పుడు నేను అసలు కలలోనైనా అనుకోలేదు. అతడు చేసిన పనికి ఈనాటికి కూడా ప్రకాష్ దగ్గర నాకు ఎంతో ఇబ్బందిగా అనిపిస్తోంది. అలాగని ప్రకాష్ ఆ విషయం గురించి నన్ను పల్లెత్తు మాట ఎన్నడూ అనలేదు. ప్రకాష్ ఏమీ అనకపోయినా నాకే చాలా గిల్టీగా ఉంది. నా వల్లే కదా సూర్యకి ప్రకాష్‌తో పరిచయం ఏర్పడింది. వాళ్ళిద్దరికీ ఒకరితో ఒకరికి పరిచయం ఏర్పడకపోతే నాకీ ఇబ్బందికరమైన పరిస్థితి అసలు ఎదురయ్యేది కాదు. సూర్య విషయాలన్నీ బాగా తెలుసున్న నేను, తను ప్రకాష్ దగ్గర తీసుకున్న లక్ష గురించి అడగలేకపోతున్నాను. అలాగని అడగకుండా ఉండలేకపోతూ నాలో నేనే సతమతమవుతున్నాను. ఎంత బాగా తెలుసున్నా, ఎన్నాళ్ళ పరిచయమున్నా కొన్ని సందర్భాల్లో మనుషులు ప్రవర్తించే తీరుతో పాటు వారి మనస్తత్వాలు చాలా వింతగా అనిపిస్తాయి. మనసులను స్కాన్ చేసి వారి లోతులను తెలుసుకునే యంత్రాలుంటే ఎంత బాగుండును!

వారం రోజుల క్రితం ప్రకాష్ ఫోన్‌లో ఎవరినో ఒక లక్ష అప్పుగా, అదీ వడ్డీకి అడుగుతుంటే అనుకోకుండా నా చెవిన పడింది. అవతల వారిని ఎంతగా ప్రాధేయపడుతున్నాడో... వింటున్న నాకే పాపం అనిపించింది. 'ఛా నాకే ఒక మంచి ఉద్యోగం ఉంటే అడ్వాన్స్ తీసుకునో, లోన్ పెట్టో తనకి డబ్బు సమకూర్చి ఉండేదాన్ని కదా' అనిపించింది. పోనీ అక్కా వాళ్ళనెవరినైనా అడుగుదామనుకుంటే ఈ కరోనా కాలంలో అందరికీ డబ్బుకి ఇబ్బందులే కదా. అందరికీ సహాయపడే ప్రకాష్ ఇలా ఇబ్బంది పడడం నాకు బాధనిపించింది. ఆ వెంటనే అప్పటి విషయం జ్ఞాపకం వచ్చింది.

అంతకు ముందు సూర్యకు ఎన్నో అవసరాల్లో నేనే పూనుకుని చిన్న చిన్న సహాయాలు చెయ్యబట్టి కదా, తనకి అవసరమనిపించగానే చప్పున నేను గుర్తొచ్చి వాళ్ళ అమ్మగారి ఆపరేషన్ కోసం లక్ష వెంటనే కావాలని అడిగాడు. అందులో తప్పేమీ లేదు కానీ, అదే పేరు గల మరొకామె మెడికల్ రిపోర్టుతో తారుమారైపోవడం వల్ల పొరపాటున వాళ్ళ అమ్మగారికి ఆపరేషన్ పడుతుందని చెప్పిన డాక్టర్ ఇక అవసరం లేదని తేల్చి చెప్పేసారు.

అలాంటప్పుడు ఆ లక్ష రూపాయలు సూర్య తెచ్చి మళ్ళీ ప్రకాష్‌కు భద్రంగా వెనక్కి ఇచ్చెయ్యాలి కదా. కానీ అతడా పని చెయ్యలేదు. తీరిక లేదేమో అని రెండు మూడు రోజులు ఎదురుచూసి నేనే ఉండబట్టలేక అడిగేసరికి అతడు చెప్పిన జవాబుకు నాకు మతిపోయింది.

"ఏదో అవసరానికి వాడేసాను లలితా... వచ్చే నెలలోనో ఆపై నెలలోనో అడ్జెస్ట్ చేసి ఇచ్చేస్తాలే" అన్నాడు తేలికగా.

ఆ మాట విని నాకు నోట మాట రాలేదు.

'ఈ విషయం ప్రకాష్‌కు ఎలా చెప్పాలి? చెప్తే అంతా నీ వల్లే అని నన్ను తిడతాడా? ఈ సూర్య ఏమిటి ఇలా చేసాడు. నేనసలు ఊహించలేదిది' ఆలోచనలతో మెదడు వేడెక్కిపోయింది. ఇక ఎప్పుడో చెప్పడం కన్నా ముందే చెబితే నా గౌరవం దక్కుతుందని విషయం ప్రకాష్ చెవిన వేసాడు. తను నన్నేమీ అనలేదు కానీ ...

"ఎంతో అవసరమని, అదీ వాళ్ళ అమ్మగారికి ఆపరేషన్ త్వరగా చేయించాలని, అర్జంట్ అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అడిగితే కదా.. నాకు అవసరం పడి బ్యాంకు నుంచి డ్రా చేసి

ఇంట్లో పెట్టిన లక్షా వెంటనే సూర్య చేతులలో పెట్టావు” అని మాత్రమే, అదీ ఆ ఒకసారే అన్నాడు.

నేను మౌనంగా ఊరుకున్నాను. మాట్లాడలేక కాదు, మాట పెగలక. మరోసారి నేనే టాపిక్ తీసినపుడు ...

“అవును అదేంటో సూర్య ఇలా చేసాడు” అంటూ తనూ ఆలోచనలో మునిగాడు.

మళ్ళీ తనే “తనకి ఆ విషయం గుర్తుండే ఉంటుంది. డబ్బు సర్దుబాటు కాలేదేమో మరి. నువ్వు మాత్రం తనని అడగకు. వేచి చూద్దాం” అన్నాడు.

కానీ మరీ ఇన్ని రోజులా...?

సూర్య మా ఇంటికి ఇదివరకులాగే వస్తూ పోతూ చాలా మామూలుగా ఉంటున్నాడు. ప్రకాష్ కూడా తన దగ్గర ఆ విషయం ప్రస్తావించకపోవడం గమనిస్తూనే ఉన్నాను. పోనీ సూర్య ఒకసారైనా “ఇలాంటిలాంటి పరిస్థితుల్లో డబ్బు తిరిగి ఇవ్వడం కుదరలేదు” అని తన పరిస్థితిని వివరిస్తూ ఒకసారి ప్రకాష్ తో మాట్లాడినా నేను సంతోషించి ఉండేదాన్ని. ఇలా చాలా రోజులు దొర్లిపోయాయి.

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. మాకు పెళ్ళైన దగ్గర నుంచి చూస్తూనే ఉన్నాను. ప్రకాష్ మనుషులతో ప్రవర్తించే విధానం ఎంత ఉన్నతంగా ఉంటుందో నాకు గాక మరెవరికి తెలుస్తుంది. అవతల వారు కోపంలో తేలికగా ఏమైనా అనేసినా తను పొరపాటున కూడా మాట తూలడు.

ఇంతకీ సూర్య గురించి చెప్పలేదు కదూ. నేను ఓపెన్ యూనివర్సిటీలో పీజీ చేస్తున్నపుడు సూర్య నాకు పరిచయమయ్యాడు. క్లాసులు అయ్యాక కొంతమంది కలిసి కూడి అక్కడే చెట్ల కింద కూర్చుని

అసైన్‌మెంట్లు రాసుకోవడమో లేక పాఠాల గురించి చర్చించుకోవడమో చేస్తూ ఉండేవాళ్ళం. అదిగో అప్పుడు స్నేహితుడయ్యాడు సూర్య. శ్రీకాకుళంలోని పల్లెటూరి నుంచి వచ్చినా ఇంగ్లీషు స్పష్టంగా ధారాళంగా మాట్లాడేవాడు. సబ్జెక్ట్ మీద తనకి మంచి పట్టు ఉండడంతో, నాకు బోధపరచేవాడు. మాతో పాటు ఉన్న మరి కొందరు సైతం ఎవరికి ఏ సబ్జెక్ట్ మీద ఎక్కువ అవగాహన ఉంటే వారు మిగిలిన వారికి అర్థమయేలా చక్కగా వివరించేవారు. మా బాచ్‌లో అలా ఒక పది మంది కలివిడిగా ఉంటూ కలిసి అసైన్‌మెంట్లు రాసుకుంటూ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవాళ్ళం. బాచ్‌లో అందరూ బాచిలర్సే కావడంతో వారికి ఏ బాదరబందీ లేకుండా హాయిగా ఉండేవారు. చదువు తప్ప వారికి మరో వ్యాపకం లేదు. నాకు అప్పటికే పెళ్ళి అవడంతో సంసార బాధ్యతలు ఉండేవి. ఇక చుట్టాలు కనుక ఇంటికి వస్తే నా చదువు కాస్తా అటకెక్కేది. దానితో నేను తరచూ చదువులో వెనకపడి పోతూ ఉండేదాన్ని. నేను చిన్నప్పటి నుంచి మెరిట్ స్టూడెంట్ కావడంతో నాకు వారితో పోటీ పడి చదవాలనే పట్టుదల ఉండేది. అత్తెసరు మార్కులతో పాసవడం నాకసలు ఇష్టం లేదు. దానితో మిగిలిన వాళ్ళను అందుకోవడానికి ఆపసోపాలు పడేదాన్ని. అందరూ చదువు పట్ల నా శ్రద్ధా తాపత్రయం చూసి ముచ్చటపడుతూ తెగ మెచ్చుకునేవారు. ప్రకాష్‌ది మంచి ఉద్యోగమే కానీ నాకు చిన్నప్పటి నుంచి బాగా చదువుకుని ఉద్యోగం చెయ్యాలని మహా కోరికగా ఉండేది. మంచి సంబంధం రావడంతో నాన్న నాకు నచ్చజెప్పి ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరంలో పెళ్ళి జరిపించేసారు.

పెళ్ళికి ముందే ప్రకాష్‌తో మాట్లాడినపుడు నాకు పిజి చెయ్యాలని ఉందని చెప్పడంతో, నన్ను ఓపెన్ యూనివర్సిటీలో జాయిన్ చేసాడు. మా అత్తగారు వాళ్ళకి ఇష్టం లేకపోయినా తనే వాళ్ళని కన్విన్స్ చేసాడు.

నా చదువుకు తను అడ్డం రాకుండా నేను ఏది వండి పెట్టినా మారు మాట్లాడకుండా తిని ఆఫీసుకు వెళ్ళిపోతాడు. ఇక ఆదివారాలు అయితే ఒకోసారి తనే వంట పని చూసుకుంటూ నాకు చదువుకోవడానికి సౌలభ్యం కల్పిస్తాడు. అప్పుడప్పుడు నాకు అర్థం కాని టాపిక్స్ వివరించడానికి సూర్య మా ఇంటికి వస్తూ ఉండేవాడు. తనకి చిన్న చిన్న ఖర్చులకి డబ్బులు సరిపోకపోతే నేనే ప్రకాష్‌ని అడిగి ఇస్తూ ఉండేదాన్ని. అవి తను మళ్ళీ తిరిగి ఇవ్వడం గురించి ప్రకాష్ గానీ నేను గానీ ఎన్నడూ ఆలోచించలేదు. వాళ్ళ కుటుంబం పెద్దదని, డబ్బుకు ఇబ్బందనీ మాత్రం మాకు ఎప్పుడో మాటల్లో చెప్పాడు.

అందువల్లే మేము కూడా ఎన్నడూ ఇచ్చిన మొత్తాన్ని లెక్కగట్టలేదు, పట్టించుకోలేదు. ప్రకాష్ ఎన్నోసార్లు చాలామందికి తనకు వీలైనంతలో సహాయపడుతూనే ఉంటాడు. ఆ విషయాలు నేను ఎవరికైనా చెప్పినా తనకు నచ్చదు.

“ఎందుకు లలితా మనం చేసినది ఏ మాత్రం? ప్రపంచంలో ఎందరో మహానుభావులు ఎన్నో గొప్ప గొప్ప పనులు నిశ్శబ్దంగానే చేస్తూ ఉంటారు. వారికి గుర్తింపబడాలనే తహతహ ఉండదు. మనకు వీలైనంతలో ఒక ఆవగింజంత మాత్రమే కదా నలుగురికీ పంచుతున్నాం” అంటాడు. తను ఆఫీసులో కూడా అందరికీ తలలో నాలుకలా మెలుగుతుంటాడు. అందుకే

ప్యూన్ దగ్గర నుంచి తన పైన ఉండే ఆఫీసర్ల వరకూ ప్రకాష్‌ను చాలా గౌరవంగా చూస్తారు.

సూర్య ఎవరి గురించైనా చెప్పేడప్పుడు "అతడికేం లక్ష జీతం వస్తుంది. ఎన్ని ఆటలైనా ఆడతాడు. మొన్నే మంచి కారు కూడా కొన్నాడు" అంటూ ఎక్కువగా వారి ఆర్థిక పరిస్థితిని గురించి మాట్లాడతాడు.

"దానికి తగ్గట్టు వారికీ ఖర్చులుంటాయి కదా. వాళ్ళకేం ఇబ్బందులున్నాయో నీకేం తెలుసు" అని నేనంటే "ఆ.... ఏం ఇబ్బందులుంటాయి లలితా. ఈపాటికే బోలెడు వెనకేసి ఉంటారు" అంటూ తనకు తెలిసున్నట్టే మాట్లాడతాడు. ఇలా తను మాట్లాడినపుడు మాత్రం నాకు అసలు నచ్చదు. అలాంటి సమయంలో నాకు నా బాల్య స్నేహితుడు సురేష్ గుర్తొస్తాడు. అతడు మరొక తరహా మనిషి. నేను కొన్నాళ్ళు ఏదో బిజీలో పడి తనకి ఫోన్ చెయ్యకపోయినా, తన మిస్డ్ కాల్ చూసి పొరపాటున తిరిగి ఫోన్ చెయ్యకపోయినా... నాకు వీలు కుదిరినపుడు నేను ఫోన్ చెయ్యగానే తను మాట్లాడే మొదటి మాట "మీరు ధనవంతులు కదా తల్లీ.. మీకు మాలాంటి పేదలు ఎక్కడ గుర్తుంటారులే" అంటాడు.

తను అలా అనగానే నాకు చాలా కోపమొస్తుంది. తనకీ సొంత ఫ్లాట్, కారూ ఉన్నాయి. ప్రకాష్ హోదాలో కాస్త పైమెట్టు మీదే ఉన్నా మేము అంతలా కోట్లకు పడగలెత్తిన వాళ్ళం మాత్రం కాదు. మా ఇబ్బందులు మాకూ ఉన్నాయి. అత్తగారు, మామగారు వాళ్ళకీ కూడా పంపుతూ ఉండాలి కదా.

అయినా కోట్లు పొంగి పొరలుతున్న వారు మాత్రం ఎవరికైనా సహాయం చేయడానికి ముందుకొస్తారని గ్యారంటీ ఎక్కడుంటుంది. నా ఎరుకలో ఎంతో మంది ఉన్నవాళ్ళు పరమ పిసినారిగా ఉంటూ, వారి దగ్గర సంవత్సరాల తరబడి నమ్మకంగా పని చేసిన వారికి సైతం ఎంత అవసరమని ప్రాధేయపడినా ఏ రకమైన ఆర్థిక సహాయం చేయకుండా నిర్దాక్షిణ్యంగా ఉండడం తెలుసు. అంతెందుకు మాకు తెలిసిన బాగా కలిగిన కుటుంబమే, ఒక పనిమనిషి చేత పదిహేను సంవత్సరాలు పని చేయించుకున్నారు. ఆమె కూడా ఒళ్ళంచి నిజాయితీగా వారి దగ్గర పని చేసేది. ఆమె కూతురి పెళ్ళికి వాళ్ళు ఆర్థిక సహాయం చేస్తామని నమ్మబలికి తీరా పెళ్ళికి ముందర ఆమె వెళ్ళి అడిగితే ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పంపేసారు. మనుషులు అంత దారుణంగా ఉంటారని నాకు అసలు తెలియదు. నా అదృష్టం కొద్దీ ప్రకాష్ అలా ఏనాడూ ప్రవర్తించలేదు. సురేష్ లాంటి వాళ్ళు అలా మాట్లాడే విధానానికి నాకు విపరీతంగా బాధనిపిస్తుంది. నేను ఒకట్రెండుసార్లు అలా అన్నవాళ్ళతోనే

'నేనెప్పుడైనా మీతో అలా గర్వంగా ఏమైనా ప్రవర్తించేనా? నేను ఎవరితోనైనా చాలా మామూలుగా ఉంటాను కదా' అన్నాను. వాళ్ళ మనసులో ఏమనుకుంటారో నాకైతే తెలీదు కానీ పదే పదే అలాగే మాట్లాడుతూ ఉంటారు. కొన్నిసార్లు మన చుట్టూ ఉన్న మనుషులో లేక మన అనుకున్న ఆత్మీయులో వారికి తెలుసో తెలియకో చాలా బాధపెడుతూ ఉంటారు. నేను అదే పనిగా అవన్నీ మననం చేసుకుంటూ బాధపడిపోతూ ఉంటే ప్రకాష్ నన్ను ఓదారుస్తూ .. "లలితా మనకి కరెక్ట్ అనిపించింది మరొకరికి తప్పుగా అనిపించవచ్చు. వారి వారి అనుభవాల వల్ల ఒక్కొక్కరికి ఒక్కొక్క దృష్టి కోణం ఏర్పడుతుంది. ఎవరైనా మనలను ఏమైనా బాధపెట్టేలా మాట్లాడినా ప్రవర్తించినా సర్దుకుపోవాలి తప్ప వారిని దూరం చేసుకోకూడదు. అలా దూరం చేసుకుంటూ పోతే ఇక మనకి ఎవరు మిగులుతారు చెప్పు. మనుషులన్నాక తప్పులు చెయ్యకుండా ఉండరు కదా." అన్నాడు.

"నేను బాధపడతాను కానీ ఎవరినీ బాధపెట్టేలా ఒక్క మాట కూడా మాట్లాడను కదా.. అందరూ నన్నెందుకు అంత బాధ పెడతారు. మొన్నే ఒక విషయం జరిగింది. అది నీకు చెప్పలేదు కదా. నాకు ఎక్స్ టర్నల్స్‌లో అందరి కన్నా ఎక్కువ మార్కులు వచ్చాయి. ఆ సంగతి నీకు తెలుసు కదా. అందరూ నాకు వాళ్ళు ముందే పరిచయమని అందుకే ఎక్కువ వేసారని చెవులు కొరుక్కున్న విషయం నా వరకూ వచ్చింది. అలా అనుకునే వాళ్ళు ఎన్నైనా అనుకుంటారు. అనుకుంటే అనుకోనీ అని సరిపెట్టుకున్నాను. కానీ సూర్య కూడా నాతో అదే మాట అనేసరికి నేను స్థాణువయ్యాను" అన్నాను ప్రకాష్‌తో.

"సూర్య అలా అన్నాడా?" అడిగాడు ప్రకాష్.

"అవును ప్రకాష్, ఇన్నాళ్ళ స్నేహంలో నా గురించి, నా నిజాయితీ సంగతి తెలిసి కూడా అలా ఎలా అన్నాడా అని చాలా బాధపడ్డాను. 'లలితా.. ఇలా ఎందరు చెయ్యట్లేదు చెప్పు? మన సీనియర్ విజయ్ లేడూ...అతడు ఆవరేజ్ స్టూడెంటని నీకూ తెలుసు కదా... అతడికి ఒక్కసారిగా అన్ని మార్కులు ఎలా వచ్చాయంటావు. బాక్ డోర్ ద్వారా ప్రయత్నిస్తారని నీకూ తెలుసు కదా.' ఇలా నా దగ్గర మాట్లాడుతుంటే నాకు ఏమనాలో కూడా అర్థం కాలేదు. నన్ను కూడా అందరితో కలిపేసాడు

కదా అనిపించింది. సూర్యే కాదు సూర్యలాంటి వాళ్ళ చర్యల వల్ల కన్నా మాటల వల్ల మనసు మెలిపెట్టినంత బాధ కలుగుతుంది. పోనీ నా సంగతి తెలియకనా అంటే కానే కాదు. కానీ మరి ఎందుకలా మాట విసిరేస్తారో నాకు అర్థం కాదు" అన్నాను ప్రకాష్‌తో. అప్పటికే నా గొంతు దు:ఖం వల్ల పూడుకుపోతోంది.

"లలితా నలుపూ తెలుపులా మనుషులలో చెడూ మంచీ కూడా ఉంటాయి. మనుషులందరూ పూర్తిగా మంచిగా నీకు నచ్చిన తీరులో ఉండాలంటే ఎలా? మనం ఎప్పుడూ మనుషులలోని నలుపును చూసీ చూడకుండా వదిలేసి, తెలుపుని మాత్రమే గుర్తుంచుకోగలిగితే మనకి మనశ్శాంతిగా ఉంటుంది. 'వాళ్ళు అలా ఎందుకు ప్రవర్తించారు, వీళ్ళిలా ఎందుకు చేసారు' అని ఎంతసేపూ అవే సంఘటనలు మననం చేసుకుంటూ కూర్చుంటే మనకి ఏమొస్తుంది చెప్పు. పాత బరువులను ఎప్పటికప్పుడు దించేసుకుంటూ పోతేనే జీవితంలో నడక తేలికగా అనిపిస్తుంది. అసంకల్పితంగా మన చర్యల వల్లో మాటల వల్లో మరొకరు కూడా బాధపడి ఉండవచ్చు. మనకి ఎప్పటికీ ఆ విషయం వారు చెప్పకుండా ఉంటే మనకి సైతం ఆ విషయం తెలియనే తెలియదు. నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. నేను డబ్బు కోసం ఇబ్బంది పడుతున్నాననే కదా. నాకు డబ్బు ఎలాగో అలాగ సర్దుబాటవుతుంది. కానీ మనుషుల మధ్య సన్నని తెరలు మొలవడం మొదలైతే అవి కొన్నాళ్ళకు పటిష్టమైన గోడలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉంది" అన్నాడు ప్రకాష్.

"లేదు లేదు... నేను నా ఆలోచనా సరళి మార్చుకుంటాను ప్రకాష్. కానీ దానికి సమయం పడుతుంది. నన్ను సరైన దారిలో పెట్టి మార్గదర్శకం చెయ్యడానికి నా పక్కనే ఫ్రెండ్ ఫిలాసఫర్ గైడ్ లా నువ్వుంటావుగా" అన్నాను నవ్వుతూ.

నా మనసు ఇప్పుడు దూదిపింజెలా తేలికగా ఉంది. ■

**ఒక ప్రయోజనం ఆశించినంత మాత్రాన**
**అది ప్రచార సాహిత్యం కాదు.**
**ప్రచారమే ధ్యేయమైనా అందులో కళ ఉంటే–**
**అది సాహిత్యం కాకపోదు.**
**– పురిపండా అప్పలస్వామి**



## ప్రతిబింబాలు

**అ**ద్దంలో నన్ను నేను చూసుకున్నప్పుడల్లా
అందంగా అలంకరించబడిన
మా ఇల్లు గుర్తొస్తుంది!
రంగురంగుల గోడలతో
ఖరీదైన మార్బుల్స్‌తో
విలాసవంతమైన ఫర్నిచర్తో
దర్పాన్ని ప్రదర్శించే మా ఇల్లులాగే
నేను కూడా రకరకాల
డిజైనర్ బట్టలతో
విలువైన నగలతో
మెరిసిపోతుంటాను

ఇల్లూ, నేనూ ఎప్పటికప్పుడు
సరికొత్త హంగులతో
రూపాంతరం చెందుతుంటాం
అతిధులచ్చినప్పుడల్లా
దేదీప్యమానంగా వెలిగిపోతూ
స్టేటస్ సింబల్‌గా మారిపోయి
బిలాంగ్స్ టూగా మిగిలిపోతాం

నేనంటే ఇల్లుగా గుర్తించబడ్డాక
మాటలు రాని ఇల్లు
మాటల్ని మర్చిపోయిన నేను
ఎప్పటికీ బింబ ప్రతిబింబాలమే!

**- కడెం లక్ష్మీప్రశాంతి**
**78933 99773**

# బహుముఖ ప్రజ్ఞాశాలి మల్లాది

- చెరుకూరి సృజన
98486 64587



**మ**ద్రాసు పాండీబజార్‌లో ఒక పాత పుస్తకాల షాపులో నీరు కాయి పంచె, చొక్కా వేసుకున్న ఒక పెద్దాయన ఇంగ్లీషు పుస్తకాలు తిరగేస్తుంటే.. 'ఏమయ్యా ఆ ఇంగ్లీషులో పుస్తకాలు తిరగేస్తావెందుకు? అవి నీకేం అర్థమౌతాయి?' అంటే ఆ పెద్ద మనిషి నవ్వి తనకు కావాల్సిన పుస్తకాలు తీసుకొని వెళ్ళిపోయాడు. పి.వి. నర్సింహారావుకి 14 భాషలు, బూర్గుల రామకృష్ణరావుకి 8 భాషలు వచ్చునని గొప్పగా చెప్పుకుంటారు. రాహుల్ సాంకృత్యాయన్‌కు అనేక విదేశీ భాషలు వచ్చని తెలుసుకొని ఇంకా ఆశ్చర్యపోతాం. కాని అన్ని భారతీయ భాషలతో పాటు జర్మన్, ఇటాలియన్, నేపాలీ, గ్రీక్, ఫ్రెంచ్, బర్మీస్, చైనీస్, జపనీస్ లాటి మొత్తం 50కి పైగా భాషలపై పట్టు కలిగిన వ్యక్తి మన తెలుగువాడై ఉన్నాడు. ఆ పుస్తకాల షాపు నుంచి నవ్వుతూ వెళ్లినదే ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి.. పేరు మల్లాది రామకృష్ణ శాస్త్రి. తాళపత్రాలపై తనకు వచ్చిన భాషలన్నిటితోనూ సంతకం చేసి ఇవ్వమని ఒకసారి ఆరుద్ర అభ్యర్థించగా అలాగే తనకు వచ్చిన అన్ని భాషల్లోనూ సంతకం చేసి ఇచ్చాడట. ఇంకా కొన్ని భాషలు మిగిలి ఉండగానే ఆరుద్ర తెచ్చిన తాళపత్రాలు అయిపోయాయట.

గూడవల్లి రామబ్రహ్మం గారు 'పల్నాటి యుద్ధం' చిత్ర రచనకు సంబంధించి మల్లాది గారి సలహాల కోసం ఈయన్ని 1945లో మద్రాసుకు ఆహ్వానించారట. ఆ తర్వాత వివిధ సినిమాల్లో సుమారు 200 పాటలు తన పేరిట రాశాడు. 1952లో 'చిన్న కోడలు'తో ప్రారంభమై 1968లో 'వీరాంజనేయ' వరకు 39 చిత్రాలకు పాటలు రాశారు. తన పేరు మీద అని ఎందుకు రాయాల్సి వచ్చిందంటే మల్లాది గారు సీనియర్ సముద్రాల గారికి ఘోస్ట్ రైటర్ అనే విషయం సినిమా రంగంలో ఒక బహిరంగ రహస్యం. ఆ విషయమే ఎవరో సముద్రాల గారిని అడిగితే 'ఇందులో తప్పేముంది నాకు సమయం లేదు, మల్లాది గారికి డబ్బు లేదు' అని సమాధానమిచ్చాడట. అయితే ఈ విషయం ఎప్పుడూ మల్లాది గారు తన నోటితో చెప్పలేదు. దేవదాసు పాటలు ఆయనే రాశారని కొందరు అంటున్నా- ఆయనెప్పుడూ ఆ విషయం ప్రస్తావించలేదు. 1934 నుంచే కృష్ణా పత్రికలో చాలా సాహిత్య వ్యాసాలు రాశారు. అనేక నాటకాలు, కథలు రాశారు. ఆయన రచనలు 4 సంపుటాలుగా వెలువడ్డాయి. 'దుమువులు' అనే కథ 14 భారతీయ భాషల్లోకి అనువాదమైంది.

మల్లాది గారికి అనేక భాషల్లో పాండిత్యం ఉండటమే గాక జ్యోతిష, ఖగోళ, తర్క, న్యాయ, అలంకార, వ్యాకరణ, వేదాంత, నాట్య, సంగీత శాస్త్రాల్లో సాధికారికమైన ప్రవేశం ఉంది. ఆనాటి అగ్రశ్రేణి సాహిత్య పత్రిక భారతిలో అనేక విమర్శనా వ్యాసాలు రాశారు. కథలతో పాటు *కృష్ణాతీరం, తేజోమూర్తులు, బాల, గోపిదేవి, కేశీ గోపాలం, సేఫ్టీ రేజర్* అనే నవలలు, *చలవ మిరియాలు* పేరుతో ఒక శీర్షిక నిర్వహించారు. *సువర్ణ సుందరి, చివరకు మిగిలేది, విప్రనారాయణ, శ్రీకృష్ణ రాయబారం* వంటి సినిమాలు ఈయన రచనలే. సముద్రాల గారితో కలిసి *రత్నమాల, మనదేశం, లైలా – మజ్ను, స్వప్న సుందరి, బాలరాజు కథ* లాటి చిత్రాలకు రచనా సహాయం చేశారు. 'మేడలోని అలపైడి బొమ్మ', 'ఏమో తటిల్లత మేమెరుపు' లాటి పదాలు మల్లాదికి తప్ప ఎవరికి పడతాయి? 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్' పాటకు అర్థమేమిటని ఎవరో అడిగితే తాగుబోతోడి మాటలకు అర్థాలేమిటండీ? అన్నాడట.

మల్లాది గారు 1965 సెప్టెంబరు 12న చనిపోయినప్పుడు అనేక మంది ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పించారు. తాపీ ధర్మారావు గారు 'సినిమా పాటలకు కావ్య గౌరవం కల్పించిన మహాకవి మల్లాది' అన్నారు. ఇదే అభిప్రాయాన్ని శ్రీ శ్రీ కూడా వెలిబుచ్చగా, ఆయన శైలిలో అమృతాలు లొలికాదు అని దాశరథి అన్నారు. ఇంత గొప్ప విద్వత్తు ఉన్న వ్యక్తి మరోచోట ఇంకొంత విఖ్యాతుడయ్యే వాడు. ఎవరో అన్నట్లు 'మల్లాది గారు తెలుగువాడవ్వటం మన అదృష్టం, ఆయన దురదృష్టం'.

**(సెప్టెంబర్ 12 : మల్లాది రామకృష్ణ శాస్త్రి 56వ వర్ధంతి)** ■



# ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటానికి ప్రతిపక్షాల యత్నాలు

- తెలకపల్లి రవి

పెగాసస్ నిఘా, రైతు వ్యతిరేక శాసనాలు, కరోనా సంక్షోభం వంటి అంశాలపై ప్రజాస్వామికంగా చర్చ చేయలేక పార్లమెంటును ముందే వాయిదా వేసుకుని పలాయనం చిత్తగించిన నరేంద్రమోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మరో అస్త్రం సంధించాయి. దేశంలోని 19 పార్టీలు–వాటిలో కీలకమైన జాతీయ పార్టీలతో పాటు రాష్ట్రాలలో పాలన చేస్తున్న ప్రాంతీయ పార్టీలతో సహా ఆగష్టు 20న సమావేశమై మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాల మీద ఐక్య నిరసనకు శంఖం పూరించాయి. సెప్టెంబరు 20–30 తేదీల మధ్య దేశ వ్యాపితంగా ఈ నిరసనోద్యమం రాష్ట్రాలలో పరిస్థితిని బట్టి ఆయా శాఖలు నిర్ణయించుకుంటాయి. పార్లమెంటు ఉభయ సభలలో పారదర్శక చర్చకు పాతర వేయడమేగాక ప్రతిపక్షాలపై ఎదురు దాడికి దిగిన బిజెపి కి, కేంద్రానికి ఇది రాజకీయంగా ఎదురుదెబ్బే. మోడీ రెండవ సారి అధికారం లోకి వచ్చారు గనక బిజెపి కి మూడు వందల పైన స్థానాలు వచ్చాయి గనక ఇక ఎదురు వుండదని కలలు గన్న కాషాయ కూటమికి కనువిప్పు. కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆధ్వర్యంలో జరిగినప్పటికీ ప్రాంతీయ పార్టీలు, వామపక్షాల కీలక నేతలు పాల్గొనడం, 19 పార్టీలు నిర్దిష్టమైన ప్రజా సమస్యలపై ఆందోళనకు సంయుక్త ప్రకటన చేయడం ఈ సమావేశం ప్రాధాన్యత తెల్పుతుంది. ప్రతిపక్ష కూటమికి నాయకత్వం ఎవరిది వంటి అడ్డు సవాళ్లతో ప్రజలను తికమక పర్చడానికి జరిగిన వ్యూహాత్మక ప్రచార దాడి ఇకముందూ కొనసాగుతుంది. వాస్తవానికి ఆశీర్వాద యాత్రల పేరుతో ఇప్పటికే బిజెపి జాతీయ నేతలు కేంద్ర మంత్రులు దేశమంతా తిరిగేస్తున్నారు కూడా. అయితే వారు ఎంతగా ఎదురు దాడి చేసినా ప్రభుత్వ ఇరకాటం దాచేస్తే దాగని సత్యంలా ప్రజలకు అర్థమవుతూ వుంది. ప్రతిపక్షాలలో జాతీయంగానూ ఆయా రాష్ట్రాలలోనూ ఎన్ని తేడాలు వున్నా మోడీ సర్కారు నిరంకుశ పోకడలు పార్లమెంటులో ప్రస్ఫుటమైన తర్వాత ఉమ్మడిగా పోరాడటం అవసరమనే మెళకువ పెరుగుతున్నది. చాలా ప్రాథమిక దశలో వున్నా ఇది మాత్రం కాదనలేని నిజం.

### మరో మూడు సమావేశాలు

వాస్తవానికి సోనియా చొరవతో జరిగిన ఈ సమావేశానికి ముందు మూడు ఇష్టాగోష్టుల వంటివి జరిగాయి. వాటిలో పాల్గన్న పార్టీలలో కొన్ని అటూ ఇటుగా వున్నా ఈ ప్రక్రియ మాత్రం ముందుకు పోతూనే వుంది. వామపక్షాలు ఈ నాలుగు సందర్భాలలోనూ పాలుపంచుకోవడం బిజెపి మతతత్వం, నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా రాజకీయ కార్యాచరణ పెంచడంపట్ల వాటి నిబద్ధత వెల్లడైంది. మొదటగా ఎన్‌సిపి అధినేత సీనియర్ నాయకుడు శరద్‌పవార్ నివాసంలో ఒక చర్చ జరిగింది. ఎస్.పి, బి.ఎస్.పి, తెలుగు రాష్ట్రాల పార్టీలు తప్ప తక్కినవన్నీ హాజరైనాయి. ఈ సమావేశం ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తెర వెనక చొరవతో జరిగిందని చెప్పినా రాజకీయంగా పరిమిత సంకేతాలు ఇచ్చింది. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన అల్పాహార విందులో ప్రతిపక్షాలు చర్చలు జరిపి సభలో ప్రభుత్వ మొండి వైఖరిని ఎలా ధకొసాలో నిర్ణయించాయి. పార్లమెంటుకు సైకిళ్లపై వెళ్లి పెట్రోలు ధరల పెంపు పట్ల నిరసన ప్రకటించాయి. లోక్‌సభలో ఎలాగూ ప్రభుత్వం చర్చకు కాస్తయినా సిద్ధపడకపోవడం వల్ల నిరసనలతో ప్రకంపించింది. బి.సి లను నిర్ణయించే అధికారం రాష్ట్రాలకే పునరుద్ధరిస్తూ తెచ్చిన బిల్లును బలపర్చాలని

తీసుకున్న నిర్ణయం మేరకు దాన్ని ఎలాంటి వ్యతిరేకత లేకుండా ఆమోదించడం ద్వారా ప్రతిపక్షాలు తమ పరిపక్వతను ప్రదర్శించాయి. కాని ప్రభుత్వం మాత్రం తను ఉద్దేశించిన బిల్లులను బుల్‌డోజర్‌లా చర్చలేకుండా ముద్ర వేయించు కోవడానికే పాకులాడింది.

సాధారణంగా లోక్‌సభలో కాకున్నా రాజ్యసభలోనైనా కొంత చర్చకు అవకాశమివ్వడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతి. పైగా అక్కడ ప్రతిపక్షాలకే మెజార్టీ వుంది. అయినా సరే ప్రభుత్వం గాని చైర్మన్‌గా వున్న వెంకయ్య నాయుడు గాని కాస్త కూడా పట్టువిడుపులు ప్రదర్శించలేదు. నిబంధనల ప్రకారం చర్చను అనుమతించనే లేదు. సాధారణ బీమా బిల్లుపై కనీస ఏకాభిప్రాయం కూడా లేకున్నా రభసలోనే మమ అని ప్రకటించేసుకున్నారు. ఈ క్రమంలో సహజంగా నిరసన పెల్లుబికితే అదేదో మహాపరాధమైనట్టు, బిజెపి ఎన్నడూ సభల్లో ప్రతిష్టంభన సృష్టించనట్టు వెంకయ్య నాయుడు అదేపనిగా సూక్తులు, సుద్దులు వల్లించారు. కంటతడి పెట్టి కరుణ రసం కురిపించినట్టు కనిపించినా కఠోర చర్యలకు ఆదేశాలిచ్చారు. సభలో 12 మంది ప్రతిపక్ష సభ్యులు అవాంతరాలు సృష్టించారని ప్రభుత్వం చెబుతుంటే వెంకయ్యగారి సభాపీఠం ఏకంగా నలభైమందిపై ఆరోపణలు చేసింది. వీరిపై ఏదో చర్య తీసుకోవడానికి హడావుడి పడుతున్నది. ఇలాంటివాటి వల్ల సభ్యులు జంకేది వుండదు గాని ప్రభుత్వం స్వభావమే బహిర్గత మవుతుంది. పెగాసస్‌పై చెప్పేదేమీలేదని బుకాయించిన ఈ ప్రభుత్వమే సుప్రీం కోర్టులో భిన్నమైన అఫిడవిట్ దాఖలు చేసింది. పెగాసస్ వినియోగించలేదని అఫిడవిట్ వేయడానికి, కనీసం మౌఖికంగా చెప్పడానికి కూడా సిద్ధం కాలేదు. సైన్యానికి పెగాసస్‌తో సంబంధం లేదని సైనిక వర్గాలు ప్రకటిస్తే ఇది దేశ రక్షణకు సంబంధించిన సమస్య అని ప్రభుత్వం బుకాయించింది. ఇవి రెండూ ఎంత పరస్పర విరుద్ధమైన వాదనలో వేరే చెప్పాలా?

**కపిల్ సిబాల్ చొరవ**

ఈ పరిస్థితుల్లోనే కాంగ్రెస్ ఎం.పి సీనియర్ నాయకుడు కపిల్ సిబాల్ పుట్టిన రోజు పేరుతో అన్ని ప్రతిపక్షాలను విందు సమావేశానికి పిలిచారు. పై రెండు సమావేశాలకు హాజరవని సమాజ్‌వాది పార్టీ వంటివి ఈ విందుకు వచ్చాయి. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని ఇక్కడా అభిప్రాయం వ్యక్తమైంది. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో పొత్తుకు అవకాశం లేదని అంతకు ముందే చెప్పిన మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌కు ఈ ఎన్నికల్లో మద్దతునివ్వాలని సమావేశంలో కొన్ని వ్యాఖ్యలు వచ్చినట్టు చెప్పారు. ఈ సమావేశం ప్రతిపక్షాల మధ్య ఐక్యతా వాతావరణాన్ని మరింత ముందుకు తీసుకుపోయినట్టు పరిశీలకులు భావించారు. అయితే కాంగ్రెస్‌కు కాయకల్ప చికిత్సతో బలోపేతం చేయాలని వెంటనే సంస్థాగత ఎన్నికలు జరపాలని అంతర్గత పోరాటం చేస్తున్న జి23 బృందంలో కపిల్ సిబాల్ ఒకరు గనక ఈ సమావేశం ఆ పార్టీలో గాంధీల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిందనే వ్యాఖ్యలు కూడా వెలువడ్డాయి. రాహుల్‌గాంధీ సమావేశం కన్నా దీనికే ఎక్కువ స్పందన వచ్చిందనట్టు కొన్ని పత్రికలు రాశాయి. ఆ తర్వాత కాంగ్రెస్ మాజీ ఎం.పి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుమిత్రాదేవ్ పార్టీకి రాజీనామా చేసి టిఎంసిలో చేరారు. పాతవాళ్లు చేస్తామంటే వద్దంటున్నారు, యువత వెళ్లిపోతున్నారు అని కపిల్ సిబాల్ దానిపై వ్యాఖ్యానించారు. ఇలాంటి తరుణంలో సోనియాగాంధీ సమావేశం మరింత ప్రచారం పొందింది. పైగా జ్యోతిరాదిత్య సింధియా, జితిన్ ప్రసాద, ఇప్పుడు సుమిత్రాదేవి వంటి వారంతా నిష్క్రమించడంతో రాహుల్ బృందానికి గండిపడింది. కాంగ్రెస్‌కు ఆయనే నాయకుడవుతాడని ఒక వర్గం, కొత్త నాయకత్వం కావాలని మరో వర్గం బాహాటంగానే ప్రచారం చేసుకుంటున్నాయి. ఆ సమస్యను వారు అంతర్గతంగా పరిష్కరించుకోవలసిందే.

**ఐక్యత అవసరాన్ని చెప్పిన నేతలు**

సోనియాగాంధీ ఈ సమావేశంలో పార్లమెంటు పరిణామాలను ప్రస్తావించి, ప్రతిపక్షాలు ఆ తరహా సమన్వయం బయిట కూడా ప్రదర్శించాల్సిన అవసరం వుందని చెప్పారు. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై పోరాడుతూనే 2024 ఎన్నికలు ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని ఒక బాధ్యతాయుత ప్రజాస్వామిక ప్రభుత్వం తెచ్చుకోవడంపై ప్రణాళికాబద్ధంగా కృషి కేంద్రీకరించాలన్నారు. ప్రతిపక్షాల మధ్య ఐక్యతను కొనసాగించడానికి ఒక కోర్ గ్రూప్ వంటిది ఏర్పాటు చేయాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సూచించారు. మోడీ సర్కారు రాజ్యాంగ విలువలను ధ్వంసం చేస్తున్న పరిస్థితుల్లో దాన్ని కాపాడుకోవాలనే దానిపై ఎవరు ఏమేరకు నిలబడతారన్నది తేలుతుందని సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య లౌకిక విలువలపై నమ్మకం వున్నవారంతా ఒక తాటి పైకి రావాలని శరద్ పవార్ చెప్పారు. సమాఖ్య వ్యవస్థను కాపాడు కోవడానికి దేశవ్యాపిత పోరాటం అవసరమని తమిళనాడు సి.ఎం స్టాలిన్ చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడినప్పుడు కాంగ్రెస్ తరపున గతంలో అహ్మద్ పటేల్ ప్రతిపక్షాలతో సమన్వయం చేస్తుండేవారని ఇప్పుడు శరద్ పవార్‌కే ఆ పని వదిలేశారని చెబుతూ ఉమ్మడి కృషి అవసరాన్ని

బలపర్చారు. నాయకత్వం ఎవరిదనేది ఇప్పుడు సమస్య కాదని కూడా సమావేశంలో పాల్గొన్న నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ఢిల్లీలో పాలకపార్టీ అయిన ఆప్‌ను ఆహ్వానించలేదు గాని ఆ పార్టీ కూడా బిజెపిపై పోరాటం అవసరమని వ్యాఖ్యా నించింది. ఇప్పటివరకూ జరిగిన ఏ సమావేశంలోనూ పాల్గొనని బిఎస్‌పిని ఆహ్వానించలేదు. తెలుగు రాష్ట్రాలలో పాలక పార్టీలైన టిఆర్ఎస్, వైసీపీ, టిడిపి లు ఈ సమావేశాలలో పాల్గనలేదు. కపిల్ సిబాల్ విందుకు టిడిపి వైసీపీ ప్రతినిధులు కొందరు హాజరైనారనే దానిపై భిన్న కథనాలున్నాయి (మమతా బెనర్జీ జరిపిన ఒక వెబ్ సమావేశానికి టిఆర్ఎస్ ఎం.పి కేశవరావు హాజరయ్యారు. బిజెడి కూడా దూరంగానే వుంది). వివిధ పార్టీలకు ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్‌తో సంబంధాలు ఎలా వున్నాయనే దానికీ జాతీయ స్థాయిలో జరగాల్సిన ఈ ఉమ్మడి పోరాటానికి సంబంధం లేదని కూడా సమావేశంలో ఒక అభిప్రాయం వ్యక్తమైంది. ఇవన్నీ ఆచరణలో ఎలా పరిణమించేది చూడవలసే వుంటుంది. ఈలోగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి యాత్రకు ఏపి ముఖ్యమంత్రి జగన్ స్వాగతం పలకడంలోనూ రాజకీయ సంకేతాలు అందరూ గమనించారు. ఆయన మాత్రం తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలపై తీవ్రంగానే ధ్వజమెత్తారు. ఇదొక రాజకీయ వైపరీత్యం.

చిన్న చిన్న విషయాలు ఎలా వున్నా కాంగ్రెస్, వామపక్షాలు, ప్రాంతీయ పార్టీల ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు ఇంతమంది ఒక వేదికపై నుంచి దేశ ప్రజలను పీడించే 10 అంశాలపై ఉమ్మడి కార్యాచరణకు పిలుపునివ్వడం ఆహ్వానించ దగిన పరిణామం. ఉత్తర ప్రదేశ్‌తో సహా అయిదు రాష్ట్రాల ఎన్నికలు కూడా బిజెపికి పెద్ద సవాలుగా వున్నాయి. ప్రధాని మోడీ ప్రజాదరణ రేఖ ఆరు నెలల్లోనే 66 నుంచి 24 పాయింట్లకు పడిపోయిందంటే అసంతృప్తి ఎంత తీవ్రంగా వున్నదీ విదితం. ఈ ప్రజా స్పందనకు ఒక రూపం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతిపక్షాల పైనే వుంటుంది. దేశవ్యాపితంగా బిజెపి ప్రభుత్వ ఏకపక్ష పోకడలు, మతతత్వ వ్యూహాలు, కోవిడ్ తాకిడి వాక్సిన్‌ల కొరత, ఆర్థిక దిగజారుడు, ఉపాధి కొరత వంటి పది సమస్యల పరిష్కారంకై పది కోర్కెలతో ఈనెలలో ఈ పార్టీలు దేశవ్యాపితంగా జరిపే ఆందోళన ప్రభావం చాలా వుండబోతుంది. ఈ ప్రయాణం ఎంత సంక్లిష్టమైనా, ఎన్ని ఇబ్బందులతో కూడినదైనా ఇది ముందుకు సాగి దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఆశిద్దాం. ■



## కంటిచూపు

స్వేచ్ఛ నాకు తోడు కావాలి
నాకు రక్షణ నీడ కావాలి
గగన తలంలో గువ్వలా ఎగరాలి
అరణ్యంలో హరిణిలా పరుగులెత్తాలి
చేపపిల్లలా నీటిలో ఈదులాడాలి
అలనై ఆవలి ఒడ్డుకు పరుగులు తీయాలి
సీతాకోక చిలుకనై పూలను ముద్దులాడాలి
సెలయేరునై అలలతో పరుగులెత్తాలి
కలగా లోకమంతా విహరించాలి
వాయువునై ఆకాశయానం గావించాలి
ప్రతిఘటనే పరమావధిగా
ఆంగ్లేయుల్ని తరిమికొట్టినప్పటి స్వేచ్ఛ
ఊపిరిలో నిలుపుకోవాలి
స్వాతంత్ర్యనుభూతిని గుండెల్లో నింపుకొన్నప్పటి
కాంక్ష కళ్ళల్లో వెలగాలి
కలరా, ప్లేగు, మలేరియాల్ని మట్టుపెట్టి
జీవనం సాగించిన స్వేచ్ఛ జాగృతం కావాలి
సమూహంలో సమూహమై
జన ప్రవాహంలో ప్రవాహమై
విలయాల్ని దాటగల్గిన
స్వేచ్ఛా మలయమారుతం కావాలి
అన్ని వలయాల్ని ఛేదించి
స్వేచ్ఛాయుత జీవనమే ఆలంబమైన
స్వచ్ఛమైన స్వేచ్ఛ కోసం ఎదురుచూపు
స్వేచ్ఛే నాకు ప్రాణవాయువు
స్వేచ్ఛే నాకు కంటిచూపు
స్వేచ్ఛలేని జీవితం మరణమే కదా
స్వేచ్ఛాసుమాలు పూయని పుడమి మరుభూమి కాదా!

**- చిన్ని నారాయణరావు**
**94402 02942**

## మాట ముల్లు



**మా**టముల్లు గుచ్చుకుంటే
మనస్సు సూది గుచ్చిన గాలిబుడగవుతుంది
సంతోషం విరియకుండానే
వసివాడి రాలిపోయే పసిమొగ్గే..!

మాటలు తూటాలైపేలితే
పగిలిన గుండెల నిర్వేదం
నిశ్శబ్ద యుద్ధంతో
పలకరింపులేని బతుకు
పచ్చదనమెరుగని ఎడారి పయనమే...!
మాటల రంపాలు పదునెక్కి
బంధాలు నేలకొరిగి
నడిచే దారంతా శిశిరమై
బతుకుమాను చిగుళ్ళెరుగని మోడే...!

రేగే కోపాలు రగలేసిన మంటలు
వనమంతా తగలబడినాక
ఒంటరిగా మిగిలిన
మసిబారిన బతుకు చుట్టూ
ఏ పక్షీ కువకువలు వినిపించని
శ్మశాన నిశ్శబ్దమే..!

మాటరాయి విసరకు
పగిలిన గుండెముక్కలు
చెల్లాచెదురుగా పడి
నడిచే దారంతా ముల్లై గుచ్చుకుంటాయి ..!

- రజిత కొండసాని
73991 99099

## మట్టి చేతులు

**చూ**స్తున్నారా నిలబడిన చరిత్రను
కాలం వాగులా ప్రవహించి
నదిని అనుసరించి
సముద్రంలో ఒదిగినట్లు
పల్లె జీవనం నాగరికత నిర్మాణానికి
పునాదిరాళ్లై అడుగునే నిలబడ్డాయి!
నవ నాగరికులు నిలువెత్తు భవంతుల్లో
చలువ రాతి గోడల మధ్య
చల్లదనాన్ని సేవిస్తూ
చెమట అంటకుండా జీవిస్తుంటే
మట్టికి తమ శ్రమను కలిపి
మానవ జీవనానికి
ఆదిమ వాక్యం రాసినవాళ్లు
నిజ నాగరికతకు పురుడు పోసినోళ్ళు
వసంతాన్ని దోసిళ్ళతో పట్టి
పచ్చటి మొక్కలపై చల్లి ఆనందించే
అడవి మల్లెలాంటి వాళ్ళు
రేగడి నేలలో నక్షత్రాలను పండించి
ఆ ఆకాశానికి అతికించే వాళ్ళు
ఎండ వానను సమానంగా చూసే వాళ్ళు
ఆకలి మంటకు మందును కనిపెట్టినోళ్ళు
అదిగో వాళ్లే సరిగ్గా చూడండి!
పంటను పద్యంగా రాసుకుని
చేతులతో ఎంత హృద్యంగా పాడుతున్నారో!

- మూని వెంకటా చలపతి
73966 08221



కవిత

# పురా జ్ఞాపకం

- పద్మావతి



నీ రాజ్యానికొచ్చి
ఒకమారు జ్ఞాపకాల చెట్టును
దులిపినపుడు
ఒక అందమైన పువ్వులా
నా మనసు దోసిట్లో రాలిపడ్డావు
పొలమారిన ఆలోచనల్లో
ఎప్పటికప్పుడు నీ చిత్రం
గుండెకొలనులో కదలాడుతూనే ఉంది

పంచదార అద్దుకున్న
పసిదనపు తలపులన్నీ దృశ్యమాలికలై
కనుల ముందు
కవాతు చేస్తూనే ఉన్నాయి
పాత ఆల్బమ్‌లు తిరగేసినపుడు
అందులోని స్మృతులన్నీ
అత్తరు సీసాలా గదంతా ఒలికిపోయి
పరిమళభరితం చేస్తూ ఉన్నాయి

చిన్ననాటి గాఢమైన స్నేహాన్ని
ఒక గుర్తుంచుకోలేనంత
బలహీనమైన సంఘటనతో
ఒక్క ఉదుటన విరిచేసి
రెక్కలు మొలిపించుకుని
సుదూర తీరానికి ఎగిరిపోయావు!

నా గాయాలకు నువ్వు కట్టుగట్టడం
నన్ను నీడలా అనుసరించడం
నా మస్తిష్కంలో
సజీవంగా ముద్రపడే ఉన్నాయి
నీ పదునైన సంభాషణలు
నీకు గర్వవస్త్రాన్ని తగిలించి
నలుగురికీ దూరంగా విసిరేసేవి
నాపై నువ్వు కురిపించిన
మెత్తని పలుకుల వాన
ముత్యాలలా రాలిపడి సేదదీర్చేవి

అదంతా సరే కానీ
ఎప్పుడైనా మరపు మలుపులలోంచి
ఒకసారైనా నీ ఎదుటకు నడచివచ్చానా?
నువ్వు మాత్రం ఇప్పటికీ
అదే రూపురేఖలతో
నా కనురెప్పలపై పిట్టలా
వాలుతుంటావు తెలుసా
నీ తీరాన్ని చేరినపుడల్లా
నా చూపులు
సమూహాలను జల్లెడపడుతూ
నిన్ను ఆత్రంగా వెతుకుతూనే ఉన్నాయి

నాకు తెలుసు
నా ఆశ
సముద్రమంత విశాలమైనది
నీ అలక
వేసవి నేలపై
చిరు చినుకంత ఆయుష్షు లేనిది! ■




# హైకూల సమ్మోహనం పూలరేకులు

- చిత్తలూరి సత్యనారాయణ
82474 32521

Listen, real poetry doesn't say anything; it just ticks off the possibilities. Opens all doors. You can walk through any one that suits you అంటాడు జిమ్ మోరిసన్. అట్లాంటి ద్వారం కోసం వెతుకులాడుతూ వెళ్లే క్రమంలో, హైకూ ఏమిటి? ఆ కవిత్వమేమిటి? బషో ఎవరు? తెలుగునాట ఒక గాలి నాసర రెడ్డి ఎవరు? ఆ కవెవరు? ఈ కవెవరు? ఇంకో కవెవరు? అంటూ తెలుగు సాహిత్యంలో ప్రశ్నలు వేసుకుంటూ బయల్దేరిన నాలాంటి ఒక సాహితీ పిపాసికి హైకూ కవితల తేటనీటి చెలిమెలా ఎదురై గుండెలతో తోడుకోమంటుంది ఒక నిఖార్సయిన కవితా హృదయం.

ప్రకృతిని ప్రేమించగలవాడు మాత్రమే ఆ ప్రకృతిలోని మనిషిని ప్రేమించగలడు. మనిషి చుట్టూ లతలా అల్లుకున్న పరిమాళాన్ని ప్రేమించగలడు. పరిమళాన్ని పంచిపెట్టే మృదువైన పసిపిల్లల చర్మంలాంటి మృదువైన పూలరేకులను మెచ్చుకోలుగా శిరస్సుపై చల్లుతూ పచ్చదనాన్ని నిర్మిస్తూ పోతూ కొత్త లోకాలను పరిచయం చేయగలడు. అతడే కవి. కవితా హృదయమున్న ఒక విమర్శకుడిగా ఎదురుపడ్డ నాకు గుండెదోసిలి నిండా కొన్ని పూలరేకులు పట్టుకునొచ్చి, ఒకసారి ఆస్వాదించి చూడరూ! అన్నవాడు ఈ మోహన సమ్మోహనుడు, మోహన్ రాం ప్రసాద్. కొంతమంది వ్యక్తులను చూసినపుడు, నాలుగు క్షణాల సంభాషణయినపుడు, మాటనచ్చో, పాట నచ్చో, మనిషిరూపం నచ్చో, మనసు చూపిన కాసింత ప్రేమనచ్చో ఇష్టపడతాం. కానీ మోహన్ రాం ప్రసాద్ అనే కవిని మాత్రం నేను అతని హైకూని చూసి ఇష్టపడ్డాను. రసప్లావితమైన మా ఊరి లేలేత తాటి ముంజల్లాంటి మధురమైన రుచుల హైకూలు కావాలంటే విజయవాడ నగరంలోని ఈ హైకూ సమ్మోహనుడిని కలవాల్సిందే. అతని హైకూలను వినటానికే పని కల్పించుకుని మరీ వెళ్లి అతని ఎదురుగా అతని చాంబరులో, హైకూ అనగానే తప్పక యాదిలోకొచ్చే మరో ఆత్మీయ కవి మిత్రుడు శిఖా ఆకాశ్.. ఏరూ ఎన్నెలను వెంటేసుకుని నాతో కలిసి వచ్చి, మరికొంత మంది ప్రజా సాహితీ మిత్రులతో కలిసి ప్రసాద్ చాంబర్‌లో కూర్చుని హైకూ కవిత్వమై పురి విప్పుకున్న సందర్భాలు అనేకం. కాసేపు అతని ఎదురుగా కూర్చుంటే మనమూ హైకూ కవుల్లా మారిపోయిన క్షణాలు మనల్ని పక్షి ఈకల్లా గిలిగింతలు పెడతాయి. చిత్తలూరి అనే కవి హైకూలు సృజించటం వెనుక మోహన్ ప్రేరేపించిన హైకూ కవితపై ఇష్టం మరచిపోలేనిది. 'మా ఊరి హైకూ'లంటూ అబద్ధమాడి నా ఊరిని నాకు పరిచయం చేసిన హైపవర్ హైకూ కవి ఈ మోహనుడు. 'ఆమెలు' అంటూ హైకూలు వినిపించి ఆమె మృదుత్వాన్ని ఈ పూలరేకుల్లో మరింత వెతుక్కోమని హైకూల పూలతోటనే తెచ్చి దోసిలి నింపిన హైకూ ప్రేమికుడు. బహుశా అట్లాంటి ఒక కవితాస్వాదనా సమయం, అట్లాంటి ఒక హైకూ కరస్పర్శ నా హృదయ కాసారంలో ఇంకా చేపపిల్లయి ఈదులాడటమే కావచ్చు. ఒక కవిని పరిచయం చేయటం కన్నా ఒక నిలువెత్తు హైకూ కవితను పరిచయం చేయటం ఎంత గొప్పగా వుంటుంది మరి. గాలికి పూల రేకులను ఒకచోట చేర్చి కవితా పుష్పంగా మలిచి

తాత్వికతా అంతస్సారాన్ని మన కనురెప్పలకు గంధంలా పూయగలిగిన ఒక నేర్పరితో సంభాషించినట్టుగా వుంటుంది. అట్లాంటి హైకూ సమయాలను అలవోకగా కల్పించి ఇన్నాళ్లకు పుస్తక పుష్పంలో పేజీల రేకులుగా వికసింపచేసి సమాజంలోకి స్వాగత ద్వారాలు తెరుచుకుని మధ్యలో తటాలున ఒక కిటికీ రెక్క తెరిచి అతని పూల రేకులకు పరిచయ సింహద్వారాన్ని తెరిచే అవకాశం నాకు కల్పించటం.. వెతకబోయిన హైకూ పూలతీగ గుండెలకు తాకినట్టయింది.

దారి చేసుకుంటూ పూలరేకుల్లోకి విమర్శ చొక్కాను తొడుక్కుని అనుభూతించే హృదయాన్ని రెక్కల మీద పుప్పొడి నూగులా పులుముకుని ప్రవేశించిన అనేక రంగుల్లో, అందమైన సౌష్టవక్రమంలో పూలరేకులు దర్శనమిచ్చాయి. ఒక్కొక్క రేకు గురించి రాస్తూ పోతే వాటి పరిమళాన్ని అంచనా వేయటానికి మరిన్ని పూలరేకుల పుస్తకాల పుష్పగుచ్ఛాలు కావాల్సొస్తుందేమో. అయితే ఒక్కో రేకును స్పర్శిస్తూ పోతే ఒక్కో రసానుభూతి కలుగుతుంది. ఒక రేకును ముట్టుకుంటే జీవితం పుప్పొడిలా అంటుకుంటుంది. మరో రేకును ముట్టుకుంటే మట్టి గంధంలా మునివేళ్లకు చుట్టుకుంటుంది. ఇంకో రేకును తాకితే పరిమళం గుప్పుమని గుండెలను తాకి మనసు శుద్ధి చేయబడుతుంది. కాకపోతే పూలరేకుల్లోకి తుమ్మెదలా మెత్తగా, విశాలంగా దూరగలిగే ఓర్పూ, నేర్పూ, అంతకుమించిన హృదయ వైశాల్యం అవసరమవుతుంది. అందుకే M.H Abrams అంటాడు : If you read quickly to get through a poem to what it means, you have missed the body of the poem అని. పూలరేకుల్లోకి ప్రవేశించాక ఉక్కిరిబిక్కిరవుతూ పరిమళాల్లో ఈదులాడుతూ, కొమ్మలని, రెమ్మలని కొమ్మలకూ రెమ్మలకూ మధ్య శూన్యాన్ని భర్తీ చేస్తూ తిరిగే రంగు రెక్కల నేస్తాలకు, పిల్లల పూల నవ్వుల్లా విహరించే పిల్లగాలి తెమ్మెరలకూ మధ్య వున్న అనుబంధాన్ని మనిషిగా కొలవగలిగే అద్భుత కవి సమయాలు ఎదురొచ్చి కౌగిలిస్తాయి. అనేక రంగుల్లో, జీవన పార్శ్వాల్లో ఒదిగి మృదు మధురంగా ఒక కవితా జలపాతంగా మనసు తలారా స్నానించినట్టే అవుతుంది. ఒక రేకు మన హృదయాల్ని ఎలా తాకుతుందో చూడండి.

'మోదుగు పూలు/ పచ్చని వసంతాన్ని/ మోసుకొచ్చాయి'... చూశారా కవి చమత్కార దృశ్యరూపం. మోదుగుపూలు ఎర్రగా కణకణమండే నిప్పుకణికల్లా ఎర్రని ఎండల్లో దర్శనమిస్తాయి. అట్లాంటి మోదుగుపూలు పచ్చని వసంతాన్ని మోసుకొచ్చాయని చెప్పటమే కవి చమత్కారమిక్కడ. ప్రకృతి పచ్చగా వుంటేనే ఏ రంగు పూలైనా ప్రాకృతిక సౌందర్యమై మనల్ని చుట్టుముట్టేది. ఇంకాస్త తాత్విక లోతుల్లోకి వెళ్లగలిగితే మోదుగుపూల చుట్టే కాదు, పచ్చని మోదుగాకుల చుట్టూ పరుచుకున్న జీవితంలో ప్రవహించినవాడిగా నాకనిపిస్తుందేమిటంటే, విప్లవ చైతన్యానికి, పోరాట భావస్ఫూర్తికి తెలంగాణ పురిటిగడ్డ మీద ప్రతీకలుగా శిరసెత్తిన మోదుగుపూలు నియంతృత్వంపై పోరాటానికి ప్రతీకగా అనుకుంటే తద్వారా లభించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల జీవితమే పచ్చదనంగా చెప్పిన భావన కలుగుతుంది.

మరో రేకు చెపుతుందీ... 'నల్ల చామంతి/దేవుడు ఎదురైతే/ వేయి ప్రశ్నలు'... అవును చామంతులన్నాక తెల్లగానో, లేత ముదురు పసుపు వర్ణంలోనూ వుంటాయి కదా! ఈ నల్ల చామంతులేమిటి? అనే ప్రశ్న గుండెల్ని తొలుస్తుంది. అవును ఒక కవి హృదయాన్ని మరో కవి మాత్రమే తాకి మరో కవితా వాక్యంగానో, మేటియైన హైకూ పూలరేకుగానో వికసింప చేయగలడు. చిత్తలూరి అనే కవి నలుపు ధిక్కారానికి, నిరసనకీ, శ్రమల జీవితానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా తీసుకుని మొత్తంగా శ్రమల పల్లెతల్లులు స్త్రీలు నల్లచామంతులు, ఉద్యమబాటలో విరబూసిన తన తెలంగాణ నల్లచామంతి అనే అర్థంలో అచ్చేసిన కవితల పుస్తకం పేరు నల్లచామంతిని గుర్తుకు తెచ్చి హైకూ గౌరవం కల్పించటం విశాల హృదయం కలిగిన మోహన్ రాం ప్రసాద్‌కే సాధ్యం. ఎక్కడి కవితా వాక్యాన్నయినా గుండెలకత్తుకోగలిగే కవే మరింత విశాలం కాగలడు. అందరు మెచ్చిన హైకూ పూలరేకై పరిమళించగలడు.

ఇంకో రేకు మనసు చెవిలో ఏదో ఊదుతోంది... 'పువ్వు రాలింది/ వేల జాపకాలను/ తుమ్మెదకిచ్చి' ..... ఎంతటి రసార్ద్ర హృదయముండాలి ఇంత కవిత్వం కావటానికి. ఈ హైకూ చదవగానే మెరుపులాంటి ఒక భావపరంపర పువ్వు త్యాగ రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేని తుమ్మెద సావాసం గుర్తుకొచ్చి గుండెల్లో ఎక్కడో చిన్న పూల రేకు గుచ్చుకున్న భావన కలుగుతుంది. రాలిపోయేలోపు పువ్వు తుమ్మెదకు ఎన్ని జాపకాలను మిగిల్చి వెళుతుంది. వేల జ్ఞాపకాలను పంచి ఇచ్చి నిశ్శబ్దంగా వెళ్లిపోయే పువ్వుల్లాంటి మనుషులూ ఉంటారు. ఇక్కడ తాత్విక కోణాన్ని స్పృశిస్తే, పువ్వుల త్యాగగుణానికి, అవి జీవితానికి సరిపడే పరిమళాలను పంచి మనల్ని వెలిగించే మన మహత్తర జీవన సమయాలకి స్త్రీలు ప్రతీకగానూ

క్షణంపాటు మనసులో పూలరేకుల్లా కదులుతారు. ఈ పూలరేకులు చదివి పూల జలపాతంకింద తడిసి ముద్దయ్యే అవకాశం మీదే. పూలరేకుల వానలో తన్మయంగా చిందులేసే ఈ కవి సమయమూ మీకే సొంతం. ఈ అద్భుతమైన రసాస్వాదనలో ఓలలాడుతూ ముందుకు సాగిపోయే హైకూ కవితా ప్రియులకు పువ్వును కానుక ఇవ్వమంటే ఈ కవి ఏకంగా పూలతోటనే బహుమతిగా ప్రకటించిన ఆనందం కలుగుతుంది. రంగూ రుచీ వాసన ఆస్వాదించదగినంత పరిమాణంలో అడుగడుగునా కనిపిస్తుంది. మనల్ని మురిపిస్తుంది. లోలోపలికి తీగసాగుతాం. ఊహించని భావ పరిమళాలతో ఉద్వేగానికి లోనవుతాం.

అయితే కవితా నిర్మాణం పట్ల పూలరేకుల సౌష్టవాన్ని ఆదర్శంగా తీసుకుని అల్లికలో ఒక క్రమ పద్ధతి నిర్మాణం కోసం కొన్ని పదాలను అక్షరాలుగా కుదించి నిర్మించిన తీరు కనిపిస్తుంది. తెలుగు హైకూకు ఇమడని విదేశీ కొలతల చొక్కా (అక్కడి మాత్రలను ఇక్కడ అక్షరాలుగా కత్తిరించుకుని) తొడిగి విఫలమవుతున్న అనేకమంది హైకూ కవులను ఆశ్చర్యచకితుల్ని చేసే నిర్మాణ ప్రతిభా పాటవం మోహనుడిలో పుష్కలంగా గమనిస్తాం. అయితే కొన్నిచోట్ల రూప శ్రద్ధ అంతస్సారాన్ని పక్కకు నెట్టేస్తున్న భావనా కలుగుతుంది. నిర్మాణ కొలతలు ముఖ్యమా? నిజమైన భావ సంపత్తి ప్రధానమా? అని బేరీజు వేసుకునే క్రమంలో కొలతలతో కూడిన రూపం కోసం సారాన్ని కుదించుకునే స్థితికి వెళ్లకూడదనేది కవుల గమనంలో ఉండాలి. అయితే మోహన్ రాం ప్రసాద్ లాంటి బలమైన హైకూ కవులు కొందరు నిర్మాణం విషయంలోనూ నిక్కచ్చిగా వ్యవహరిస్తూ కవితా సృజన చేస్తున్న విషయాన్నీ గమనించాలి. అట్లాంటి ప్రయత్నపూర్వక ప్రయత్నమే ఈ పూలరేకులు అనిపిస్తుంది. పూల నిర్మాణ సౌష్టవం ఒక క్రమపద్ధతిలో వుంటుంది అనే భావనకు కట్టుబడి ఈ కవితా రేకులను కూడా ఒక క్రమపద్ధతిలో కూర్చి నిర్మించిన తీరు ప్రశంసనీయమే. అయితే నిర్మాణం కోసం కవితాత్మ చెదిరిపోయే సందర్భాలు కూడా తప్పక వుంటాయి. అట్లాంటి స్థితిని చాలావరకు అధిగమించగలిగిన కవి మోహన్ రాం ప్రసాద్. అందుకే అంటాను : ఇతడు హైకూ సమ్మోహనుడని. రూపమే కాదు, అంతస్సారమూ అంతే బలంగా పరిమళీకరించబడి అందంగా కూర్చబడిన ఈ పూలరేకుల్లోకి పాఠక తుమ్మెదలారా, ప్రవేశించండి. ఒకానొక రంగులమయ ప్రపంచం, మెత్తని పూలపొత్తిలా తాకి మీ హృదయాల్ని పరిమళభరితం చేస్తుంది.

■



## ఆమెలో నేను...

గంపనిండా బాధల్ని మోస్తూ...
గుండె నిండా నిజాల్ని దాస్తున్నా...
ఆకాశమంత మనసే వున్నా
అన్నీ చుక్కల్లాంటి మచ్చలే నాకు!

కాలపు ముళ్ళబాటపై
శూన్యపు నిందల్ని మోస్తూ...
బతుకు జట్కాబండిని
అందరుండి ఎవరూ లేని
పంజరంలోని చిలుకలా లాగుతున్నా!

యవ్వనపు ఆశల వలయంలో
కామపు తొడుగులను చింపేస్తూ...
దరిద్రపు నా సమాజాన్ని ఉమ్మేస్తూ...
నిగుడుకున్న ఆ రెక్కల ఈకలను పీకేస్తా!

మట్టిలాంటి దేహమనుకుంటూనే
మట్టిని ముద్దచేయాలనుకునే క్రూరపు దురాశలలో
వందేళ్ల జీవితంపై పడగను విప్పాలనుకుంటే...
నిలువెల్లా విషాన్ని నింపుకున్న నిన్ను తోడేస్తా!

ఎన్నో దాహపు కోరికల నడుమ
ఒక్కొక్క రోజును యుద్ధంలా జయిస్తున్నాను!
వేల వేల కనుచూపుల కుత్తుకలను తెగనరుకుతూ...
నాకంటూ వెలుగు దారి పరుచుకుంటూ...
రేపటి తొలిపద్దుకు అంకురిస్తాను!

- కుంచె శ్రీ
99088 30477

## రైతు నానీలు

- పుట్టి గిరిధర్

94914 93170

ఆరుద్ర పురుగు
వాలింది
బతుకుపంటకు
తిలకం దిద్దింది!

రైతు
లోకాన్నేలే రుద్రుడు
మట్టిగొంతులో
కన్నీళ్లను దాస్తాడు!

వ్యవసాయం
యుద్ధక్షేత్రమే
పశుగణాలు
చతురంగ బలాలు!

రైతుకు పంటకు
పేగుబంధమే
ముడిపడేలోపు
ఒడి తిరుగుతుంది!

ఉరితాడు
బిగించుకున్నా
రైతు రైతులానే
పుట్టాలనుకుంటాడు!



■



## ఎన్ని దుఃఖాలు ముసురుతున్నా...

కాలం కనుబొమల మీద
అలల్లా పరిచయాలు కదులుతుంటాయి
కొన్ని లెక్కలు సరిపడి ముడిపడతాయి
కొన్ని నిజాలు జారిపడి వేరుపడతాయి
కృత్రిమ పరిమళాల మధ్య
బంధాలు నలిగిపోతున్నాయి

కొన్ని ఆర్థిక తూకాల్లో తేలియాడుతుంటాయి
ప్రతి చిరునవ్వు వెనుక
ఒక వినియోగపు ప్రణాళిక పరచుకుంటుంది
అంతా పరాయీకరణలో
విలవిలలాడుతున్నాం
ఒంటరి పోరాటంలో
అవాంతరాల మధ్య శక్తిగా వెలగటం
కార్య దీక్షకు సాక్ష్యం పలుకుతుంది


సంతోషం పూయిస్తూ
ప్రయత్నాలు నడిపిస్తూ
ముందుకు ఉరకటమే ఆదర్శం
ఎన్ని దు:ఖాలు ఇంకా ముసురుతున్నా
కాగే లక్ష్యం మీద
వేగే అడుగుల పరుగులు తీస్తుంటాయి
కలలు పూసేవరకూ...!

- గవిడి శ్రీనివాస్

70192 78368

## వెల్‌డన్.. మైసన్!

- వేణు మరీదు
85550 53547



ఒకరోజు
నా బిడ్డ నోరెత్తాడు
'నోర్మూసుకోరా'
అని హెచ్చరించా
నోరు మూసుకున్నాడు

ఇంకో రోజు
నా బిడ్డ కళ్ళు విప్పాడు
'చూడకు. ముయ్ రోయ్!'
అంటూ గద్దించా
కళ్ళు మూసుకున్నాడు

మరో రోజు
వాడి మనసూ మూసా
వాడి మెదడూ కప్పేసా
వాడు పొద్దున్నే లేచి
సూర్యోదయం చూస్తేనో!?
ఎరుపు తూరుపుకి
నలుపు పరదా వేసా!
వాడి బతుకుకంతా
చక్కటి చీకటి బీమా చేశా!

కానీ ఈరోజెందుకో...
నోరు మూసిన
కనులమూసిన
మెదడు మూసిన
ఎడద మూసిన
చీకటి మూసిన...
నా బిడ్డడు వాడు
పిడికిలి తెరిచాడు!
మూపించే లోపే
ఒక్కటే గుద్దాడు!

నా ముఖం ఈ భూమిపై
ఉగ్రంగా పాతిన
తొలి ఎర్ర జెండాలా
నిట్రంగా నిలబడి
ఇంకా రుధిరాన్ని
కురిపిస్తూనే ఉంది!

■

## 'సోమేపల్లి' పురస్కారాలకు చిన్న కథలకు ఆహ్వానం

జాతీయస్థాయి తెలుగు చిన్న కథల పోటీలను సోమేపల్లి సాహితీ పురస్కారాల కమిటీ ప్రకటించింది. అత్యుత్తమ కథకు రూ.2500, ఉత్తమ కథకు రూ.1500, మంచి కథకు రూ.1000, ప్రత్యేక బహుమతులు రూ.500 చొప్పున ఇద్దరికి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పురస్కారం కోసం పంపే కథల నిడివి రాతప్రతిలో రెండు నుంచి 4 పేజీలలోపు, డిటిపిలో 2 పేజీలకు మించరాదు. ఒకరు ఎన్ని కథలైనా పంపవచ్చు. కథ పుటలపై రచయిత పేరుగానీ, ఆయా వివరాలు గానీ వుండకూడదు, కథలను సెప్టెంబర్ 30, 2021 తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండో అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001 (సెల్:9247475975) అనే చిరునామాకు పంపాలి.

– సోమేపల్లి వెంకట సుబ్బయ్య,
చలపాక ప్రకాష్




# మురికి మనుషుల మూల వేదన
# 'అశుద్ధ భారత్'

- బడుగు భాస్కర్ జోగేష్
98666 02325

**మా**నవత్వం కొరవడిన మనిషి వికృత రూపం ఇది. పురోగామి కాలం ఏ ప్రభావం చూపలేకపోయిన పరమ జుగుప్సాకరమైన వృత్తి ఇది. ఆధ్యాత్మికతలు ఆపాదించి ఇంకా ఆ వృత్తిలో మురిగిపోయేందుకు అవసరమైన కుట్రలు కుమ్మరించ బడుతున్న కాలం ఇది. ప్రగతిశీల పోరాటాలు, దళితోద్యమాలు తమ సమీపం నుంచి దాటిపోయినా తమ మూగ గొంతుల్ని తామే విప్పుకుంటున్న వాస్తవ స్థితి ఇది. తాము చేసే పనిని మానేయటమే పోరాటమైన పరమ పీడిత కులం ఇది. ప్రభువులు మారి ప్రభుత్వాలు వచ్చినా, ధర్మశాస్త్రాలు పోయి రాజ్యాంగం వచ్చినా.. ప్రగతి లేని అవస్థల అస్తవ్యస్త వ్యవస్థ ఇది. దాచబడ్డ భారతాన్ని విప్పిచూపుతున్న విమోచక ఆకాంక్ష ఇది. ఆధునిక భారతం సిగ్గుతో తల వంచుకోవల్సిన సందర్భమిది.

మధ్య యుగాల్లో ప్రారంభమై నేటికీ యథాతథంగా కొనసాగుతున్న పాకీ పని వారి ఆత్మ ఘోష ఇది. వివిధ రాష్ట్రాల్లో ఈ పని చేసే వాళ్ళ అనుభవాలు, ఆవేదనలు, ఆకాంక్షల సమస్త సమాహారం ఇది. ప్రముఖ జర్నలిస్టు భాషా సింగ్ 'అన్ సీన్' – 'ద ట్రూత్ ఎబౌట్ ఇండియన్ మాన్యువల్ స్కావెంజింగ్'గా ఇంగ్లీష్‌లో ప్రచురించిన ఈ పుస్తకాన్ని ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి కె.సజయ తెలుగులోకి అనువదించగా హెచ్‌బిటి ప్రచురించింది.

ఈ పుస్తకం మన పక్కనే కొనసాగుతున్న దుర్నీతిని ప్రశ్నిస్తుంది. ఒక మనిషి విసర్జితాలను మరో మనిషి చేతులతో ఎత్తి నెత్తిన మోసే వికృత రూపాన్ని మనకు ఎత్తి చూపుతుంది. శుభ్రం చేసే పనిలో ఒకే సామాజిక వర్గానికి చెందినవారు వేల ఏళ్లుగా కొనసాగటంలోని కుళ్ళుని ఎలుగెత్తి చాటుతుంది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పశ్చిమ బెంగాల్ నుంచి ఉత్తర ప్రదేశ్ వరకు కాశ్మీర్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు దేశంలోని 12 రాష్ట్రాల్లో పర్యటించి స్వయంగా ఆ పనివారినీ, ప్రాంతాలను చూసి వారి గుండె లోతుల నుంచి కట్టలు తెంచుకు వస్తున్న ఆగ్రహాన్ని, కన్నీళ్లను ఈ పుస్తకంలో నమోదు చేశారు భాషాసింగ్.

పెళ్లికి పెట్టిన గోరింటాకు చెరిగిపోకుండానే చీపురు పట్టి, దొడ్లు ఊడ్చవల్సిన స్థితికి నెట్టబడిన నవ వధువును గురించి, చేతులకు తొడుగులుండటాన్ని కూడా కలగనే 'నీరా' వంటి నిస్సహాయ ముదుసలి గురించి, పాలకులు పలికే ఆధ్యాత్మికత ముసుగులు, కర్మ సిద్ధాంతపు వల్లెవేతల్లోని దాగిన కుట్రల గురించి ఈ పుస్తకం వివరిస్తుంది.

'కులం అనేది దైవదత్తమైన అంశమని అది మన చేతుల్లో లేదని', చెప్పటానికీ, ఎన్నో దశాబ్దాల నుంచి నిర్బంధంగా ఆపాదించిన ఈ అమానవీయ వృత్తిని 'స్వచ్ఛకార్' అని అనటానికీ, స్వభావంలో లేని మృదుత్వాన్ని ఆపాదించే కుట్రపూరిత ప్రయత్నాలకీ, ఎల్లవేళలా బాధితుడికి మాత్రమే వర్తింపచేసే సభ్యతా సూత్ర సూక్తిముక్తావళికీ పెను సవాల్ విసురుతున్నారు. తమ పని పట్ల అప్రజాస్వామిక అభిప్రాయాలు వ్యక్తం చేసిన మోహన్ దాస్, మోడీల వ్యక్తిత్వాలను సైతం వారు చర్చకు పెడుతున్నారు.

ఆధ్యాత్మికత ముసుగులో మరికొన్ని తరాలను ఈ అపవిత్ర వృత్తిలో కొనసాగేలా చేసే ఈ ఎత్తుగడలో గల మార్మిక భాషని సేవక కులాలుగా అరిగిపోయిన తమ భుజాలు మోసేందుకు సిద్ధంగా లేవని స్పష్టం చేస్తున్నారు. కుళ్ళిన మానవ

మలమూత్రాల్లో మునిగి తేలుతూ వర్ధిల్లే ఈ విషపూరితమైన వ్యవస్థ'ను వారు అసహ్యించుకుంటున్నారు. భారతీయ సమాజపు గరిష్ట హింసాత్మక ప్రవృత్తి నమూనాను గర్హిస్తున్నారు. ఈ సమాజానికి తాము అందించిన అసామాన్య సేవలకు భారతీయ శిక్షాస్మృతులు వేసిన అసహ్యకరమైన దండన ఇంకా ఎంతకాలమని ప్రశ్నిస్తున్నారు. వనవాసాన్ని సైతం శిక్షగా భావించే వారు ఈ అసహ్యకరమైన పనిని చూస్తే భీతావహులవుతారు. వృత్తికీ శిక్షకూ వ్యత్యాసం చెరిగిపోయిన వారి దుస్థితిని చూసి కలత చెందుతారు. ఈ నిర్బంధ వృత్తి మూలంగా గర్భస్రావాలు, అంగవైకల్యపు పిల్లలు, ఆస్మా, చర్మవ్యాధులు, క్షయ, కలరా, న్యుమోనియా, కామెర్లు, ఊపిరి తిత్తుల కాన్సర్ వంటి రోగాలను ఆకస్మిక మరణాలను బహూకరించిందని మధనపడుతున్నారు. ఈ పని మూలంగా 'శరీరం మొత్తం ఒలిచేసుకోవాలనీ, ఒళ్ళంతా కత్తితో చెక్కేసుకోవాలని' అనిపిస్తుందనీ ... ఏ వ్యధాభరిత జీవితం నుంచి ఇలాంటి ఏహ్యభావం రేకెత్తుతుందనీ అడుగుతున్నారు. తరాలుగా ఒక్క అడుగు ముందుకు వేయలేని అశక్తత నుంచి, అసహ్యం నుంచి తమ మనసు ఆక్రోశిస్తుందనీ చెబుతున్నారు.

సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం మహెంజాదారోలో నీటి వసతితో కూడిన టాయిలెట్లను వినియోగించిన దేశం ఈ ఆధునిక కాలంలో ఇంకా ఆ అదిమ దశకైనా చేరుకోలేక పోవడంలోని లోగుట్టును బయల్పరుస్తున్నారు. ఈ పని తమను మాత్రమే అంటరాని వారిని చేయడం లేదనీ తమ పిల్లలను సైతం చదువుకు, ఆర్థికాభివృద్ధికి, ఆరోగ్యానికి అంటరానివారిని చేయటం పట్ల ఆందోళన చెందుతున్నారు. పిల్లలపై తమ పని ప్రభావం పడకుండా పోవాలనే వారి ప్రగాఢ ఆకాంక్ష పాఠశాల దశలోనే ముగిసిపోతుండటం పట్ల అంతులేని ఆవేదన అనుభవిస్తున్నారు. స్కూల్‌కి వచ్చే పిల్లల అశుద్ధాన్ని కూడా తమ పిల్లలతో ఎత్తించటం, బడిలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ పిల్లలు ప్రతిభను ప్రదర్శించే అవకాశమే లేకుండా చేయటం ద్వారా తమ పిల్లలను పాఠశాలకు దూరం చేస్తున్న వాస్తవాలను ఆవేదనతో వెల్లడిస్తున్నారు. పర్యవసానంగా తమ భవిష్యత్ తరాలు కూడా ఈ వృత్తి ద్వారానే జీవించాల్సిన రావటం పట్ల వారు అంతులేని వేదనను అనుభవిస్తున్నారు. ఈ పని నుంచి తమ తర్వాతి తరాలనైనా విముక్తం కావాలని వారెంతగా పెనుగులాడినా ఫలితం లేకపోవటం పట్ల నిర్వేదానికి లోనవుతున్నారు. తమ గౌరవాలను కూకటివేళ్ళ నుంచి పెకలించివేస్తున్న వైనాన్ని విడమర్చి చెబుతున్నారు.

తమ లాభదాయక పనుల్లో కాస్త వాటా తగ్గితే రిజర్వేషన్ల గురించి విరామమెరగకుండా విలపించే వాళ్ళు ఈ పనికి సంబంధించిన నూరు శాతం రిజర్వేషన్లలో ఎప్పుడూ వాటా అడగరేమని ప్రశ్నిస్తున్నారు. 'దేవతాగణంలో ఏ ఒక్కరూ మా కోసం అవతారమెత్తి సహాయం చేసింది లేదనీ.. తమ కష్టాలను చూస్తూ కూడా దేవుడు ఖాళీగా గుడిలో కూర్చునే ఉంటాడు ఏమీ చేయడని' వివరిస్తున్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ పని కోసం వినియోగించి తమనీ పని నుంచి విముక్తం చేయాలనే దిశగా కనీస చర్యలు చేపట్టక పోవటంలోని ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యాన్ని పట్టిచూపుతున్నారు. స్వతంత్ర భారతావని ముందు మనమంతా దేశభక్తిలో మునిగితేలుతున్నప్పుడు వాళ్ళు నల్లబ్యాడ్జీలు ధరించి 'పాకీ పని నుంచి తమకు స్వతంత్రం కావాలని' నినదిస్తుంటే వారిని కొందరు దేశద్రోహులుగా భ్రమించవచ్చు కానీ, దశాబ్దాల క్రితం సిద్ధించిన స్వాతంత్ర్యం ఎవరికోసం అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. 'స్వచ్ఛ, శుభ్ర భారత్ అసలు రూపం పాకీ పని' అనీ, దుర్గంధమయమైన జీవితాన్ని అనాదిగా ముళ్ళకిరీటంలాగా మోస్తున్న గొంతులు నినదిస్తున్నాయి. మానవ మలాన్ని ఎత్తే చివరి చేతులు తమవి మాత్రమే కావాలని ఆ సమూహాలు ప్రగాఢంగా కోరుకుంటున్నాయి. ఈ సమస్యకు ఉప కరణాలు, ఉపరితల కారణాలు ఎన్నైనా ఉండవచ్చు కానీ, దీనికి మూలం కులం మాత్రమేనన్నది నిజం. ఈ వృత్తి దళిత జాతి అంతిమ వికృతరూప విరాట్ స్వరూపమని స్పష్టం చేస్తున్నాయి.

ఆ స్త్రీల బాధామయ గాథలు మనల్ని కలవర పరుస్తాయి. 70 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం భారతదేశాన్ని శుభ్రపరిచే భారం కేవలం ఒకే కులం నెత్తిన ఉండటంలోని ఆంతర్యాన్ని తేటతెల్లం చేస్తాయి. సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచే పనిలో వెలువడే మీథేన్ విషవాయువుల కారణంగా మృత్యువాత పడిన కుటుంబాల అగమ్యగోచర స్థితిని వివరిస్తాయి. చివరికి తాగడం కారణంగానే వారు చనిపోయారని నమోదయ్యే కేసులు వారికి చట్టపరంగా రావల్సిన ఆర్థిక భరోసా అందకుండా చేయటాన్ని వెల్లడిస్తాయి. వాస్తవాలు ప్రపంచానికి తెలియకుండా దాచిపెట్టడంలోని పాలకుల దురుద్దేశాలను విడమర్చి చూపుతాయి. వీరి చావులకు ఎవరి బాధ్యత లేదనుకోవడమే కాక వారి చావులకు వారు మాత్రమే కారణంగా చూపే ఒక పలాయనవాద ప్రచారం యథాలాపంగా జరిగి పోవటాన్ని విమర్శిస్తాయి. దేశ సైనికుడికి ఏవిధంగానూ తీసిపోని తమ చావుల పట్ల సమాజ ఉదాసీనతను ప్రశ్నిస్తాయి. వీరి మరణాలకు పౌర సమాజం నుంచి కనీస స్పందన కూడా కరువుకావటంలో దాగిన రహస్యాలను వివరిస్తాయి. ఆ పనిలో ప్రమాదాల బారినపడి మురికి కారణంగా డాక్టర్లు వైద్యాన్ని అందించక చనిపోయిన యథార్థ, వ్యథార్థ జీవితాలు మనలను కలవరపరుస్తాయి. ఈ

వివక్ష హిందూమతానికే పరిమితం కాదనీ, ముస్లిం సమాజంలోని 'హేళాలు' మదర్సాలలో, మసీదుల్లో, శ్మశానాల్లో చూపే వివక్షల వికృతరూపాన్ని విప్పి చూపుతున్నాయి. ఇతర వర్గాలకు చిటికెలో దొరికే పరిష్కారాల కోసం తాము యేళ్ళకేళు వేచి చూడటంలోని అసలు రహస్యాలను వాళ్ళు గ్రహిస్తున్నారు. బాధిత సమూహం ఏ వర్గానికి చెందుతుందన్న విషయం పైనే పాలకులు సత్వర పరిష్కారాలు కనగొంటారని, లేదంటే దశాబ్దాలపాటు ఉదాశీనత ప్రదర్శిస్తారనీ స్పష్టం చేస్తున్నారు. ఇతర వర్గాలకు చిటికెలో దొరికే పరిష్కారాల కోసం తాము యేళ్ళకేళ్లు వేచి చూడటంలోని అసలు రహస్యాలను వాళ్ళు గ్రహిస్తున్నారు. వీరి మరణాలకు ఏ గౌరవ మర్యాదలూ దక్కకపోవటంలోని మూలాలను విప్పుతున్నారు. తాము కులాన్ని మార్చుకోలేకపోవచ్చు కానీ ఆ కారణంగా ఆయాచితంగా లభించే అవమానాలూ, అవిద్య, అనారోగ్యం వీటన్నిటినీ పోగొట్టుకుంటామనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాము వెల్లడించే వేదనలు తమవి మాత్రమే కావనీ ఎన్నో నోరులేని గత తరాలవనీ తెలియచేస్తున్నారు.

మానవ వ్యర్థాలను ఎత్తి పొట్ట నింపుకోవడం జీవితం కానేకాదని వారికి విశాలమైన మరో జీవితం ఉందని వారికి ఎరుక పరచడంలో ఎందరెందరో కృషి దాగి ఉంది. ముఖ్యంగా 'సఫాయి ఖర్మచారి ఆందోళన్'ను ప్రారంభించిన బెజవాడ విల్సన్, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్, ఆలిండియా ప్రోగ్రెసివ్ అసోసియేషన్ – శ్రీలత స్వామినాథన్, గరీమా అభియాన్ – ఆసిఫ్ షేక్, నవ సర్జన్– మంజులా ప్రదీప్, మార్టిన్ మక్వాన్, దళిత శక్తి కేంద్రం తదితరులు అందరూ అభినందనీయులు. వారికి మనుషులమన్న స్పృహ కలిగించి ప్రత్యామ్నాయ జీవన విధానాన్ని పరిచయం చేసిన మహోన్నత మానవులు. ప్రభుత్వాలూ, న్యాయ వ్యవస్థ, సమాజమూ దశాబ్దాలుగా సహాయ నిరాకరణ చేసినా తమ చేతుల్లోని చీపుర్లనీ, రేకుల్నీ, బుట్టల్నీ, మరిన్నింటినో వాళ్ళు విదిలించుకుంటారు. గత జీవితం నుంచి విముక్తమై ఆత్మగౌరవంతో, స్వావలంబన దిశగా తమ భవిష్యత్తును తాము నిర్మించుకుంటారు. ఈ దేశం మాత్రం తన మురికిని ఎప్పటికీ కడుక్కోలేదు. అది ఎన్ని తరాలైనా ప్రపంచానికి తన అసలైన రూపాన్ని ప్రదర్శిస్తూనే ఉంటుంది. ప్రపంచ మానవత్వం ముందు దోషిగా నిలబెడుతూనే ఉంటుంది. ఇది మురుగు భారతం, మరుగున పడిన భారతం, మరుగు పరచబడిన భారతం, ఇది అసహ్య భారతం, అదృశ్య భారతం, 'అశుద్ధ భారతం'. దీనిని మనసొగ్గి విందాం. బాసటగా నిలుద్దాం.

■

# పులుల్ని తినే లేళ్ళు మళ్లీ పుడతాయి

**అ**క్కడ
నెత్తుటిపూల అత్తరుని ముఖం నిండా పూసుకుని
అక్కడ మీరు ఆయుధంతో రాజ్యం సంపాదించారు
వేకువ ఉషోదయాన్ని రక్త సంధ్య చేసి
ఎన్నో ఏళ్ల నాటి గూళ్లలో విధ్వంసం పూయించారు
చిన్నారి పూలను చిదిమేసారు
కన్నె ప్రాయాలను తోడేళ్లలా కబళించారు
అంధకార గాంధార దేశంలో
జరిగే ఈ యుద్ధం నేటిది కాదు
ఆనాటి యుగపు రక్తపు చారిక ఆనవాళ్లు
ఇంకా మిగిలే వున్నాయి
కరవాలాలు విరిగిన ముక్కలు
తుపాకీ గుళ్ళలా నేటికీ తేలుతున్నాయి

మీరు దారుణం చేసి రాజ్యం గెలిస్తే
రక్తం చిందిన నేల రాజ్య పాలనకు నోచుకోదు..
ప్రణాన్ని మిగిల్చిన రణం
గెలిచిన రాజ్యంపై మచ్చగా మిగిలిపోతుంది
ఆకురాలిన అరణ్యం అవనిపై నిలువ లేదు
జనం రక్తపుటేరులపై నడిచిన ఏ నియంతా
చరిత్ర పుటల్లో ఒరిగి మిగిలిపోయాడే తప్ప
శిఖరం చేరలేదు కిరీటం ధరించలేదు...
గెలుపు గెలిచిన తుపాకీదయితే
ఓడిన ఆక్రోశం అజ్ఞాతంలోకి పోతుంది
మళ్లీ ఏదో నాడు అదే అంధకారపు వెలుగు
ఈ రణ రాజ్యాన్ని మింగేస్తుంది...!
పులుల్ని తినే మేకాలు ఇప్పుడక్కడ పుడితే
లేళ్లు వేటాడే మేకాల నెత్తురు
మళ్లీ ఏదో నాడు అక్కడ ఏరులై పారుతుంది!
మీరంతా గెలిచారనుకుంటున్నారేమో..!
అంకురం మొలవని
ఎడారిలో మొక్కలు మొలిపించడానికి...

**- పొత్తూరి సీతారామరాజు**
**99488 49607**







తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన పురస్కారాల విజేతలు; మంత్రి ఆదిమూలం సురేష్ నుంచి పురస్కారం అందుకుంటున్న సాహితీవేత్త, ప్రస్థానం పత్రిక సంపాదకవర్గ సభ్యుడు కెంగార మోహన్

# 13 మంది సాహితీవేత్తలకు గిడుగు భాషా సేవా పురస్కారాలు

గిడుగు రామమూర్తి జయంతి వేడుకల సందర్భంగా తెలుగుభాషా సాహిత్యరంగాల్లో విశిష్టసేవలందిస్తున్న వారికి ఏపి తెలుగు అకాడమీ భాషాసేవ పురస్కారాలను ప్రకటించింది. ఈ పురస్కారాలను శ్రీగిడుగు రామమూర్తి భాషా సేవా పురస్కారాలుగా రాష్ట్రవ్యాప్తంగా 13 మందికి గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్య ఎల్ వేణుగోపాల్‌రెడ్డి సమావేశ మందిరంలో ఆగస్టు 29న ప్రదానం చేశారు. వీరికి రాష్ట్ర విద్యామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ పురస్కారాలను అందించారు. అవార్డు గ్రహీతల్లో ఆచార్య శలాక రఘునాథశర్మ, డాక్టర్ మేడసాని మోహన్, శ్రీమొవ్వ వృషాద్రిపతి, డాక్టర్ కోడూరు ప్రభాకర రెడ్డి, వాడ్రేవు సుందరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ ఉపద్రష్ట వేంకట రమణమూర్తి, ఎస్ సుధారాణి, జి.ఎస్.చలం, కెంగార మోహన్, షహనాజ్ బేగం, మల్లిపురం జగదీశ్, పచ్చా పెంచలయ్య ఉన్నారు. తెలుగు – సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సమావేశంలో కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, నాగార్జున విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ వరప్రసాదమూర్తి, అకాడమీ సంచాలకులు వి.రామకృష్ణ పాల్గొన్నారు. దావులూరి అపర్ణ బృందంచే నృత్యప్రదర్శనలు, రంగం రాజేష్ బృందంచే తెలుగు వైభవ గీతాలాపన చేశారు.




**ఆర్సీ కృష్ణ స్వామి రాజు రచించిన 'పకోడి పొట్లం' కార్డు కథల సంపుటిని చిత్తూరు జిల్లా పుత్తూరులో ఆగస్టు 29న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఎ.మల్లేశ్వరరావు, కవి రొద్ద సురేంద్ర, తహశీల్దార్ టి.వి.సుబ్రమణ్యం, అద్దంకి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర్, రచయిత ఆర్సీ కృష్ణ స్వామి రాజు, వేదవ్యాస విద్యా సంస్థల కరెస్పాండెంట్ సి.బాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.**

# తెలుగు భాషను పరిరక్షించుకుందాం

**తె**లుగు ఆకాడమీని తెలుగు సంస్క అత ఆకాడమీగా మారుస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన తెలుగు భాషా పరిరక్షణ సదస్సు తీవ్రంగా ఖండించింది.. సదస్సుకు సాహితీ స్రవంతి కన్వీనర్ ఎల్.సురేంద్ర అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఎంఇఒ భవిరి శంకర్నాధ్ మాట్లాడుతూ.. తెలుగు అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి.. పదుగు పేకల్లాగా తెలుగు సంస్కృతం కలిసిపోయాయనటం విచారకరమని అన్నారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్, కవి వంగీపురపు నవీన్ మాట్లాడుతూ.. దీనికి నిరసనగా అందరిని కలుపుకొని వేలాది సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి మెమోరాండం సమర్పించాలని ప్రతిపాదించారు. సాహిత్యకారుడు మేడిపల్లి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ.. ఎవరికీ అర్థం కాని సంస్కృతాన్ని తెలుగుపై రుద్ది తెలుగును చంపేయ్యటానికి ప్రయత్నిస్తున్నారన్నారు. యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్, కవి వసుధ బసవేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవటానికి ఐక్యంగా పోరాడదామని అన్నారు. ఇంకా ప్రముఖ కవి గునుకుల మాల్యాద్రి, ఉద్యమకారుడు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ...



తెలుగు భాషను రక్షించుకోవటానికి ప్రజలందరూ కలసి రావాలన్నారు. రిటైర్డ్ లెక్చరర్ గాంధీ మాట్లాడుతూ. .మాతృభాషలో చదువులేక పోతే విద్యార్థులు నైపుణ్యం కోల్పోతారన్నారు. విద్యార్థి షైక్ సమీర్ తెలుగు భాషపై ఓ కవిత చదివి వినిపించారు. సిహెచ్.రూప పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సిపి రెడ్డి, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నీలం మురళీ కఅష్ణారెడ్డి, తెలుగు రైతు అధ్యక్షులు చల్లగుళ్ల సుబ్రమణేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు కె.సురేష్, ఎస్.రాంబాబు, రావూరి రాజు, రిటైర్డ్ బాంక్ ఉద్యోగి ధర్మరాజు ఐద్వా కార్యదర్శి పి. రజని, సుధాకర్, కెవిపిఎస్ అధ్యక్షులు వి.ఎస్సాయ్య, వాసు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం



**కాకినాడలో ఉండవల్లి ఎం కు పురస్కారం అందిస్తున్న దృశ్యం**

**శ్రీ** మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్, విజయవాడ వారు ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా కథ, కవిత, ఇతర సాహితీ ప్రక్రియల్లో 28-08-21 శనివారం సాయంత్రం 6 గంటలకు అంతర్జాల వేదికగా పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ ఏడాది శ్రీ మక్కెన రామసుబ్బయ్య కథా పురస్కారం కాకినాడ పట్టణానికి చెందిన ఉండవల్లి ఎం రచించిన కథల సంపుటి 'అంకితం'కు బహుకరించారు. ప్రముఖ సాహితీవేత్త మాకినీడి సూర్య భాస్కర్, విశ్రాంత ఎమ్ఆర్ఓ గౌరు నాయుడు అతిథులుగా పాల్గని వారిని సత్కరించారు. మహబూబాబాద్ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారాన్ని ప్రముఖ కవి, విమర్శకులు మద్దెర్ల రమేష్, మైస శ్రీనివాస్ అతిథులుగా పాల్గని తండా హరీష్ గౌడ్ రచించిన 'ఇన్ బాక్స్' కవితా సంపుటికి పురస్కారాన్ని అందజేశారు. కోటిపల్లిలో జరిగిన మరో కార్యక్రమంలో యానాంకు చెందిన ప్రముఖ సాహితీవేత్త మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, స్థానిక పశు వైద్య నిపుణులు డాక్టర్ కె రాజేష్ గార్ల చేతుల మీదుగా డాక్టర్ కె వి రావు సాహితీ పురస్కారాన్ని ఎరుకలపూడి గోపీనాథ్ రావు రచించిన 'దృశ్య వర్ణాలు" నానీల సంపుటికి అందించారు. ఈ పురస్కారాల కింద ప్రతి విజేతకు రూ. 7,000 ల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించినట్టు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ మక్కెన శ్రీను తెలిపారు. రచయితల పుస్తకాలను శ్రీరామ సాగర కవచం, ఎండీ రహీమ్ ఉద్దీన్, మధునాపంతుల పరిచయం కావించారు.

# గురజాడ అప్పారావు

జననం : 21.9.1862 మరణం : 30. 11.1915



'ముత్యాలసరాలు' కవిత్వంలోనూ 'కన్యాశుల్కం'తో
నాటకరంగంలోనూ సంచలనం సృష్టించారు.
మానవతా సందేశంతో నవకవిత్వానికి నాంది పలికారు.
వాడుక భాష వ్యాప్తికోసం గిడుగుతో కలిసి పోరాడారు.
ఇతివృత్తాలలోనూ, పాత్రల ఎంపికలోనూ నూతన సంప్రదాయాలను
ప్రవేశపెట్టారు. మూఢనమ్మకాలను త్రోసిపుచ్చారు.

# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కార్నూలు, అనంతపురం